# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 1 | అక్టోబరు 2023 | వెల : రూ.15

మోదీని కలవరపరుస్తున్న ఇండియా

మహాత్ముని జీవితం.. ఒక మహాకావ్యం

గాంధీజీ ఆలోచనలకు విలక్షణ వ్యాఖ్యాత డా.రామమనోహర్ లోహియా

విలక్షణ పాత్రికేయుడు.. గాంధీజీ

గాంధీ అనే ఒకరుండేవారు ఒకప్పుడు

స్వాతంత్ర్య సంగ్రామంలో జర్నలిస్టులు

అండమాను జైలులో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు

జి-20 ఢిల్లీ ప్రకటన, ప్రస్తావించని అంశాలు

మహిళా రిజర్వేషన్‌లకు గీతా ముఖర్జీ అవిరళ కృషి

మహిళా రిజర్వేషన్ : మరో 'జుమ్లా' !

ఈ యుద్ధం సనాతన ధర్మమంత ప్రాచీనం!

దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు !

అభ్యుదయ సాహిత్య వారసత్వాన్ని నిలబెట్టుకుందాం

వైజ్ఞానిక రంగంలో తెలుగు భాషా వికాసం

గురజాడ బతికేడు మూడు యాభైలు

గురజాడ జీవితంలో బౌద్ధం

అక్షరమా నీకు వందనం

ఎప్పటికీ అందరికీ సంజీవదేవ్

తెలంగాణ రైతాంగ పోరాటం - వాస్తవాలు

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్

అక్టోబరు - 2023

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 1


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. మోదీని కలవరపరుస్తున్న ఇండియా.. - సంపాదకీయం 3
2. మహాత్ముని జీవితం.. ఒక మహాకావ్యం - దేవరకొండ బాలగంగాధరతిలక్ 4
3. గాంధీజీ ఆలోచనలకు విలక్షణ వ్యాఖ్యాత డా.రామమనోహర్ లోహియా - డా॥ నాగసూరి వేణుగోపాల్ 7
4. విలక్షణ పాత్రికేయుడు.. గాంధీజీ - బెందాళం క్రిష్ణారావు 9
5. గాంధీ అనే ఒకరుండేవారు ఒకప్పుడు - డాక్టర్ కనుపర్తి విజయబక్ష్ 11
6. స్వాతంత్ర్య సంగ్రామంలో జర్నలిస్టులు - ముహమ్మద్ అజ్గర్ అలీ 13
7. అండమాను జైలులో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు - పి.వి.సుబ్బారావు 14
8. జి-20 ఢిల్లీ ప్రకటన, ప్రస్తావించని అంశాలు - ప్రభాత్ పట్నాయక్ 16
9. మహిళా రిజర్వేషన్‌లకు గీతా ముఖర్జీ అవిరళ కృషి - వినయ్‌విశ్వం 18
10. మహిళా రిజర్వేషన్ : మరో 'జుమ్లా'! - పి.చిదంబరం 20
11. ఈ యుద్ధం సనాతన ధర్మమంత ప్రాచీనం! -డాక్టర్ ప్రసాదమూర్తి 22
12. దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు ! - డా.దేవరాజు మహారాజు 23
13. అభ్యుదయ సాహిత్య వారసత్వాన్ని నిలబెట్టుకుందాం 25
14. వైజ్ఞానిక రంగంలో తెలుగు భాషా వికాసం -డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ 28
15. గురజాడ బతికేడు మూడు యాబైలు! - అట్టాడ అప్పల్నాయుడు 31
16. గురజాడ జీవితంలో బౌద్ధం - టి.రవిచంద్ 33
17. అక్షరమా నీకు వందనం - వి.విజయకుమార్ 37
18. ఎప్పటికీ అందరికీ సంజీవదేవ్ - జంపాల శ్రీమన్నారాయణ 38
19. తెలంగాణ రైతాంగ పోరాటం-వాస్తవాలు - సారంపల్లి మల్లారెడ్డి 39
20. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్.. 41
21. కార్టూన్స్ 43
22. కొత్త పుస్తకాలు స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

**దారి దీపం**

మాసపత్రిక


మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



## సంపాదకీయం

# మోదీని కలవరపరుస్తున్న ఇండియా

ప్రతిపక్ష కూటమి తన పేరును 'ఇండియా'గా ప్రకటించింది. ఈ పేరు మోదీని కలవరపరుస్తున్నది. పెనుభూతంలా ఆయనను భయకంపితుణ్ణి చేస్తున్నది. ఆయన తొలి విమర్శ ఇండియా అన్నది వలస పాలకులు పెట్టిన పేరుగా ప్రకటించి తన జాతీయతను చాటుకోవాలని ప్రయత్నించారు. ఈ పేరు కూడా ఈస్టిండియా కంపెనీలాంటిదేనని ఎద్దేవా చేశారు. దీనిని మరింత ముందుకు తీసుకుని వెళ్లడానికి జీ-20 సమావేశాలకు రాష్ట్రపతి ఇచ్చే ఆహ్వానాన్ని వాడుకున్నారు. దాని మీద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని ముద్రింపజేశారు. మన రాజ్యాంగం "ఇండియా దట్ ఈజ్ భారత్" అని ప్రకటించింది. రాజ్యాంగాన్ని మార్చకుండానే ఇండియాను తొలగించాలనే సాహసానికి మోదీ ఒడిగట్టారు.

చారిత్రకంగా ఇండియా అన్న పేరు సింధు నది నుంచి పుట్టింది. గ్రీకులు దానిని ఇండస్ అన్నారు. గ్రీకు యాత్రికులు ఇండస్ దాటి వున్న ప్రదేశాన్ని ఇండికా అన్నారు. అదే ఇండియాగా రూపాంతరం చెందింది. ఇది బ్రిటిష్ వాళ్లు పెట్టిన పేరు కాదు. ఆ పేరునే బ్రిటిష్ వాళ్లు వాడుకుని స్థిరపరిచారు. ఈ పేరు వలస పాలకుల వారసత్వం కాదు. మహాభారతం నుంచి వాడుకలోకి వచ్చిన పేరు భరత వర్షం లేదా భారత్. ఇండియా పేరుచారిత్రకమైంది, భారత్ ఇతిహాస జనితమైంది. రాజ్యాంగం ఈ రెండింటిని సమన్వయపరిచింది. ఐతే చరిత్ర వక్రీకరణల క్రీడలో వున్న వారి నుంచి ఇలాంటి పరిజ్ఞానాన్ని ఆశించడం వృథా శ్రమ అవుతుంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యకలాపాలన్నింటా ఇంగ్లీషులో ఇండియా, హిందీలో భారత్ వాడుతున్నారు. ప్రాంతీయ భాషల్లోనూ దాదాపు ఇదే పద్ధతి వాడకంలో వుంది. ఇండియాను తొలగించడానికి రాజ్యాంగాన్ని మార్చాలి. అలాగే ఇండియా అని వున్న ప్రతిచోటా దానిని భారత్‌గా మార్చాలి. లేదా ఆ భాగాన్ని తొలగించాలి. ఈ మార్పు చేయడానికి లక్షల కోట్లు కావాలి. పైగా కరెన్సీ నోట్లపై వున్న ఇండియాను తొలగించడానికి తిరిగి నోట్ల రద్దు కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇది కూడా గతమంత తేలిక కాదు. ఒకటి, రెండు నోట్ల రద్దుతో అయ్యేది కాదు. 500 రూపాయల నోటు దగ్గర నుంచి ఐదు రూపాయల నోటు వరకు పాతవి రద్దు చేసి, కొత్తవి ప్రవేశపెట్టాలి. దీనికితోడు నాణేలను మార్చాలి. గతంలో నోట్ల రద్దుకంటే అనేక రెట్లు ఎక్కువ అవుతుంది. అంతటి దుస్సాహసానికి పాల్పడే స్థితి ప్రస్తుతం మోదీకి వున్నట్టు లేదు. కేవలం ఎన్నికల ప్రచారానికే వాడుకునే ప్రయత్నంగానే కనిపిస్తున్నది. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో నల్లేరు మీద బండిలా ఆయన గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు.

ఇప్పుడు దేశ రాజకీయాలలో కొత్త పరిస్థితి నెలకొంటున్నది. గతంలో ప్రతిపక్షాలు బలంగా వున్న రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలలో విజయాలు సాధించాయి. కాని, ఆ రాష్ట్రాలలో పార్లమెంటు ఎన్నికలలో మోదీ ఏకపక్షంగా విజయాలు సాధించారు. జాతీయస్థాయిలో మోదీని ఢీకొట్టే నాయకత్వం లేకపోవడమే దీనికి కారణం. భారత్ జోడో యాత్ర తర్వాత ప్రతి రోజూ మోదీని ఢీకొడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇండియా పేరుతో ప్రతిపక్ష కూటమి అన్ని రాష్ట్రాలలో ప్రతిచోటా ఒకే అభ్యర్థితో తలపడడానికి కసరత్తు చేస్తున్నది. మోదీ విద్వేష రాజకీయానికి ప్రతిగా జన జీవనం చుట్టూ ప్రత్యామ్నాయ విధానాలవైపు ఈ కూటమి అడుగులు వేస్తున్నది. ఈ పరిణామాలే మోదీని కలవరపరుస్తున్నాయి. ఇండియా కూటమి మీద పోరాటాన్ని ఇండియా మీద పోరాటంగా మార్చాలన్న మోదీ ప్రయత్నం గెలుపు ఆటలో మరో పాచిక మాత్రమే.


**- డీవీవీఎస్ వర్మ**

**సంపాదకులు, 85006 78977**

# మహాత్ముని జీవితం.. ఒక మహాకావ్యం



- దేవరకొండ బాలగంగాధరతిలక్



**ఇన్నియేళ్ళ అనంతరం కూడా గాంధీజీని గురించి ఉద్రేకం లేకుండా ఆలోచించడం కష్టంగానే వుంది. ఒక వ్యక్తి జీవితంలో బాల్యంలోనూ ప్రారంభ యౌవనంలోనూ జరిగిన కొన్ని సంఘటనలు - ప్రథమ ప్రేమ, ప్రథమ విజయం లాంటివి - తర్వాత ఎంతో నిర్హేతుకంగా కనిపించినా అవి జీవితంలో భాగం అయిపోయి ఎప్పుడు తలపెట్టినా నిలువునా స్పందించేటట్టు చేస్తాయి. జాతి జీవితంలో కూడా అంతే. గాంధీని మన నుండి మన అనుభవ పరిమాణాన్నుండి విడిగా చూడడం కష్టం. మనలో సున్నితంగా ఆవరించుకున్న చైతన్యం అంతటా గాంధీ స్పృహ నీరవంగా ఉంది. గాంధీని విడదీసి భారతదేశాన్ని చూస్తే దేశం అంతా కొత్తగా, మనది కాదన్నట్టుగా కనిపిస్తుంది.**

ఆ సాయంత్రం రేడియోల దగ్గర గుంపులు గుంపులుగా జనం కూడి గాంధీ మరణవార్త విన్న దృశ్యం యింకా ప్రగాఢంగా మనస్సులో నిలిచివుంది. ఒక భూకంపం, ఉప్పెన వచ్చి నగరాలకి నగరాలు కొట్టుకుపోవడం మనకి తెలుసు. తర్వాత రోజున బావురుమంటూన్న శిథిలాల్లో తమ వాళ్ళనీ, తమ వస్తువుల్నీ, తమ జ్ఞాపకాల్నీ ఎండిన ఏడుపు కళ్ళతో వెతుక్కుంటూ ఉంటారు మనుష్యులు. గాంధీజీ నిర్యాణం అటువంటి పరిమితి లేని దుఃఖాన్ని కలిగించింది. ఎటు వచ్చీ మనం అలాగ వెతుక్కోలేదు. మన వంట్లోనే మనలోనే ఒక భాగం చటుక్కున చచ్చిపోయినట్లయింది. గాంధీజీ మృతికి ప్రతి హృదయంలోనూ కొంత శ్మశానం ఏర్పడింది. నాడు ప్రపంచం అన్నిచోట్ల నుండి కురిసిన ప్రశంసా వర్షంతో దుఃఖంతో పొంగిపొరలే కోటానుకోట్ల గుండెల్ని మరీ అల్లకల్లోలం చేశాయి. అటువంటి వాడు క్రైస్తు తర్వాత మరి ఒకడు భూమి మీద అడుగిడలేదని ఐన్‌స్టీన్ అన్నప్పుడు, అతను అడుగిడిన ప్రతి చోటా ఒక దేవాలయం నిలిచిందని నెహ్రూ అన్నప్పుడు, ప్రజల దుఃఖం ఉపశమింపలేదు. పైగా పొందిన నష్టం యొక్క అపరిమితత్వం తెలిసి మరీ కంగారు పెట్టివేసింది. 'నేనెప్పుడూ గాంధీజీని ఎరగను. కానీ నాకు ఎవరో ఆప్త బంధువు పోయినట్టు బాధగా వుంది' అన్న ఫ్రెంచి ప్రధాని లియోన్‌బ్లమ్ మాటలు సకల విదేశీయుల మనఃస్థితికి వర్తించాయి ఆ రోజుకి.

అసలు మనిషి చాలా భయస్థుడు. ప్రాణకోటిలో ఒక విధంగా యింత భీరుత్వం యింకెవరికీ ఉండదేమో అనిపిస్తుంది. మనిషిని సుఖంగా తిని ఆడుకుంటూ పాడుకుంటూ కూర్చోనివ్వక పరిపాలన యంత్రమూ, సిద్ధాంత విభేదాలు, పన్నులు, చట్టాలు, రోగాలూ అన్నీ అతని మీద దాడిచేశాయి. అందులో పదేళ్ళకోసారి భయంకరంగా వచ్చిపడే యుద్ధం అతన్ని మరీ భీతావహుణ్ణి చేసింది. దేవుళ్ళనీ, తంత్రాల్నీ మంత్రాల్నీ ఎన్నో సృష్టించుకున్నాడు.

తన ధైర్యం కోసం మానవుడు అయినా యీ యుద్ధాలు ఒకదాని కన్న ఒకటి ఘోరతరంగా శాస్త్రీయ హనన పద్ధతులతో

విస్తృత వినాశనకర శక్తితో మానవుడి ఉనికినే పెళ్ళగించే పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే యూరప్‌లోని ప్రజాసామాన్యం కూడా ఈ గాంధీ అన్నవాడు యుద్ధాన్ని ఆపు చేస్తాడేమో అన్న భరోసాని అజ్ఞాతంగా కలిగి వున్నారు కోట్లు. అందరికి గాంధీ దేవుడి కన్న నిజమైన దేవుడై ఈ శిథిల జగత్తుకు ఆలంబనగా కనిపించాడు. అందుకే ప్రపంచమే గాంధీజీ నిర్యాణానికి నిస్సహాయంగా దీనంగా ఆక్రోశిస్తున్న అనాథలాగా అనిపించింది. ఒక మత విశ్వాసం ప్రగాఢంగా వున్న హెన్రీపోలక్, సి.ఎస్. ఏండ్రూస్, మీరాబెన్ వంటివారు అనుయాయులుగా గాంధీజీ ప్రియశిష్యులై సంచరించడం మనం అర్థం చేసుకోవచ్చు. కానీ గాంధీజీ స్వభావానికి అభిప్రాయాలకి విభిన్నులైన వారు కూడా గాంధీజీలోని ఒక ఆకర్షణకి ఒక బలీయమైన శక్తికి లోబడిపోయారు. మతమూ వేదాంతమూ అంటే చిరాకూ, సైన్సూ సామ్యవాదమూ అంటే అభిమానమూ కల నెహ్రూ పండితుడు తన రచనల్లో గాంధీ ప్రసక్తి వచ్చినప్పుడల్లా కావ్యత్వం సిద్ధించే భావౌన్నత్యాన్నీ రమణీయకతనీ ప్రదర్శించాడు. గాంధీని అర్థం చేసుకోవడంలో నెహ్రూ ప్రదర్శించిన విశాల హృదయం అతన్ని మామూలు రాజకీయ వేత్తలకన్న ఎత్తున నిలబెట్టింది.

జనరల్ మార్షల్ స్మట్సు గాంధీజీ ప్రభావానికి లోనయిన ప్రత్యర్థులలో ఒకడు. గాంధీజీ కానుకగా ఇచ్చిన పాదరక్షల్ని కొన్నేళ్ళ అనంతరం తిరిగి పంపుతూ 'చాలా కాలం వీటిని ధరించాను. కానీ ఈ గొప్ప వ్యక్తి పాదముద్రిత ప్రదేశాలలో అడుగిడడానికి నాకు అర్హత లేదు' అంటాడు. అదే కాదు 'ఇంత మహాత్ముడని తెలిసి వుండి కూడా అతనితో ఢీకొనవలసి రావడం నా దురదృష్టం" అని వాపోతాడు.

గాంధీజీ ఈ ప్రభావానికి కారణం ఏమిటో ఎంత ఊహించినా చెప్పలేము. మతం, సర్వసంగ పరిత్యాగం, అహింస, ప్రజాసేవ, ఆధ్యాత్మిక రోచిస్సు, అమాయకత్వం, సత్యం, న్యాయం, ధైర్యం, కరుణ – వీటిలో గాంధీజీలో లేని గుణం ఏమిటి ? ఏ గుణం ఎక్కువపాళ్ళు వుంది ? ఏ ఒక్క గుణం ఒక దేశంలోని కోటానుకోట్ల ప్రజలను అంతవరకూ జటభూతులైన గొంగళి పురుగుల్లాంటి వారినీ కదిపి కుదిపి విద్యుత్కయస్కాతఘాతంతో ముందుకు నడిపించింది. అరెస్టు చేయడానికి వచ్చిన ఆఫీసరూ, శిక్ష విధించే జడ్జీ, పరిపాలించే వైస్రాయీ, ఎందుకు లోపల్లోపల సిగ్గుతో చచ్చిపోయారు ? ఏ వ్యక్తికి దర్శనంతో స్త్రీ పురుషులు భక్తితో తమ ఒంటిపై నున్న నగలన్నీ వొలిచి ఇచ్చారు ? ఏ వ్యక్తి ఉపవాస దీక్షకు ఊపిరాపి లోకం స్తంబించి నిలిచిపోయింది? బహుశా కొన్ని తరాల వరకూ తిరిగి యిటువంటి సమ్మోహనకరుడు జన్మించగలడంటే నమ్మకం పుట్టదు!

ఇంకా ఆఫ్రికా నుండి భారతీయ రంగంలో అడుగుపెట్టక ముందే గాంధీజీని గురించి ప్రొఫెసర్ గిల్బర్ట్‌ముర్రే అన్నమాటలు స్మరణీయమైనవి. 'జాగ్రత్త ఇంద్రియసుఖాల్ని భోగాల్నీ పొగడ్తల్నీ పదవుల్నీ లక్ష్యం చెయ్యని ఈ వ్యక్తిని చూసి చాలా జాగ్రత్తగా మసలుకో! అతను తాను నమ్మినది కడకంటా అనుసరించే పట్టుదలగలవాడు. అతను చాలా భయంకరమైన శత్రువు. ఎందుకంటావా నువ్వెప్పుడూ అతని దేహాన్ని సులువుగా జయించగలవు, కానీ అతని ఆత్మని అంగుళం కూడా లోబరుచుకోలేవు.'

గాంధీజీని అర్థం చేసుకోలేని వాళ్ళలో యం.యన్.రాయ్ ప్రధానుడు. గాంధీజీని చాలా తప్పుడు రాళ్ళతో తూకం వేశాడు. గణితంతో మనిషి స్వభావాన్నీ ఉద్రేకాల్నీ లెఖ్ఖ కట్టలేము. ఎందుకట్టెలాంటి హేతువాదాన్ని గతి తార్కికవాద సూత్రాల్నీ ఆధారం చేసుకుని గాంధీ సిద్ధాంతాల్ని ఒక్కొక్కటే శస్త్ర చికిత్స చేసిన అవివేకం రాయ్ ప్రదర్శించాడు. సజీవమైన జాతినీ, వ్యక్తినీ అర్థం చేసుకోవాలంటే మస్తిష్కంతోనే కాదు, హృదయం కూడా ఉండాలి. 'రాయ్'లో ఈ రెండవ దాని స్పందన చాలా అస్పష్టంగా వినబడింది.

గాంధీజీని అర్థం చేసుకోకపోవడమే కాదు, బుద్ధి పూర్వకంగా శత్రుత్వాన్ని సాధించినవాడు క్వాయిదే ఆజామ్ జిన్నా, పాకిస్తానీయులందరూ తప్పని సరిగా వాడే ఈ బిరుదం మహాత్ముడు ప్రసాదించిందే అన్నప్పుడు మనకి విచారంలో కూడా హాస్యం కలుగుతుంది. యం.యన్.రాయ్ యొక్క వ్యతిరేకత స్వభావ సిద్ధాంత దృక్పథాల వ్యత్యాసం వల్ల కలిగినది. కానీ, రాయ్ వల్ల దేశానికి, గాంధీకి జరిగిన హాని లేదు. కానీ జిన్నా పాలు తాగి విషాన్ని యిచ్చే చాతుర్యం కలవాడు. అంతరాత్మ, ఔదార్యం, ప్రజాహితం, ఆదర్శం అన్నవి జిన్నాకి అపరిచిత పదజాలం. తన నాయకత్వం కోసం తనకున్న అసలు నమ్మకాల్ని అణచివేసి, ప్రజల మతావేశాన్ని సాధనగా తీసుకుని ఒకనాడు దేశాన్ని రెండుగా చీల్చినవాడు జిన్నా. గజనీ మహమ్మదువంటి తురుష్కులు వచ్చి దేశాన్ని దోచుకున్నారే తప్ప దేశ స్వరూపాన్ని భంగించలేదు. తక్కిన మహమ్మదీయులు ఢిల్లీలో సింహాసనాధిష్ఠ కుతూహలపరులేగాని ఇటువంటి ఘోరాలేవీ చెయ్యలేదు. బ్రిటిషు వారి సహాయ సానుభూతులతో ఈ రాక్షసకార్యాన్ని అమలు జరిపించిన జిన్నాకు చరిత్రలో ఏ స్థానం ఇవ్వాలో తెలియదు.

**పాకిస్తాన్ విభజనానంతరం జరిగిన రక్తపాతానికి పైశాచిక ప్రవృత్తుల తాండవానికి గాంధీజీ ఎంత చలించిపోయాడు ? గాంధీకి మృత్యువును ప్రసాదించిన మొదటి గుండును గాడ్సే పేల్చలేదు. ఆ గుండు నౌఖాళీలో బెంగాల్‌లో పంజాబ్‌లో పేలింది. ఎటువచ్చి అది చేసిన గాయం బాహిరమైనది కాదు. గాంధీజీకి చివరి రోజులలో ఆనందం లేదు. ఈ పాక్షిక స్వాతంత్ర్యం ఆయనకి రుచించలేదు. అయినా అంగీకరించాడు.**

జిన్నాకి లీగ్‌కి ఈ ప్రాముఖ్యతని ప్రసాదించింది మహాత్ముడేనని, దీనికి కారణం మహాత్ముని రాజకీయ కుశలతలోని (టాక్ట్ అండ్ డిప్లొమసి) లోపమనీ మౌలానా అజాద్ బాధపడ్డాడు. ఒక మృతప్రాయమైన దేశాన్ని మేలుకొలిపి జ్వాలాసదృశ్యమైన స్వతంత్రావేశాన్ని హృదయాలలో రగులు కొలిపిన శక్తి మహాత్ముడిది. స్వతంత్రం వైపు పయనించారేగాని యిన్ని కోట్ల ప్రజలూ ఏళ్ళతరబడి పట్టుకు వేలాడే సంకుచిత దృక్పథాన్ని వదిలించుకోలేకపోయారు. గాంధీజీ యింకా కొన్నేళ్ళు బ్రతికి వుంటే ఏం జరిగేది? అన్న ప్రశ్న విచిత్రమైనది.

కాని గాంధీజీలాంటి వాళ్ళు బధిరాంధత్వాలతో పండు ముసలితనం వరకూ బ్రతకడంలో ఒక సామాన్యత వుంది. అరుచివుంది. గొప్ప వాళ్ళ జీవితాలకి గొప్ప కావ్యాలలోలాగా అద్భుతమైన అంతం వుంటుంది కాబోలు. గాంధీ అనే యీ మహత్తర కావ్యానికి (Epic) అనుకోని ముగింపు తీసుకువచ్చే అవకాశం సంకుచిత మతోన్మాది అయిన గాడ్సేకు లభించింది. రామ్ రామ్ అంటూ నేలకొరిగిన మహాత్ముని కన్న విషాదం గొలిపే దృశ్యం ఈ యుగంలో వేరు ఎవరూ చూడలేదు. చూడబోరు. అలాగే రాముడికన్నా, కృష్ణుడికన్నా కూడా దైవీయపదవితో దేశ దేశాల ప్రజల హృదయంలో చిర ప్రతిష్ఠితుడైన గాంధీజీ ప్రపంచపౌరుడని తెలిసికూడా నా దేశీయుడనుకోవడం నాకు గర్వం కలిగిస్తుంది.

గాంధీజీ తన జీవితకాలంలో చెప్పినది వ్రాసినది చాలా చాలా ఉంది. కాని వాటితో గాంధీజీని కొలవడానికి ప్రయత్నించడం మూర్ఖత్వం. గాంధీజీ తాను చెప్పిన దానికన్న చేసిన దాని కన్న గొప్పవాడు. ఒక మహావ్యక్తి ప్రభావాన్ని అతని మాటలలోనే చూడాలనుకోవడం చెట్ల మీదా ఇళ్ళ మీదా పడిన సూర్యకాంతిని బుట్టలలోకి ఎక్కించి దాచాలనే ప్రయత్నం లాంటిది. ఏసుక్రీస్తు, బుద్ధుడు, గాంధీ లాంటివారు ఏవో కొన్ని యుగాలకి కాని భూమినవతరించరు. అయితే వారులేని చరిత్ర నిస్సారమైనది. ఒక్కొక్కసారి ఒక్కొక్క వ్యక్తి దేశంకన్నా మనుష్యులకన్నా గొప్పవాడైపోతాడు. ఈ సృష్టి పరమార్థం ప్రావాహికంగా వస్తున్న ఈ ప్రజాకోటిని నిర్లక్ష్యం చేసి ఏ ఒక్కరినో ఎన్నుకుని వానిలో వికసిస్తుంది కాబోలు వారు ధన్యులు. వాళ్ళే చరిత్రకి, జీవితానికి ఒక అర్థం ఇవ్వగలరు. లేనిదే యీ మహాప్రస్థానం చీకట్లో అంధుల ప్రయాణం వంటిది. గుడ్డి వాళ్ళ భాగవతం వంటిది. గాంధీజీ మత విశ్వాసమూ దైవభక్తీ ఈ నాడు విద్యార్థికులలో ఒక భాగానికి రుచించవు, అర్థమూ కావు. కాని అదే విశ్వాసంతో ఎన్నో పురాతన సంప్రదాయాల మీద, విశ్వాసం మీద దాడి సలిపాడు. రామనామ సంకీర్తన కావిస్తూనే హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాడు. వనితాలోకాన్ని స్వేచ్ఛలోకి యుద్ధరంగంలోకి ఆహ్వానించాడు. హరిజనులూ స్త్రీలూ – ఈ రెండు జాతుల దుస్థితినీ గుర్తించిన ధీశాలి గాంధీ. నీ దేవుడినీ, నీ మతాన్నీ నీకన్నా బాగా అనుసరించి కీర్తించి ఆచరించి, నీలో అయఃకారిన్యతతో నిలబడ్డ అదే మతపు పురాతనపు నమ్మకాల్ని కొన్ని మొదలంట పెకలించాడు. మరొకడెవడైనా ఈ సంస్కరణలనే తీసుకురావాలని ప్రయత్నించి వుంటే యింత విజయం చేకూరేదికాదు.

సత్యమూ అహింసా అన్న ఈ రెండు ఆదర్శాలూ గాంధీజీ క్రొత్తగా ప్రవచించినవి కావు. ఉత్తమాటలుగా చప్పబడిపోయిన వీటికి మళ్ళీ కొన్నివేల ఓల్టుల చైతన్యాన్ని కలిగించాడు. ముఖ్యంగా అహింసని ఆచరణలో పెట్టే విధానమూ హింస నెదుర్కొనే విధానమూ గాంధీ ప్రయోగశాలలోనే రూపొందిన ఆయుధాలు. సత్యాగ్రహమూ నిరాకరణోద్యమమూ మున్ముందు ఎక్కువగా దేశ దేశాలలో అనుసరింపబడవచ్చుననడానికి సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికాలో నీగ్రోలు సత్యాగ్రహం అవలంబించిన సంగతి మనకి తెలుసు. ఈ రోజున బెర్ట్రాండ్ రస్సెల్ అణు యుద్ధ వ్యతిరేకంగా నడిపించే ఉద్యమంలో ఈ సత్యాగ్రహ సూత్రం గర్భితంగా ఉంది. అణ్వస్త్రాలు వచ్చి యుద్ధం మీద మానవుడు తుది నిర్ణయాన్ని తీసుకునేటట్టుగా చేశాయి. బుద్ధిమంతులందరూ అస్త్రశస్త్రాలతో సమస్యలు పరిష్కరించుకోవడమే మంచిది కాదనీ ఈ విధానమే క్రమంగా అణుప్రమాదానికి దారి తీసిందనీ గ్రహించారు. కానీ ఏదో ఒక యుద్ధవిధానం మనిషికి కావాలి. అన్యాయాన్ని ఎదుర్కోడానికైనా దానికి సత్యాగ్రహం తప్ప వేరుమార్గం లేదేమో!

గాంధీజీ ఉద్దేశాలూ సూత్రాలూ ఈనాడు మనమెంత వరకూ ఒప్పుకుంటామన్నది ఆలోచనీయాంశమే! నా మటుకు నేను చాలావాటిని అంగీకరించలేను. ఖద్దరు మీదా బ్రహ్మచర్యం మీదా పరిశ్రమల మీదా పాపపుణ్యాల మీదా గాంధీజీ అభిప్రాయాలు హేతువుకి చరిత్రకి దూరంగా వున్నట్టు తోస్తాయి. రాజకీయాలూ మతావేశమూ విడివిడిగానే ప్రపంచాన్ని ఎంతో క్షోభింపచేశాయి. ఇప్పుడు రెండింటినీ కలిపితే వచ్చే పరిణామం ఊహించడానికే భయంగా వుంది. రాట్నం, కదురూ లాంటివి స్వతంత్ర సమరంలో ఒక ప్రయోజనాన్ని సాధించాయి. ఈనాడు బొత్తిగా ఎప్పటివో అనాది శిథిలాలుగా కనబడతాయి అవి.

ఈనాటి కొందరు యువకులూ విద్యార్థికులూ గాంధీజీని గురించి ప్రదర్శించే అజ్ఞానమూ, చేసే హేళనా ఆశ్చర్యకరంగా బాధాకరంగా వుంటాయి. అత్యంత ప్రముఖమైన ఒక మహత్తర దశకు వారు సమకాలికులు కాకపోవడమే ఈ దృక్పథానికి కారణమైతే కొంత సరిపెట్టుకోవచ్చును. కాని ఆధునికమైన కొన్ని సిద్ధాంతాల్నీ నినాదాల్నీ అపక్వంగా జీర్ణించుకుని గాంధీజీని వేళాకోళం చేయడం సాంస్కృతికంగా చారిత్రకంగా వారి దృక్పథలోపాన్ని తెలుపుతుంది. ఈ పరిణామం చాలా ఆందోళనకరమైనది. ❑

# గాంధీజీకి ఆలోచనలకు విలక్షణ వ్యాఖ్యాత డా.రామమనోహర్ లోహియా



- డా నాగసూరి వేణుగోపాల్

'సంఘ సంస్కర్తలలో రాజకీయాలకు సంబంధించినంత వరకు ప్రతీపశక్తులకు ప్రతినిధులుగా నిలిచే వారెందరు లేరు ? రాజకీయ విప్లవవాదులలో మత మౌఢ్యాలను సమర్ధించిన వారెందరు లేరు ? నూతన మత సంస్థాపకులలో ఆర్థిక వ్యవస్థ పట్ల ఓదాసీన్యాన్ని ప్రదర్శించే వారెందరు లేరు ? ఇట్టి వారి కోవకు చెందినవాడు కాదు డాక్టర్ లోహియా. జీవితం అవిభాజ్యమైనదని ఆయనకు తెలుసు. మత, సాంఘిక ఆర్థిక, రాజకీయాది రంగాల కింద దాన్ని విడగొట్టడానికి వీలు లేదని ఆయనకు తెలుసు. అందువల్లనే తన స్వతంత్రాలోచనలకు సమగ్ర రూపమివ్వడానికి ఆయన కృషి చేశాడు' అని నార్ల వెంకటేశ్వరరావు గారు డా. రామమనోహర్ లోహియా జీవితాన్ని, ఆలోచనలను అర్థవంతంగా విశ్లేషిస్తారు.



డా॥ రామమనోహర్ లోహియా

దండి ఉప్పు సత్యాగ్రహం సంబంధించి గొప్ప పరిశోధనను పీహెచ్‌డీ పట్టా కోసం చేయడమే కాకుండా నేటికీ గాంధీజీ ఆలోచనలను సవ్యంగా, ప్రయోజనకరంగా అందుకోవడానికి మంచి దివిటీ వంటివాడు డా. రామమనోహర్ లోహియా. పాలిటిక్స్ ఈజ్ ఎ షార్ట్ టర్మ్ రిలిజియన్ అండ్ రిలిజియన్ ఈజ్ ఎ లాంగ్ టర్మ్ పాలిటిక్స్ - వంటి విభిన్నమైన, అర్థవంతమైన దృక్కోణాలను ఒక్క రామమనోహర్ లోహియాలోనే చూడగలం. ఆధునిక భారతీయ సమాజాన్ని అవగతం చేసుకోవాలంటే గాంధీజీ, అంబేద్కర్, ఎమ్ఎన్ రాయ్ వంటి మహామహుల జీవిత అనుభవాలనూ వారు ప్రబోధించిన వాదాలనూ సూత్రీకరించిన విశ్లేషణలను తప్పక అధ్యయనం చెయ్యాలి. అటువంటి కోవలో తారసపడే మహా మేధావి, కళా హృదయం గల రసపిపాసి, రాజకీయవేత్త, సిద్ధాంతకర్త, గొప్ప రచయిత డాక్టర్ రామమనోహర్ లోహియా (1910-1967).

మీరు హర్షించవచ్చు, లేదా ఖండించవచ్చు - కానీ నిర్లక్ష్యం చేయడానికి వీలులేని విలక్షణ వ్యక్తి లోహియా. స్వతంత్రంగా ఆలోచించగల వారందరూ సాహసికంగా ఉండలేరు. ఈ రెండు అపురూప లక్షణాల మేలుకలయిక ఆ విలక్షణత. ఈ సమాజాన్ని ఈ దేశపు స్వాతంత్ర్యేచ్ఛను గొప్పగా ప్రభావితం చేసిన అపురూప వ్యక్తి గాంధీ. హేతుబద్ధంగా విభేదించి గాంధీ ఆలోచనలకు కొత్త అర్థాన్ని, జన జీవాలను అందించిన దార్శనికుడు, తాత్వికుడు లోహియా!

గాంధీజీ, లోహియా వ్యక్తిత్వాలనూ, ఆలోచనలనూ కలిపి పరిశీలించినపుడు చాలా తమాషాగా, మరింత ఆసక్తికరంగా ఉంటుంది. వ్యవహార శైలిలో ఇద్దరికీ కట్టెదురు. గాంధీజీ ఎంత మృదువో, లోహియా అంత పెళుసు. ఇద్దరి మధ్య 41 సంవత్సరాల వయసు తేడా ఉంది. బయటి నుంచి చూస్తే ఇరువురివీ పొంతన లేని మూర్తిమత్వాలు. కానీ అంతరంగాలను పరిశీలిస్తే - లోహియా మహాశయుడు గాంధీజీని గురువుగానే కాదు, 'మానసపిత'గా పరిగణించారు. గాంధీజీ అయితే కుమారుడికన్న ఎక్కువ ప్రేమగా లోహియాను చూసుకున్నారు. అందువల్లనే గాంధీజీ చాలాసార్లు లోహియా పరుషమైన, దురుసైన, పదునైన మాటలు పడ్డారు. లోహియా అతిగా సేవించే కాఫీ, టీ, సిగరెట్లు - తగ్గించడానికీ, మాన్పించడానికీ

గాంధీజీ తీసుకున్న శ్రద్ధా, పడిన శ్రమా అలవి కావు. ఒక రెండు నెలల వ్యవధిలో సిగరెట్లు మానివేశారు లోహియా. అయితే గాంధీజీ హత్యకు గురయిన రోజున మళ్ళీ సిగరెట్ తాగారు! బయటికి అంతగా కనబడేది కాదు గానీ, లోహియా విపరీతంగా గాంధీజీ ఇష్టపడేవారు. తన మరణ సమయంలో కూడా ఆ లోటు లోహియాను వెంటాడింది. గాంధీతో తనకున్న అనుబంధాన్ని లోహియా 1952లో హైదరాబాదులో చేసిన ప్రసంగంలో వివరించారు. ఈ ప్రసంగం ఆధారంగానే 'అనెక్డోట్స్ ఆఫ్ మహాత్మాగాంధీ' అనే లోహియా వ్యాసం తయారైంది. ఇందుమతి కేల్కర్ చాలా చక్కని లోహియా జీవిత చరిత్ర రాశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన హిందీ ఆచార్యులు ప్రేమ్ సింగ్ గారు గాంధీజీ, లోహియా ద్వయం జీవన శైలీ, సిద్ధాంతాల మీద అధ్యయనం చేసి వారి సన్నిహితమైన, ఫలవంతమైన అనుబంధం గురించి సుదీర్ఘమైన విశ్లేషణ చేశారు. ప్రేమ్ సింగ్ అధ్యయనం చాలా ఆసక్తికరంగా లోతుగా వుంది. ఆగ్రా, అవథ్ సంస్థాన ప్రాంతం అక్బర్ పూర్ లో 1910 మార్చి 23న సంపన్న వైశ్య కుటుంబంలో రామ మనోహర్ లోహియా జన్మించారు. రెండో ఏటనే తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు. కుమారుడి కోసం తండ్రి హీరాలాల్ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. 1918లో కుమారుడి చదువు కోసం బొంబాయి వెళ్ళారు హీరాలాల్. ఇంటర్మీడియెట్ బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలోను, బి.ఏ. కలకత్తా విశ్వ విద్యాలయం విద్యాసాగర్ కళాశాలలో పూర్తి చేశారు. 1929–1933 మధ్య కాలంలో జర్మనీలో చదువు కొనసాగించి, ఇపుడు Humboldt University of Berlinగా పిలువబడే విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గాంధీ సామాజిక–ఆర్థికపరమైన ఆలోచనలను వివరించే రీతిలో భారతదేశంలో ఉప్పు పన్ను అంశంపై ఆయన పరిశోధక గ్రంథం వెలువరించారు. 1933 నుంచి 1967 అక్టోబరు 12న గతించే దాకా లోహియా అలుపెరుగకుండా ప్రజా జీవితంలో మమేక మయ్యారు. ఆయన వివాహం కూడా చేసుకోకుండా మొత్తం జీవితాన్ని సోషలిస్టు సిద్ధాంతాల అధ్యయనానికీ, ప్రజాజీవితం అర్థవంతం కావడానికి కృషి చేశారు.

డా. రామమనోహర్ లోహియా 57 సంవత్సరాల వయస్సులో కనుమూసినపుడు నార్ల వెంకటేశ్వరరావు లోతయిన, విశ్లేషణాత్మ కమయిన సంపాదకీయాన్ని తను నిర్వహిస్తున్న దినపత్రికలో రాశారు. తెలుగులో లోహియాను క్లుప్తంగా, లోతుగా తెలుసుకోవడానికి నార్ల సంపాదకీయం చిన్న అద్దం వంటిది. అందులో నార్ల ఇలా అంటారు – **"వాక్కు పరుషమైనా డా. లోహియా హృదయం ఎంతో ఆర్ద్రమైంది. స్నేహానికి అది కరిగేది. సౌజన్యానికి కరిగేది. సౌందర్యానికి కరిగేది. ఆధునిక దృష్టి గలవారికి, విప్లవాదులైన వారికి పౌరాణిక సాహిత్యంపట్ల వైముఖ్యం వుండటం కద్దు. కానీ, లోహియా మాత్రం హిందూ పురాణాలపట్ల భక్తి గౌరవాలను చూపుతూ వుండేవారు. చారిత్రక పురుషులకంటే లోహియా దృష్టిలో (పురాణ పురుషులే) హిందువుల జీవితాన్ని, వారి సంస్కృతిని వారి చరిత్రను ప్రభావితం చేశారు, చేస్తున్నారు. ఆయనకు ఇంగ్లీషు భాషపట్ల కంటే కుల వ్యవస్థపట్ల అధిక విరోధభావం వుండేది. కుల విభేదాలు తొలగనిదే ప్రజాస్వామ్యం లేదని, సోషలిజం అంతకంటే లేదని ఆయన ప్రగాఢంగా విశ్వసించేవారు. ఒక జవహర్‌లాల్‌ను విడిచి పెడితే, భారత రాజకీయ నాయకులలో ఇంతగా సర్వతోముఖమైన అభిరుచులున్న వ్యక్తి మరొకరు కానరారు. రాజకీయ రంగంలో రాణించి ఉండకపోతే లోహియా ఒక సాహిత్యకారుడిగా, కళాభిజ్ఞుడిగా, తత్వవేత్తగా రాణించేవారు"**


గాంధీజీ ఆలోచనలకు విశ్లేషణాత్మకమైన వివరణ, సమన్వయం చేసి, వారి తాత్విక ఆలోచనలకు చక్కగా కొనసాగింపు చేసినవాడు లోహియా. తన అన్వేషణలో గాంధీ ఆలోచనలే ఎక్కువ ఉపకరిస్తాయని గుర్తించిన లోహియా ఎప్పుడు గుడ్డిగా, సెంటిమెంటల్‌గా మారలేదు. లోహియా తనను తాను మార్క్సిస్టుగా కానీ, వ్యతిరేకిగా కానీ, గాంధేయ వాదిగా కానీ ముద్ర వేసుకోవడానికి ఇష్టపడలేదు. గాంధీ గతించిన తర్వాత మాట్లాడుతూ ఇపుడు గాంధీ సిద్ధాంతాలు సర్కారీ గాంధీయిజం, మొనాస్టిక్ గాంధీయిజంగా మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు. మొదటిది ఆయన రాజకీయ వారసుల వ్యవహారం కాగా.. రెండవది ప్రభుత్వ ఖర్చుతో లాంఛనంగా జరిగే కార్యక్రమాల తంతు. కానీ లోహియా మాత్రం నిజం, కాలం, చరిత్ర, ప్రగతి వంటి గాంధీ భావనల గురించి, ప్రతీకలను గురించి అధ్యయనం చేసి ప్రజా జీవితంలో విలువలు పెరగాలనే అర్థాన్ని ఇచ్చారు. లేకపోతే శాఖాహారం, అహింసలు మాత్రమే గాంధీయిజంగా చలామణి అయ్యేవి. దేవుడి ప్రతిష్ఠించే గాంధీజీ ఆలోచనలు మనిషి కేంద్రంగా సాగాలనే లోహియా సవరింపునిచ్చాడు. దేవుడి ప్రస్తావన లేని సత్యాగ్రహి గురించి గాంధీజీని కోరిన వారు లోహియా. గమ్యం మాత్రమే కాదు, గమ్యం కూడా ఉన్నతంగా ఉండాలనే గాంధీజీ వైఖరి లోహియాను బాగా ఆకర్షించింది. అలాగే గాంధీజీ హృదయపరివర్తన అనే భావన తరువాతి కాలంలో అర్థరహితంగా మారడం డా. రామమనోహర్ లోహియా గారికి ఎంతో ఖేదాన్ని మిగిల్చింది. గాంధీజీ ఆలోచనలకు మన్నిక ఉన్నంత కాలము వాటికి సంబంధించి డా. లోహియా వివరణలకు విశ్లేషణలకు విలువ కొనసాగుతుంది! ❑

# విలక్షణ పాత్రికేయుడు.. గాంధీజీ



- బెందాళం క్రిష్ణారావు

**భారత స్వాతంత్ర్యోద్యమానికి రథసారథిగా, సత్యాగ్రహ ప్రవక్తగా, మానవజాతి చరిత్రలోనే మహనీయవిగా, జాతిపితగా మన్ననలందుకున్న మోహన్దాస్ కరమ్ చంద్ గాంధీ ఆదర్శపాత్రికేయుడు. ఆయన జయంతి సందర్భంగా భారత పత్రికా రంగానికి ఆయన అందించిన సేవలు, సూచించిన పాత్రికేయ విలువలనూ స్మరించుకోవడం మన కర్తవ్యం.**



TILAK NUMBER

YOUNG INDIA

Vol. III | SEPTEMBER 1920 | No. 9

University of Texas
OCT 21 1920
LIBRARY

Indian Patriot's Death

Condoning Murder

Boycotting the British

Published monthly by the India Home Rule League of America
1400 Broadway, New York, N. Y. 15 cents a copy. $1.50 a year.



HARIJAN

Editor: R. V. SASTRY
Under the auspices of The Servants of Untouchables Society

Vol. I ] POONA—SATURDAY, FEBRUARY 11, 1933. [ No. 1

THE CLEANSER.

( A free rendering, from the Bengali, of Satyendranath Dutta's "Scavenger". )

Why do they shun your touch, my friend, and call you unclean
Whom cleanliness follows at every step, making the earth and air sweet for our dwelling, and ever luring us back from return to the wild ?
You help us, like a mother her child, into freshness, and uphold the truth, that disgust is never for man.
The holy stream of your ministry carries pollutions away and ever remains pure.
Once Lord Shiva had saved the world from a deluge of poison by taking it himself,
And you save it every day from filth with the same divine sufferance.
Come friend, come my hero, give us courage to serve man, even while bearing the brand of infamy from him.

*Rabindranath Tagore*

WEEK TO WEEK

The Servants of Untouchables Society

Temples thrown open

Wells opened

Schools started

General

Gandhi Heritage Portal

మహాత్మాగాంధీ తన సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా నాలుగు పత్రికలు నడిపారు. వాటికి ఆయనే సంపాదకుడు, నిర్వాహకుడిగా ఉంటూనే గాంధీజీ 1888 సెప్టెంబర్‌లో న్యాయ శాస్త్రం చదవడానికి లండన్ వెళ్లారు. వార్తాపత్రికలను తొలిసారిగా అక్కడే చదివానని ఆయన తన జీవితచరిత్రలో ప్రస్తావించారు. అక్కడ లండన్ శాఖాహారుల సంఘంలో సభ్యునిగా చేరిన గాంధీజీ 'వెజిటేరియన్ పత్రికలో భారతీయుల పండగలు, ఆచారాలు, ఆహారపుటలవాట్లు' వంటి వాటిపై ఆయన వ్యాసాలు రాశారు. ఓ వైపు విద్యార్థిగా మరోవైపు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగాను ఆయన పనిచేశారు. ఆయనలో జర్నలిజం పట్ల అభిరుచి అలా అంకురించింది. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒక భారతీయ వ్యాపారికి న్యాయ సలహాదారుగా పనిచేయడానికి గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ వివక్షతకు గురౌతున్న భారతీయుల్లో చైతన్యం తీసుకు రావడానికి వారిని సత్యాగ్రహం వైపు నడిపించడానికి 1903లో 'ఇండియన్ ఒపీనియన్' పేరుతో ఒక వారపత్రికను ప్రారంభించారు. ఇది ఇంగ్లీష్, హిందీ, గుజరాతీ, తమిళ భాషల్లో వెలువడేది. అక్కడి శ్వేత జాతీయులు వారికి వత్తాసు పలికే ప్రభుత్వం భారతీయులను ఏ విధంగా అణచివేస్తున్నారో 'ఇండియన్ ఓపీనియర్' అత్యంత స్పష్టంగా వివరించింది. వివిధ భాషలు, సంప్రదాయాలు, మతాలు, ప్రాంతాలకు భారతీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ఈ పత్రిక ద్వారా విశేష సేవలందించారు. ఈ పత్రిక ఇచ్చిన ప్రేరణతో శ్వేతజాతి ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలకు నిరసిస్తూ భారతీయులు గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత పొరాటానికి దిగారు. సత్యాగ్రహ ఉద్యమాన్ని తొలిసారిగా దక్షిణాఫ్రికాలో దేవరైన గాంధీజీ ఈ ఉద్యమ లక్ష్యాలను, ఆదేశిక సూత్రాలను కార్యకర్తలకు 'ఇండియన్ ఒపీనియన్' ద్వారానే భోధించేవారు. ఈ శాంతియుత సహాయ నిరాకరణోద్యమానికి తగిన పేరు సూచించాల్సిందిగా ఈ పత్రిక ద్వారా గాంధీ పాఠకులను కోరారు. వారి నుంచి వచ్చిన ప్రతిస్పందనే 'సత్యాగ్రహం' అన్నపేరు. ఆ రోజుల్లో 'ఇండియన్ ఓసీలియన్' పత్రికలో వచ్చిన వ్యాసాలను చదివి ప్రజాస్వామిక భావాలుగల పలువురు ఆంగ్లేయులు గాంధీజీకి మిత్రులయ్యారు. అక్కడ పాత్రికేయునిగా ఎదిగిన గాంధీ 1913లో దక్షిణాఫ్రికా నుంచి స్వదేశానికి చేరుకున్నారు.

గాంధీజీ భారతదేశంలో అడుగుపెట్టిన సమయానికి స్వాతంత్ర్యోద్యమం దిశా నిర్దేశం లేకుండా కొనసాగుతోంది.


ఆయన ఈ పరిస్థితిని సమూలంగా మార్చాలని భావించారు. జాతీయోద్యమాన్ని సార్వత్రిక ప్రజాందోళనగా తీర్చిదిద్దాలని కొనసాగించిన నిత్యాగ్రహారాలు భావించారు. అందుకోసం తాను దక్షిణాఫ్రికాలో ఉద్యమాన్ని ఇక్కడ కూడా ప్రవేశపెట్టారు. దానికి అనుగుణంగా 'అహింస' అవ్ ఆశయాన్ని ఆయుధంగా స్వీకరించారు. ఈ మహోద్యమానికి ముఖ్యభూమిక వహించడానికి ఆయన మూడు పత్రికలు నడిపారు. అప్పటికే కొంతమంది వెలువరిస్తున్న "యంగ్ ఇండియా', గుజరాతీ యువకులు ముంబాయి నుంచి 'నవజీవన్' పత్రికలకు వారి అభ్యర్థన మేరకు సంపాదకుని బాధ్యతలను స్వీకరించారు. ఆయన సంపాదకత్వంలో 1919 అక్టోబర్ నెలలో 'యంగ్ ఇండియా' (ఆంగ్ల వారపత్రిక), 'నవజీవన్' (గుజరాతి మాసపత్రిక) ఒక్కరోజు తేడాతో ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్యోద్యమానికి భారతీయులను ఉత్తేజితం చేసే దిశగా ఇవి క్రియాశీలక పాత్ర పోషించాయి. 'ఈ పత్రికలే లేకపోతే ఇంతటి మహోద్యమాన్ని నడపగలిగే వాడినే కాదని' గాంధీజి తన రచనలలోనూ, ప్రసంగాలలోనూ పేర్కొనేవారు. గాంధీజీ కృషితో ఈ పత్రికలకు అనూహ్యమైన పాఠకాదరణ లభించింది. సర్క్యులేషన్ 40 వేల కాపీలకు చేరుకుంది. అప్పటికే బ్రిటీష్ ప్రభుత్వం రకరకాల చట్టాల ద్వారా పత్రికలను నియంత్రించాలని ప్రయత్నిస్తోంది. తమ పాలనకు వ్యతిరేకంగా వార్తలు, కథనాలు ప్రచురించే ఎన్నో పత్రికలను మూయించింది కూడా. 1922లో గాంధీజీ తన యంగ్ ఇండియా పత్రికలో రాసిన మూడు వ్యాసాలపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజద్రోహ నేరాన్ని ఆపాదిస్తూ ఆయనను అరెస్టు చేయించింది. న్యాయస్థానం ఆయనకు ఆరేళ్ల కారాగార శిక్ష విధించింది. అదే సమయంలో ప్రెస్ ఆర్డినెన్స్‌ను జారీ చేసిన ప్రభుత్వం అనేక పత్రికలనూ, ముద్రణాలయాలను స్వాధీనం చేసుకుంది. ధరావత్తు చెల్లించాలని ప్రభుత్వం గాంధీజీకి నోటీసు ఇచ్చింది. అందుకు ఆయన తిరస్కరించారు. 1930 జూలై నెలలో యంగ్ ఇండియా, నవజీవన్ పత్రిక ప్రచురణను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఆ సమయంలో కూడా గాంధీజీలోని పాత్రికేయ స్ఫూర్తి దెబ్బ తినలేదు. కొన్ని నెలలపాటు ఆయన వీటిని సైక్లోస్టైల్ పత్రికలుగా వెలువరించారు. ఆ తరువాత 1931లో గాంధీ-ఇర్విన్ ఒడంబడిక అనంతరం వీటిని మళ్లీ ప్రారంభించారు. సమాజంలో అట్టడుగున ఉన్న దళితుల పట్ల అవ్యాజమైన అనురక్తితో, వారి సమస్యలపై పోరాటానికి బాసటగా, వారి అభ్యున్నతే లక్ష్యంగా గాంధీజీ 1933లో 'హరిజన్' పత్రికను ప్రారంభించారు. అగ్రవర్ణాల దురహం కారాన్ని నిరసిస్తూ, దళితులపై జరిగే అరాచకాలకు సభ్య సమాజం సిగ్గుపడి ఆలోచించేలా 'హరిజన్' పత్రికలో గాంధీజి రచనలు చేసేవారు. దేవాలయ ప్రవేశాన్ని కోరుతూ దళితులు దేశవ్యాప్తంగా చేసిన ఉద్యమాలకు ఈ పత్రిక వెన్నుదన్నుగా నిలచింది. అంటరాని వారు అనే బదులు సమాజంలో గౌరవంగా ఉండే విధంగా హరిజనులు అనే పదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. ఈ పదాన్ని కూడా ఒక దశత పాత్రికేయుడే గాంధీజి సూచించడం గమనార్హం. ఆ పత్రిక తొలి సంచికలో ప్రముఖ బెంగాలీ కవి ఏసీ రత్తా రాసిన బెంగాలి కవిత 'బంగి'కి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చేసిన ఆంగ్లాను వాదాన్ని ప్రచురించారు. హరిజన్ పత్రిక ఇంగ్లీషుతోపాటు ఉర్దూ, తమిళ, కన్నడ, ఒరియా, మరాఠీ, గుజరాత్ వంటి ప్రాంతీయ భాషల్లో వెలువడేది. స్వాతంత్ర్యానంతరం దేశంలో చెలరేగిన మతకల్లోలాలకు వ్యతిరేకంగా, ప్రజల్లో సమతా భావనలు వికసించేలా, హిందూ ముస్లింల మధ్య ఐక్యతని ఆకాంక్షిస్తూ గాంధీజీ తన పత్రికల ద్వారా ప్రచారం చేశారు. వీటి సాయంతో కోల్‌కతా, ఢిల్లీలలో చెలరేగిన అల్లర్లను నిలువరించగలిగారని, ప్రజలకు శాంతి సందేశాన్ని అందించాయని చరిత్రకారులు కొనియాడారు. "గాంధీజీ నిర్వహించిన నాలుగు పత్రికలూ అంతర్జాతీయ పత్రికల సరసన నిలుస్తాయని" ప్రముఖ జాతీయ పాత్రికేయుడు. మానికొండ చలపతిరావు తాను రాసిన "గాంధీ అండ్ నెహ్రూ" అనే గ్రంథంలో పేర్కొన్నారు. పత్రికా రంగంలో గాంధీజీ అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పారు. విలక్షణ పాత్రికేయునిగా మానవతా విలువలకు పెద్దపీట వేశారు. ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సూటిగా, సరళంగా, క్లుప్తంగా చిన్న చిన్న వాక్యాలలో అందరికీ అర్థమయ్యేటట్లుగా రాసేవారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ విభిన్నమైన అభిప్రాయాలకు పత్రికల్లో అవకాశం కల్పించేవారు. తన పత్రికల్లో తప్పులు దొరికి కొంతమందిలా వాటిని సమర్థించుకోవడానికి ప్రయత్నించకుండా నిజాయితీగా తర్వాత మంచికల్లో వాటికి క్షమాపణలు కూడా ప్రకటించేవారు. గాంధీజీ తన రచనలకు ఏనాడూ కాపీరైట్‌ను తానుంచుకోలేదు. ప్రజలకే కాపీరైట్ హక్కుని విడిచిపెట్టేశారు.

దేశ, విదేశాల్లోని ఎన్నో పత్రికలు గాంధీజీ రచనలనూ, వ్యాసాలనూ యథేచ్ఛగా ప్రచురించేవి. భారతీయ ఆత్మ గ్రామసీమల్లోనే ఉందని, అందువల్ల పల్లె ప్రజల అవేదనలకు, ఆకాంక్షలకు పత్రికలు దర్పణంగా నిలవాలని గాంధీజీ పదే పదే చెప్పేవారు. సామాజిక మార్పునకు అత్యంత శక్తవంతమైన సాధనం వార్తాపత్రిక అని ఆయన నమ్మకం, సామాజిక చైతన్యానికి, జాతీయోద్యమానికి పత్రికలను సాధనాలుగా గాంధీజీ మలచుకున్నారు. గాంధీజి నివాళులర్పిస్తూ 'హరిజన్' పత్రిక 1948 మార్చి 29వ తేదీ సంచికలో "జర్నలిస్టుగా గాంధీ మహాత్ముడు జీవితాంతం అత్యున్నత విలువలకు కట్టుబడి పనిచేశారు. ఆయన అడుగుజాడల్లో నేటి పత్రికలు నడవాలి. అదే గాంధీజీకి మనమిచ్చే నివాళి కాగలదని పేర్కొంది. ఆయన పాత్రికేయ రంగంలో చూపిన ఆదర్శాలు నేటికి అనుసరణీయాలు. ❑

# గాంధీ అనే ఒకరుండేవారు ఒకప్పుడు



- డాక్టర్ కనుపర్తి విజయబక్ష్



**ఔను, ఈ 100-150 సంవత్సరాలలో జరిగిన చరిత్రను మరిచిపోయారట మన నాయకులనబడేవారు. మహాత్ముని వర్థంతులను జయంతులను కూడా వాళ్లు తప్పుల తడకగానే పలుకుతున్నారు నలుగురిలో.. వాళ్లకు తెలిసిందేదో అదే బహిరంగ సభల్లోనూ నిస్సంకోచంగా మాట్లాడుతున్నారు. ఏ పదవీ, ప్రచారం కోరుకోకుండానే ఆయనకు అయాచితంగా వచ్చి పడ్డ పేర్లు.. మహాత్మా, జాతిపిత. ప్రజల సొమ్ముతో ఆడంబరాలు, ఐశ్వర్యాలు, అలంకారాలు ఆయన అడగలేదు. కనిపించిన విమానాశ్రయాలకు, రైల్వే స్టేషన్లకు, బస్సు డిపోలకు  కళాశాలలకు, సంక్షేమ పథకాలకు తన పేరు పెట్టాలని ఆయన ఎప్పుడూ ఆశించలేదు. ఎవరినీ యాచించలేదు. అట్లా పేర్లు పెట్టుకుంటూ పోవడానికి ఆయన చేతిలో ఏ అధికారమూ లేదు. ఒక వేళ ఏ అధికారము, పదవీ వున్నా ఆయన స్వభావమే అటువంటి విధానాలకు వ్యతిరేకం కాబట్టి.**

ఈ సమస్త అభివృద్ధి కార్యక్రమాలన్నీ ప్రజలు పన్ను రూపేణ కట్టిన డబ్బులతో కొనసాగుతున్నవే. అంటే ప్రతి ఖర్చులోను ప్రచ్ఛన్నంగా ప్రజల భాగస్వామ్యం ఉందన్నమాట. ప్రతి ఐదేళ్లకోసారి ప్రజలు ఎన్నికల ద్వారా ఏదో ఒక పార్టీకి అధికారం ఒప్పచెప్తారు. అది ఐదేళ్ల ముచ్చట మాత్రమే. ప్రభుత్వాలు మారవచ్చు కాని ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి మాత్రం మారదు కదా ! అంతే కాదు ఆ ప్రాంతంలోని త్యాగధనులు, వదాన్యులు, స్వాతంత్ర్య సముపార్జనా యోధులు.. అట్లా ఎంతో కొంత ప్రాధాన్యం సంతరించుకున్న వారు ఉండి వుండవచ్చు. అవన్నింటిని పరిగణనలోకి తీసుకోకుండా అంతటికీ నేనే రాజు.. నేనే మంత్రి అనే అహంకారపూరిత ధోరణి కానవస్తోంది.

గాంధీజీ అనే ఒక కొల్లాయి కట్టిన ఫకీరు ఈ దేశం కోసం అహరహం పరితపించాడని, నైతిక పునరుజ్జీవనం లేనిదే జాతీయ పునరుజ్జీవనం లేదని విశ్వసించి, ఆ నైతిక ప్రాధాన్యాన్ని జీవితాంతం విడనాడని వాడని ఎంత మందికి గుర్తు వుంది. సత్యం, అహింసలను సంఘం ద్వారా ప్రయోగించి స్వతంత్ర్యం సాధించవచ్చని ఆయన నిరూపించారు. రాజకీయ రంగంలో సైతం సత్యాహించలకు స్థానం కల్పించిన సత్యాగ్రహి ఆయన. ప్రస్తుత దేశ పరిస్థితులు ఈ ఐదారు దశాబ్దాలకే బాగా మారిపోయాయి. అసత్యం – హింస – కాపట్యం – ద్వేషం – ధనం – పొగరుబోతుతనం – మాయలు – జిమ్మిక్కులు – అబద్దాలు – అనైతికత ఇట్లాటి లక్షణాలు ఎంత బాగా తెలిస్తే అంత గొప్ప రాజకీయ నాయకుడిగా చెలామణి అవడం నేటి రాజకీయం బహుశా. ఈ పరిస్థితుల్లో గాంధీజీ ఉంటే ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయిపోయేవారేమో. ఇప్పటి ఈ కాపట్యం, ధన పిపాస, పదవీ వ్యామోహం, కుటిలత్వం, వారసత్వ పదవీ కాంక్ష, అధికార మదం, లంచగొండితనం ఇంకా చెప్పాలంటే మతం కులం కార్డులను ఉపయోగించి పదవులను అధిష్టించడం.. వీటన్నింటిని చూడకుండా ఆయన కన్ను మూయటం ఒక రకంగా మంచిదే ! ఎందుకీ మాట అనవలసి వచ్చిందంటే ఆయన జీవించి వుంటే విదేశీయుల మీద కాక తన పోరాటం తన వారి మీదే చేయాల్సి రావడానికి ఎంతగానో చింతించే వారు. ఎంత మదనపడేవారో ! ఎందుకంటే ఈ పోరాటం అంతం లేనిది కాబట్టి !

ప్రజలంటే అధికార పీఠం ఆశించే వారి దృష్టిలో ఓట్లు మాత్రం వేయడానికి పనికివచ్చే మూగజీవాలు. వారు ఓటు

వేసిన తదుపరి ఏం అడగకూడదు. ప్రశ్నించకూడదు. రాజకీయాలంటే సామాన్య జనానికి చెందినవి కావని, అదేదో కొందరే గొప్పవారి చేతుల్లో మాత్రమే పరిమితమైపోయి బందీ కాబడ్డ అంశమనే దానికి ఆయన వ్యతిరేకి. ప్రజలతో మమేకం కాని రాజకీయాలను ఆయన అసలు ఇష్టపడలేదు. ప్రజలకు నాయకులపట్ల నమ్మకం కలగాలంటే నాయకులు ప్రజల వలె సాధారణమైన, సామాన్యమైన జీవితాన్ని గడపాలి. అదే గాంధీజీ అనుసరించి బాట. ఈ దేశంలో కోటానుకోట్ల దరిద్ర ప్రజలకు ప్రతీక వలె ఉండేది ఆయన వేషం. కట్టుదిట్టమైన ప్రజారాజ్యం గ్రామస్థాయి నుంచి పంచాయతీ వ్యవస్థ ద్వారా ఏర్పడాలని ఆశించాడు.

అధికార కేంద్రీకరణకు విరుద్ధంగా పంచాయతీ రాజ్యాన్ని ప్రజాస్వామ్యం ద్వారానే సాధించాలనేవి ఆయన ఆశయం. అట్లా జరిగితే భారతీయులలో బలహీనమైన వాడు సైతం దేశ పాలకుడవుతాడని దేశంలో ఉన్నతులు అని చెప్పబడే వారితో సమానమవుతాడని ఆయన ఆశించాడు. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా అధికార కేంద్రీకరణంతా ధనవంతుల పరమయింది. డబ్బు, కులం, పరపతి, పలుకుబడి వున్నవాడే పంచాయతి నుంచి పార్లమెంటు దాకా ఆధికారాన్ని హస్తగతం చేసుకొంటున్నారు. సామాన్య జనం కేవలం 'ఓటర్లు' గా మిగిలిపోవటం తప్ప దేశ ఆర్థిక వనరుల్లో, అధికారంలో వారి భాగస్వామ్యం శూన్యం. స్వాతంత్ర్యమనేది ఒక రాజకీయ సంఘటన కాదు. విదేశ పాలన విముక్తి కలగటం అంత కంటె కాదు. దేశంలోని నిరుపేదలు నుండి సైతం ఇది తమ దేశమని, ఈ దేశ పాలనలో తాము కూడా భాగస్వాములమవ్వాలనే కోర్కె నెరవేరాలని ఆయన కాంక్షించాడు. కాని చిత్రంగా ప్రజల ధన మాన ప్రాణాలకు దేశ సంపదకు ధర్మకర్తృత్వం వహించవలసిన ప్రభుత్వాలు ప్రజలను బిచ్చగాళ్ళను చేసి అడపాదడపా తమకు తోచింది తాయిలాలుగా అందిస్తున్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్ళయినా, ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ప్రజలకు ఆదుకొంటున్నామని లెక్కలు చూపుతున్నా దేశం నిండా బీదా బిక్కీ కోట్లల్లో వున్నారు. కనీస అవసరాలకు నోచుకోని పేద ప్రజల పేరుతో మరిన్ని కొత్త కొత్త పథకాలు ఆయా నాయకుల పేర్లతో రాబోతున్నారు. ఏ నాయకుడు తన సొంతడబ్బును జేబులో నుంచి తీసి ప్రజాక్షేమానికై ఖర్చు పెట్టడం లేదు. మన దేశ రాజకీయ రంగంలో 1950 – 80ల దాకా గాంధీజీ పేరు, సిద్ధాంతం అనేవి కొంతలో కొంత వినబడేది.

ఆ తర్వాతి రెండు దశాబ్దాలు ఆయన సిద్ధాంతాల ఆచరణ గాలి కొదిలేసినా కనీసం ఆయన పేరు చెప్పుకుని చెట్టు పేరు చెప్పు కొని కాయలమ్ముకొన్న నైజం కొంత వుండేది. మరీ రెండు దశాబ్దాల నుండి ఆయన పేరు వినబడేటం కూడా మృగ్యమైంది. ఈ దశాబ్ది రాజకీయాలంటే భయం పుట్టించేవిలా అయ్యాయి. మేధావుల వైముఖ్యంతో రాడీయిజం రాజకీయాల్లో తిష్ట వేసుకొంది. నాయకత్వ లక్షణమంటే సహనం, క్షమ, అందరిని కలుపుకుపోయే నైజం, నీతి నిజాయితీ స్థానాల్లో డబ్బులు వెదజల్లటం, ఓట్లను కొనడం, బలహీన వర్గాలపై జులుం చేయటం, బూతులు మాట్లాడం, అశ్రిత పక్షపాతం ఖజానాను తన వాళ్ళకు దోచి పెట్టటం, ఇలాంటి అవలక్షణాలు వందల కొద్దీ నేడు కనబడుతున్నాయి.

ప్రజాక్షేమం ఊసెత్తే వారే లేరు. సరైన రోడ్లు, ఆసుపత్రులు, శుద్ధమైన మంచి నీరు లేదు. సిగ్గు పడాల్సింది ఏమిటంటే గర్భిణులు నొప్పులు పడుతుంటే ఇంకా డోలీల్లో వాళ్ళను మోసుకు రావలసిన దౌర్భాగ్యం. ఇదా మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలితం. ఇదా గాంధీజీ ఆశించిన రామ రాజ్యం. సుపరిపాలన.

ప్రతి అంశాన్ని తలకిందులుగా తిప్పి చూసి దాన్ని విమర్శ అని, లేదా సద్విమర్శ అనే కుహనా మేధావులు తీర్మానించటం దానికి బాకా ఊదే కొందరు బయలు దేరటం నేటి 'నవనాగరికత' లోని ఒక ముఖ్యాంశం. గాంధీ ఈ దేశానికి ఏమి చేశాడు ? అని హిందుత్వ ఎజెండాను రంగస్థలం మీదకు తెచ్చేవారు ఎక్కువై పోయారు. ఆయనలా జీవించటమనేది ఇట్లా విమర్శించే ఏ ఒక్కరికైనా ఆయన వలె నిరాడంబరంగా, నిస్వార్థంగా జీవించగల శక్తి వుందా? వ్యక్తి సాధనకు పరిమితమైన ఒక తాత్విక సూత్రాన్ని ఒక జాతి పునరుజ్జీవనానికి వినియోగపడే సామాజిక కార్య ప్రణాళికగా మార్చడం, రాజకీయ, సాంఘిక, మత రంగాల్లో విభేదాలు, ఘర్షణలు పోగొట్టడానికి హింసాయుత మార్గాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అవలంబించరాదనేది ఆయన సిద్ధాంతం.

1928లోనే ఆయన 'యంగ్ ఇండియా' పత్రికలో సప్త సామాజిక పాపాలుగా నీటిని పేర్కొన్నారు.

విలువలకు పొసగని రాజకీయం.

పని చెయ్యకుండా సమకూరే ధనం.

శీలం లేని జ్ఞానం.

నైతికత లోపించిన వ్యాపారం

త్యాగభావన లోపించిన మతం.

ఆత్మసాక్షి అంగీకరించని సుఖం.

మానవత్వానికి ప్రాముఖ్యత ఇవ్వని శాస్త్రవిజ్ఞానం.

ఇట్లాటివి ఆచరించడం మానవ మాత్రులకు సాధ్యమేనా? అవే ప్రశ్న ఉదయిస్తుంది. సాధ్యమనే చూపాడు గాంధీజీ. దేశంలో కెల్లా 'అత్యున్నత విగ్రహం ఆయన కోసం నిర్మింపబడి వుండక పోవచ్చును. కాని ప్రపంచవ్యాప్తంగా శాంతి కాముకల హృదయాల్లో ఆయన స్థానం సుస్థిరం.. అజరామరం. ❑

# భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన జర్నలిస్టులు

- ముహమ్మద్ అజ్గర్ అలీ

**భగత్‌సింగ్ ఒక విప్లవకారుడనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే భగత్‌సింగ్ ఒక జర్నలిస్టు అని ఎంత మందికి తెలుసు ? భగత్‌సింగ్ పంజాబీ, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో వ్యాసాలు రాశారు. హిందీ దినపత్రిక 'ప్రతాప్'తో భగత్ సింగ్ తన పాత్రికేయ వృత్తిని ప్రారంభించాడు. విప్లవకారుల వాణి అయిన 'కీర్తి' అనే పంజాబీ పత్రికకు భగత్ సింగ్ సంపాదకత్వం వహించారు. రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాక్ ఉల్లాఖాన్ మరియు ఇతర విప్లవకారులపై పత్రికలో ప్రచురించిన భగత్‌సింగ్ వ్యాసం చాలా ప్రజాదరణ పొందింది. మరియు 'కీర్తి' పత్రికపై ప్రభుత్వ చర్యను తీసుకుంది.**

మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన మొదటి జర్నలిస్టు భగత్‌సింగేనా? కాదు. మౌల్వీ మొహమ్మద్ బాకీర్ స్వాతంత్ర్య పోరాటంలో భారతదేశం కోసం బలిదానం చేసిన మొదటి జర్నలిస్ట్‌గా గుర్తింపు పొందారు. బాకీర్ 1837లో ఢిల్లీకి చెందిన మొదటి ఉర్దూ వార్తాపత్రిక 'ఢిల్లీ ఉర్దూ అఖ్బర్'ను ప్రారంభించాడు. 1857లో భారత విప్లవకారులు మొదటి స్వాతంత్ర్య సంగ్రామాన్ని ప్రారంభించినప్పుడు, మౌల్వీ మొహమ్మద్ బాకీర్ తన వార్తాపత్రికను జాతీయ ప్రయోజనాల కోసం అంకితం చేశాడు. బాకీర్ వార్తాపత్రిక విప్లవకారుల సందేశాలు, భారతీయ విప్లవ దళాలకు దిశలు మరియు బ్రిటీష్ సైన్యానికి వ్యతిరేకంగా భారతీయుల మనోధైర్యాన్ని పెంచడానికి కథనాలను అందించింది. స్వాతంత్ర్య పోరాటంలో మౌల్వీ మొహమ్మద్ బాకీర్ పాత్రను, వారికి మౌల్వీ మొహమ్మద్ బాకీర్ కలిగించిన ప్రమాదాన్ని ఆంగ్లేయ అధికారులు అర్థం చేసుకున్నారు. బ్రిటిష్ వారు కోర్టులలో విచారణల తర్వాత ఇతర విప్లవకారులను ఉరి తీశారు. విచారణ లేకుండా బాకీర్‌ను మేజర్ హడ్సన్ కాల్చి చంపాడు. 1857 సెప్టెంబర్ 16న దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసి భారతీయ జర్నలిస్టుల కోసం మౌల్వీ మొహమ్మద్ బాకీర్ ఒక సంప్రదాయాన్ని ప్రారంభించాడు

బాలగంగాధర తిలక్ తాను సంపాదకత్వం వహించిన పత్రికల ద్వారా స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ పంథాను ప్రారంభించాడు. 'మరాఠా మరియు కేసరి' వార్తా పత్రికలు యువతలో విప్లవాత్మక ఆలోచనలను వ్యాప్తి చేయడంలో సహాయపడ్డాయి. ఖుదీరామ్ బోస్ వంటి విప్లవకారులకు మద్దతుగా తిలక్ రాసిన వ్యాసాలు చివరకు తిలక్‌ను మయన్మార్ లోని మాండలే వద్ద జైలు శిక్షను పొందేటట్లు చేశాయి.

అరబిందో ఘోష్ మరియు అతని సోదరుడు బరీంద్ర ఘోష్ ఇద్దరూ జర్నలిస్టులుగా భారతీయ విప్లవకారులకు నాయకత్వం వహించారు. అరబిందో ఘోష్ మరియు బరీంద్ర ఘోష్ యువతలో మిలిటెంట్ జాతీయవాదాన్ని బోధించే వార్తాపత్రికలు మరియు మ్యాగజైన్‌లకు సంపాదకత్వం వహించారు. ఈ 'నేరం' కోసం బరీంద్ర ఘోష్‌ను అండమాన్ దీవులకు పంపారు. సోదరులిద్దరూ భారత స్వాతంత్ర్య పోరాటంలో 'బాంబు సంస్కృతి'ని ప్రారంభించారని బ్రిటిష్ వారు ఆరోపించారు. మరియు బ్రిటిష్ రాజ్‌కు అత్యంత ప్రమాదకరమని భావించారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కూడా జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 16 సంవత్సరాల వయస్సులో ఒక పత్రికను ప్రచురించడం ప్రారంభించాడు. పాఠకులలో జాతీయవాదం మరియు హిందూ - ముస్లిం ఐక్యతను బోధించాడు. 1912లో ఆజాద్ ప్రారంభించిన 'అల్-హిలాల్' అనే వార్తాపత్రిక ఆ సమయంలో అత్యంత ప్రజాదరణ పొందిన వార్తా పత్రికలలో ఒకటి. 'అల్-హిలాల్' వలసవాద వ్యతిరేక భాష ఆంగ్లేయ అధికారులను కలవరపెట్టింది. వార్తాపత్రిక పూర్తిగా మూసివేయబడే వరకు చాలాసార్లు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌పై జరిమానా విధించబడింది. 1916లో ఆజాద్‌కి శిక్ష విధించిన మొదటి శిక్ష 'అల్-హిలాల్' వార్తాపత్రికలో వ్యాసాలు రాసినందుకు.


భగత్ సింగ్‌కు జర్నలిజంలో శిక్షణ ఇచ్చిన గణేష్ శంకర్ విద్యార్థి జాతీయవాద సమస్యలను లేవనెత్తిన 'ప్రతాప్' అనే హిందీ వార్తాపత్రికను ప్రచురించారు. 'ప్రతాప్' వార్తాపత్రిక విప్లవకారులను బహిరంగంగా సమర్థించింది, ఆంగ్లేయులచే భారతీయుల అణచివేతను నిరసించినది మరియు హిందూ-ముస్లిం ఐక్యతను బోధించింది. 'ప్రతాప్' వార్తాపత్రిక చంపారన్‌ను మహాత్మాగాంధీ దృష్టికి తీసుకెళ్లింది 'ప్రతాప్' వార్తాపత్రిక. ప్రభావంచే గాంధీ చంపారన్‌కు వెళ్లి, సత్యాగ్రహాన్ని ప్రారంభించి, భారత స్వాతంత్ర్య పోరాటానికి బహుజన నాయకుడయ్యాడు. **(మిగతా 17వ పేజీలో)**

# అండమాను జైలులో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు



– డా॥ పి.వి.సుబ్బారావు

**బ్రిటీషు పాలకుల మదిలో అండమాను జైలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన అంకురించిన విధానాన్ని, 1858లో అది శిక్షా క్షేత్రంగా రూపు దిద్దుకొని ఓపెన్ జైలుగా మారిన తీరును, క్రమేపి చేర్పులు, మార్పులతో 1906లో 'సెల్యులార్ జైలు'గా మారిన విషయాన్ని ఈ పుస్తకంలో వివరించాడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులను వివిధ సందర్భాల్లో అండమాను జైలుకు తరలించిన విషయాన్ని వివరించాడు.**




'ఇతిహాసపు చీకటి కోణం/అట్టడుగున పడి కాన్పించని/కథలెన్నో కావాలిప్పుడు' అంటారు శ్రీశ్రీ. సయ్యద్ నశీర్ అహమ్మద్ పట్టువదలని విక్రమార్కుడిలా చరిత్రలో భాగంగా మిగిలిపోయిన ప్రత్యేకించి అండమాను జైలు జీవితం గడిపిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల గాథలను ఎన్నో గ్రంథాలు పరిశీలించి రచించాడు. ఈ గ్రంథం రాయాలన్న ఆలోచన 2014లో ఆయనకు కలిగింది. ఢిల్లీ విశ్వ విద్యాలయానికి చెందిన ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ శామ్‌సుల్ ఇస్లామ్ రాసిన 'అన్ సంగ్ హీరోస్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ అండమాన్స్', 'హూ ఈజ్ హూ' అనే గ్రంథాన్ని 2014 నవంబరు 21వ తేదీన ఈ రచయితకు పంపించాడు. ఆ గ్రంథాన్ని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్, సెల్యులార్ జైల్, పోర్ట్‌బ్లెయిర్, అండమాన్ నికోబార్ ఐలాండ్స్'కు చెందిన రషీదా ఇగ్బాల్ (పోర్ట్‌బ్లెయిర్, అండమాన్ నికోబార్ దీవులు) రచించారు. నశీర్ అహమ్మద్ ఆ గ్రంథాన్ని శ్రద్ధగా చదివి దానిని తెలుగులో రాయాలనిపించింది. వెంటనే ఆ గ్రంథ రచయిత డాక్టర్ రషీదా ఇగ్బాల్‌ని సంప్రదించాడు. అప్పటి నుండి 2021 జనవరి వరకు 'అండమాను జైలు ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు' పుస్తక రచనకు అవసరమైన సమాచారం కోసం అన్వేషిస్తూ అప్పటి బ్రిటీషు ప్రభుత్వం భారత ప్రభుత్వ దస్త్రాలను, అధికారిక, అనధికారిక పత్రాలను, తత్సంబంధమైన గ్రంథాలను సేకరించాడు. నశీర్ అహమ్మద్ చరిత్రలో మరుగున పడిపోయిన ప్రముఖులను గూర్చి ఇప్పటికి దాదాపు 20 గ్రంథాలను రాశాడు. నశీర్ అహమ్మద్ ఏదైనా గ్రంథరచన చేసేప్పుడు తత్సంబంధమైన చారిత్రక ప్రదేశాలను స్వయంగా దర్శించిన అనుభూతితో ఆరంభించే సంప్రదాయాన్ని పాటించడం అభినందనీయం. ఈ గ్రంథ రచనకు ముందు ఆయన శ్రీమతి రమీజాభాను సలహాతో అండమానులో పోర్టుబ్లయర్‌లో ఉంటున్న ప్రముఖ పరిశోధనాత్మక రచయిత డాక్టర్ రషీదా ఇగ్బాల్, ప్రముఖ విద్యావేత్త యం.అహ్మద్‌ముజ్‌తాబాతో ఈ విషయాలు మాట్లాడారు. తాను అండమానుకు రావాలనుకుంటున్నానని వారితో చెప్పాడు. అప్పుడు కరోనా విజృంభణ వల్ల అక్కడ కూడా లాక్‌డౌన్ ప్రకటించినందున అక్కడి సంస్థలన్నీ మూతపడి ఉన్నాయనీ, వచ్చినా ప్రయోజనం ఉండదనీ, ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు' గ్రంథ రచనకు అవసరమైన సమాచారం, ఛాయాచిత్రాలు కరోనా లాక్‌డౌన్ తర్వాత వారు పంపిస్తామని గ్రంథ రచనను తక్షణమే ఆరంభించమని సూచించారట. ఆ విధంగా వారి నుంచి లభించిన ప్రేరణతో 2021 ఫిబ్రవరిలో గ్రంథ రచన ప్రారంభించాడు. తాను సేకరించిన సమాచారంతో విస్తృతంగా నోట్స్ తయారు చేసుకున్నాడు. మరింత సమాచారాన్ని అంతర్జాలం ద్వారా సేకరించాడు. అందులో లభించిన

గ్రంథాల అధ్యయనం ద్వారా సరికొత్త పుస్తకాలు తెప్పించుకోవాలనే ప్రయత్నంలో మొదటి నుండి నశీర్ అహమ్మద్‌ను ప్రోత్సహించే శ్రీఅబ్దుల్‌సత్తార్‌ఖాన్ ఐపీయస్ సహకారంతో అవి వచ్చాయి. అండమాన్ నికోబార్ దీవులకు సంబంధించి 19వ శతాబ్ది ఆరంభంలో వచ్చిన అనేక గ్రంథాల సమాచారం అంతర్జాలం ద్వారా అందుకున్నాడు. ఆ లభించని కొన్ని దస్త్రాల పిడియఫ్ ఫైళ్లు చరిత్ర పరిశోధకులు ఇండోర్‌కు సంబంధించిన సుహైల్ అహమ్మద్ వాని సహకారంతో పాటు మిత్రుల సహకారంతో తన గ్రంథ రచనకు కావలసిన సమాచారం లభించింది. 1857 నాటి తొలి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన ప్రముఖ రచయిత, విద్యావేత్త ఎమ్. అహ్మద్ హజితాబ్ (అండమాన్ నికోబార్ దీవులకు దగ్గరున్న పోర్ట్‌బ్లయర్) పరిచయం వల్ల చాలా సమాచారం లబించింది. 1858లో అండమానుకు పంపించిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుల చరిత్రల సమాచారం సమగ్రంగా లభించింది. అండమానులో స్థిరపడిన 1857 నాటి స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబీకులతో పరిచయం కలిగించి వారిని సంప్రదించే అవకాశం కల్పించారు. అండమాను జైలు మాజీ రాజకీయ ఖైదీల వారసత్వ సంస్థకు అధ్యక్షులైన 'అనుప్‌దాస్ గుప్తా' పరిచయంతో ఆయన బెంగాలీ భాషలో రాసిన సెల్యులార్ జైలు ఇ.నిర్భసిటో బిప్లోబైడర్ అనే గ్రంథాన్ని పబ్లిషర్ నుండి తెప్పించుకున్నాడు. దాస్‌గుప్తా దగ్గర వున్న తనకు అవసరమైన సమాచారాన్ని తెప్పించుకున్నాడు. తాను సేకరించిన సమాచారాన్ని అక్షరబద్ధం చేయటానికి మార్చి 2021లో ప్రారంభించాడు. ఏకబిగిన ఆగస్టు రెండో వారానికి గ్రంథాన్ని పూర్తిచేశాడు. ఈ గ్రంథంలో సమాచారాన్ని సమయం, సందర్భాన్ని బట్టి ఎనిమిది భాగాలుగా వర్గీకరించి వివరించటం సముచితంగా ఉంది.

మొదటి భాగంలో గ్రంథానికి సంబంధించిన సవివరమైన నేపథ్యాన్ని అందించారు. బ్రిటీషు పాలకుల మదిలో అండమాను జైలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన అంకురించిన విధానాన్ని 1858లో అది శిక్షా క్షేత్రంగా రూపుదిద్దుకొని ఓపెన్ జైలుగా మారిన తీరు, క్రమేపి చేర్పులు, మార్పులతో 1906లో 'సెల్యులార్ జైలు'గా మారిన విషయాన్ని వివరించాడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా సాగిన బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులను వివిధ సందర్భాల్లో అండమాను జైలుకు తరలించిన విషయాన్ని ఇందులో వివరించాడు. రెండో ప్రపంచయుద్ధంలో భాగంగా 1942 మార్చి 23వ తేదీన అండమాను దీవులను జపాను సైన్యం ఆక్రమించుకున్నాక ఆసియన్లు మిత్రులని జపాన్ సైన్యం ప్రకటించిన తర్వాత అండమానులోని ప్రజలు, ఇండియన్ ఇండిపెండెంట్ లీగ్ సభ్యులు, భారత జాతీయ సైన్యం యోధులు గూఢచర్యానికి పాల్పడుతున్నారన్న ఆరోపణ మీద వారిని బలి తీసుకున్న తీరు తెన్నులను రచయిత మొదటి భాగంలో ఆర్ద్రంగా వివరించాడు.

రెండో భాగంలో 1858 మార్చి 10వ తేదీన అండమాను చేరుకున్న 1859 నాటి తొలి భారత స్వాతంత్ర్య సమర యోధులతోపాటు అండమానుకు తరలించిన వీరుల వివరాలను పేర్కొన్నాడు. మూడో భాగంలో 'ప్రజా పోరాట వీరుల శీర్షికలో' 1857 తర్వాత వివిధ పోరాటాల్లో పాల్గొన్న భారత వాయువ్య సరిహద్దు ప్రాంతాన్ని కార్యక్షేత్రంగా చేసుకొని ఆంగ్ల ప్రభుత్వం మీద పోరాటాలు సాగించిన వహబీ యోధులను అండమాను జైలుకు తరలించిన వారి జీవిత విశేషాలను సవివరంగా 'ప్రజా పోరాటయోధులు' శీర్షికలో చెప్పారు. నాలుగో భాగంలో 1906 నుండి ప్రారంభమైన జాతీయోద్యమంలో భాగంగా సాయుధ పోరాటాల బాట సాగించిన విప్లవకారులను గూర్చి తెలిపాడు. ఐదో భాగంలో మలబారు తీర ప్రాంతలో భూస్వాములకు వ్యతిరేకంగా ఆరంభించి 1919 నాటి ఖిలాఫత్ సహాయ నిరాకరణోద్యమంలో ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వారిని 'మలబారు మోప్లా మొనగాళ్లు' శీర్షికతో పేర్కొనటం ఔచిత్యంగా ఉంది. ఆరో భాగంలో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి సెల్యులార్ జైలుకు వెళ్లిన స్వాతంత్ర్యం సమరయోధుల వివరాలను 'పోరాట యోధులు' శీర్షికలో వివరించాడు. ఇందులో 1942 మార్చి 23 నుండి 1945 ఆగస్టు 15వ తేదీ వరకు అండమాను దీవులను తన ఆక్రమణలో ఉంచుకున్న జపాన్ సైన్యం గూఢచర్యానికి పాల్పడుతున్నారన్న నెపంతో అండమాను వాసులను, భారతీయ సైన్యాన్ని, ఇండియన్ ఇండిపెండెంట్ లీగ్ సభ్యులను ఉరి శిక్షలకు, సామూహిక కాల్చివేతకు బలిచేశారు. ఏడో భాగంలో జపాన్ సైన్యాల కిరాతకత్వానికి బలైన 'సమరయోధులు అమరవీరులు' శీర్షికలో వివరించటం ఔచిత్యంగా ఉంది. ఎనిమిదో భాగంలో 1858 నుండి 1945 వరకు అండమాను తరలించిన వారిలో 25 మంది సమరయోధుల జీవిత విశేషాలను, వారి రేఖా చిత్రాలను పొందుపరచి ఈ గ్రంథాన్ని ముగించటం సముచితంగా ఉంది. తొమ్మిదో భాగంలో గ్రంథ రచనలో ఉపయోగించిన ఆధార గ్రంథాలు పత్రికలు, సమాచార సేకరణలో సహకరించిన మిత్రలుకు ధన్యవాదాలు తెలిపాడు. నశీర్ అహమ్మద్‌కు బాల్యంలో ప్రాణం పోసిన పాలతల్లి స్వర్గీయ గురజాల యశోదమ్మకు(1931–2011) ఈ గ్రంథాన్ని అంకితమివ్వడం ఆయన కృతజ్ఞతా భావానికి నిలువెత్తు నిదర్శనం. మిత్రులైన దాతల సహకారంతో నశీర్ అహమ్మద్ తన ఇతర గ్రంథాల్లా అకర్షణీయమైన ఛాయా చిత్రాలతో అందంగా పాఠకులను ఆకర్షించే విధంగా ప్రచురించటం ప్రశంసనీయం. పాఠకులు, చరిత్రాభిమానులు విధిగా చదువదగిన గ్రంథం. ❑

# జి-20 ఢిల్లీ ప్రకటన, ప్రస్తావించని అంశాలు



- ప్రభాత్ పట్నాయక్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో జి-20 దేశాల ఢిల్లీ సమావేశం జరిగింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థల వృద్ధి రేటు 2022లో 2.7శాతం ఉన్నది కాస్తా 2023లో 1.3 శాతానికి పడిపోవచ్చునని ఐఎంఎఫ్ అంచనాలు చెపుతున్నాయి. ఐఎంఎఫ్ వేసిన మరొక ప్రత్యామ్నాయ అంచనా ప్రకారం వృద్ధి రేటు 1 శాతంకన్నా తక్కువగానే ఉండవచ్చు. ఇదే కాలంలో కార్మిక ఉత్పాదకతలో పెరుగుదల రేటు ఇంతకన్నా ఎక్కువగానే ఉంటుంది. అందువలన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో నిరుద్యోగం పెరుగుదల గణనీయంగా ఉండబోతోంది.

(వృద్ధిరేటు తగ్గడం అంటే ఉత్పత్తిలో వృద్ధిరేటు తగ్గడం. అదే సమయంలో ఉత్పాదకత రేటు అంతకన్నా ఎక్కువగా వృద్ధి చెందితే అంతకు మునుపు అవసరమైనంతమంది కార్మికులు ఇప్పుడు అవసరం ఉండరు. అందువలన నిరుద్యోగం పెరుగుతుంది). యూరోపియన్ యూనియన్ దేశాలలోకి తూర్పు యూరప్ దేశాల నుండి వలసలు భారీగా కొనసాగుతూనే ఉన్నాయి. అదనంగా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఉక్రెయిన్ నుండి కూడా వలసలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా ఇయు దేశాలలో నిరుద్యోగం ఇంకా ఎక్కువగా పెరగనుంది.

ఈ నిరుద్యోగం పెరిగే కొద్దీ శరణార్థులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే ధోరణులు ఇప్పటికే అక్కడ బలపడుతున్న ఫాసిజాన్ని ఇంకా బలపరుస్తాయి. 'ఆల్టర్నేటివ్ ఫర్ డేయిష్ ల్యాండ్'(ఎఎఫ్‌డి) అనే నయా నాజీ పార్టీ జర్మనీలో 20శాతం ఓట్లను సాధించేందుకు చేరువలో ఉంది. అదే జరిగితే అప్పుడు అక్కడ అధికారాన్ని పంచుకోడానికి ఇతర పార్టీలతో ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంటుంది. అ పరిస్థితి కనీసం అక్కడ రాష్ట్రాల ప్రభుత్వాల ఏర్పాటులో వ్యక్తం అవుతుంది. ఇంతవరకూ ఆ పార్టీని దూరంగా ఉంచిన తక్కిన పార్టీలు కూడా ఇప్పుడు ఎఎఫ్‌డితో ఒప్పందాలకు రాక తప్పదు. ఇక ఫ్రాన్స్‌లో ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కన్నా ఫాసిస్టు నేత లి పెన్ కే ఎక్కువ మంది ఓటర్లు మొగ్గు చూపుతున్నట్టు నివేదికలు వస్తున్నాయి. స్పెయిన్‌లోనూ అటువంటి పరిస్థితే ఉంది. ఎటొచ్చీ ఇటీవలి ఎన్నికలు స్పష్టమైన తీర్పు ఇవ్వనందున అక్కడ తాత్కాలికంగా ఫాసిస్టు ముప్పు నుండి ఊరట లభించింది. పెరిగే నిరుద్యోగం ఈ దేశాలన్నింట్లోనూ ఫాసిస్టు శక్తుల పెరుగుదలకు ఊతం ఇస్తుంది.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఎదుర్కొంటున్న సంక్షోభపు ప్రకంపనలు మూడవ ప్రపంచ దేశాలలోనూ ప్రభావాన్ని చూపిస్తాయి. జీడీపీ వృద్ధిరేటు తగ్గిపోవడం, నిరుద్యోగం పెరిగిపోవడం, రుణ సంక్షోభం తీవ్రం కావడం. ఫాసిస్టు ధోరణులు బలపడటం తదితర రూపాలలో ఆ ప్రభావం ఉంటుంది. అన్ని రకాల సంక్షేమ పథకాలనూ రద్దు చేస్తానని ప్రకటించిన వ్యక్తి ఇప్పుడు అర్జెంటీనాలో జరగనున్న ఎన్నికల్లో దేశాధ్యక్షుడిగా గెలుపొందే పరిస్థితులు ఉన్నాయి. ఇంత వరకూ ఆ దిశగా అడుగులు వేయని దేశాలలో కూడా అటువైపే అడుగులు పడే ప్రమాదం ఉంది.

ఇటువంటి నేపథ్యంలో జరిగిన జి-20 దేశాల సమావేశంలో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే చర్యల గురించి చర్చ జరుగుతుందని ఎవరైనా ఆశిస్తారు. గతంలో అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయి ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు నిర్వహించిన జి-20 సమావేశంలో ఆ విధంగానే చర్చించారు. ఇప్పుడూ అటువంటి చర్చ జరుగుతుందని ఆశించడం సహజం. జి-20 దేశాలకు తాను నాయకత్వం వహించడం వలన మూడో ప్రపంచదేశాలకు ఎంతో ప్రయోజనకారిగా జి-20 వేదిక ఉంటుందని భారత ప్రభుత్వం చెప్పుకుంటోంది. అందుచేత ఆ మూడో ప్రపంచ దేశాల రుణ సమస్య ఈ సమావేశాలలో చర్చకు వస్తుందని ఎవరైనా భావిస్తారు. నిజానికి కొందరు భారత ప్రభుత్వ అధికార ప్రతినిధులు ఆ అంశం ఎజెండాలో ఉంటుందని సూచించారు కూడా. కాని, ఢిల్లీ సమావేశాలలో అటువంటి చర్చ జరగనేలేదు. జి-20 ఢిల్లీ శిఖరాగ్ర సమావేశం ప్రస్తుతం చాలా తీవ్రంగా ఉన్న ఆర్థికాంశాలగురించి ఏమీ ప్రస్తావించ లేదు. భద్రతా సమస్యలకన్నా ఆర్థికాంశాలపైనే జి-20 ఎక్కువగా దృష్టి సారించడం మంచిదని చైనా, రష్యా దేశాల ప్రతినిధులు ముందునుంచీ చెపుతూనేవున్నారు. ఇంతకు ముందు ఇండోనేసియాలోని బాలిలో జరిగిన జి-20 సమావేశ ప్రకటనలో ఉక్రెయిన్ యుద్ధానికి కారణం రష్యాయేనంటూ బాహాటంగానే విమర్శించారు. ఢిల్లీ ప్రకటనలో ఆ విధంగా రష్యాను నిందించే విధంగా ఏమీ లేదు. అక్కడ తక్షణమే శాంతి స్థాపన జరగాలన్న వాంఛను మాత్రం వ్యక్తం చేశారు. ఇదే జి-20 వైఖరిలో కనిపించిన స్వల్పమైన మార్పు. అయితే అటువంటి ప్రకటనల వలన కలిగే ప్రభావం ఏమీ ఉండదు.

ఉక్రెయిన్‌ను అడ్డం పెట్టుకుని రష్యా మీద పరోక్షయుద్ధాన్ని

సాగిస్తున్న నాటో కూటమి దేశాలు అక్కడ శాంతిని స్థాపించే దిశగా ఎటువంటి ప్రయత్నాలూ ముందుకు సాగకుండా అడ్డు పడుతూనే ఉన్నారు. గతంలో ఉక్రెయిన్, రష్యా దేశాల నడుమ మిన్స్క్‌లో కుదిరి ఒప్పందాన్ని చెడగొట్టినది అమెరికా, బ్రిటన్ దేశాలే. రష్యా సైనిక చర్యలు ప్రారంభించిన అనంతరం శాంతి స్థాపన కోసం మొదలైన సంప్రదింపులను చెడగొట్టినదీ ఆ దేశాలే. ఇప్పుడు కూడా యుద్ధంలో కొనసాగాలని ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తున్నది ఆ దేశాలే. నాటో కూటమి ఎంతకాలంపాటు ఈ యుద్ధం కొనసాగాలని కోరుకుంటోందో అంతకాలమూ ఆ యుద్ధం సాగుతూనే వుంటుంది. నాటో సభ్యదేశాలు ఢిల్లీ ప్రకటనలో ఉపయోగించిన పదజాలం తమకు అంత అనుకూలం కాకపోయినా, దానితో ఏకీభవించి వుండొచ్చు. కాని యుద్ధాన్ని ముగించే విషయంలో నాటో నిర్ణయాన్ని జి-20 దేశాల ప్రకటన ఏ విధంగానూ ప్రభావితం చేయలేదు.

ఢిల్లీ ప్రకటన ఆర్థికాంశాల గురించి అసలు ఏమీ ప్రస్తావించనే లేదా అంటే ప్రస్తావనలైతే ఉన్నాయి. కాని అవి చాలా పైపైన మాత్రమే ఉన్నాయి. ఒక్క నిర్దిష్ట ప్రతిపాదన కూడా అందులో లేదు. పేద దేశాలకు రుణసహాయం అందించే విషయాన్ని చర్చించేందుకు ఒక అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించా లన్న సూచన కూడా అందులో లేదు. పోనీ నిలకడైన వృద్ధి సాధించే విషయంలోనైనా ఒకటైనా సూచన వచ్చిందా అంటే అదీ లేదు. ప్రకటనలో అటువంటివి ఎలా చోటు చేసుకుం టాయని కొందరు ప్రశ్నించవచ్చు. కాని, కనీసం చర్చైనా జరిగిన దాఖలాలు ఉన్నాయా అంటే అదేమీ లేదు.

ఇలా ఎందుకు జరిగింది అని ఆశ్చర్యపడవలసిదేమీ లేదు. సదస్సుకు ఆతిధ్యం ఇస్తున్న మనదేశ ప్రభుత్వం దానినుండి గరిష్టంగా ప్రచార లబ్ధి పొందాలని మాత్రమే చూసింది. ఆ విధంగానే ప్రచారం చేసుకోగలిగింది కూడా. ఇక ప్రస్తుత సంక్షోభానికి ప్రధానంగా బలవుతున్నదీ, ఐఎంఎఫ్ రుద్దిన 'పొదుపు చర్యల' కింద నలిగిపోతున్నదీ పేద దేశాలు. వాటికి ఈ సమావేశంలో ప్రాతినిధ్యమే లేదు. ఇక అభివృద్ధి చెందిన దేశాలైతే అసలు సంక్షోభం ఎక్కడుందని అంటూ దబాయిస్తు న్నాయి (మరోపక్క ఆ దేశాలలో ప్రభుత్వానుకూల ఆర్థిక వేత్తలు మాత్రం సంక్షోభం ఉందని అంగీకరిస్తున్నారు). అందుచేత జి-20 సమావేశాల్లో ఆయా దేశాలు తమ తమ కారణాల రీత్యా పాల్గొన్నాయే తప్ప ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి అవి పెద్దగా పట్టించుకోలేదు.

ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ప్రస్తుత ఆర్థిక సంక్షోభం గురించి పట్టనట్టు ఎలా ఉండగలుగుతున్నాయి? గతంలో పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు నిరుద్యోగ సమస్య పట్ల చాలా ఆందోళన ఉండేది. పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించేందుకు కంకణం కట్టుకున్న ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ 'పెట్టుబడిదారులలో ఉండే వ్యక్తిగతపోకడల ఫలితంగా తలెత్తే నిరుద్యోగాన్ని ఈ ప్రపంచం సహిస్తూ ఉండడం ఇంకెంతమాత్రమూ సాధ్యం కాద'ని ప్రకటించాడు. ఆ కాలంలో నిరుద్యోగం ఆర్థిక మాంద్యం పర్యవసానంగా ఉండేది. ఆర్థిక మాంద్యంలో పెట్టుబడిదారుల లాభాలు కూడా పడిపోతాయి. ఇటు పెట్టుబడిదారులు, అటు కార్మికులు, ఇరుపక్షాలూ సంక్షోభం వలన నష్టపోయే పరిస్థితి ఉండేది. కాని ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఆవిధంగా లేదు. ఉత్పత్తిని పెంచడం ద్వారా మాత్రమే లాభాలను పెంచుకోగలం అనే పరిస్థితి ఇప్పుడు లేదు. ద్రవ్య పెట్టుబడి లావాదేవీల ద్వారా లాభాలలో గణనీయమైన భాగం సమకూరుతోంది. అందుచేత సంక్షోభ కాలంలో కూడా పెట్టుబడిదారుల లాభాలు బాగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ ద్రవ్య పెట్టుబడి లావాదేవీలలో ఏ విధమైన అదనపు విలువా ఉత్పత్తి కాదు. అందుచేత ద్రవ్య పెట్టుబడి వనరులను చేజిక్కించుకోడం మీద దృష్టి పెడుతుంది. అందుచేత ఒకపక్కన ఉత్పత్తిలో పెరుగుదల లేకపోయినా, ప్రభుత్వరంగ ఆస్థులపైన, చిన్న పెట్టుబడిదారుల ఆస్థులపైన, సహజ వనరులపైన దృష్టి పెట్టి వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం మీద బడా కార్పొరేట్లు కేంద్రీకరిస్తారు. అంటే, అదనపు విలువను చేజిక్కించుకోడంతోబాటు నేరుగా ఆస్తులను స్వాధీనం చేసుకోడానికి సిద్ధపడతారు. ఇంతవరకూ సరుకులుగా పరిగణింపబడని వాటిని సరుకులుగా మార్చివేస్తారు (పెట్టుబడి కేంద్రీకరణ అనేది కొల్లగొట్టి పోగేసుకోవడం ద్వారా జరుగుతుంది). అందుచేత ఆర్థిక మాంద్యం అనేది ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఆధిపత్యస్థాయిలో ఉన్న కార్పొరేట్ల ప్రయోజనాలకు అంతగా ఆటంకంగా పరిగణించబడదు. కాని పెద్ద స్థాయిలో పెరిగిపోయే నిరుద్యోగానికి, పేదరికానికి కారణమయ్యే ఈ విధానాల వలన సంభవించే సామాజిక అస్థిరత్వం మాటేమిటి? నిరుద్యోగం గురించి, దానిని అదుపు చేయడంలో పెట్టుబడిదారీ వర్గం తీసుకోవలసిన బాధ్యత గురించి ఆనాడు కీన్స్ చెప్పిన సందర్భానికి, నేడు పెట్టుబడిదారీ వర్గం నిరుద్యోగం పట్ల నిర్లిప్తంగా ఉంటున్న సందర్భానికి మధ్య తేడాను మనం చూడాలి. బోల్షివిక్ విప్లవం విజయవంతం కావడం, సోషలిజం అనేది సమీప కాలంలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తూండటం కీన్స్ సిద్ధాంతాన్ని బలంగా ప్రభావితం చేశాయి. ఆ కాలంలో నిరుద్యోగాన్ని పరిష్కరించే చర్యలు వెంటనే గనుక చేపట్టకపోతే కార్మికవర్గానికి పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖత బాగా పెరిగి వ్యవస్థనే మార్చే దిశగా కార్యాచరణకు వారు సిద్ధపడే అవకాశం ఉంది. కాని ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. ఉనికిలో ఉన్న సోషలిజం దెబ్బ తినడంతో సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు సోషలిజం వచ్చేస్తుందేమో అన్న భయం ఏమాత్రమూ లేదు. ఆ దేశాల ఆధిపత్యాన్ని కొనసాగించే

**(మిగతా 17వ పేజీలో)**

# మహిళా రిజర్వేషన్‌లకు గీతా ముఖర్జీ అవిరళ కృషి



- వినయ్‌విశ్వం

**సుదీర్ఘ కాలం పోరాడిన తరువాత మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనేత, పార్లమెంటు సభ్యురాలు చేసిన సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించింది. ఈ సందర్భంగా గీతాముఖర్జీని గుర్తు చేసుకుంటూ నేటి పార్లమెంటు సభ్యులంతా ఆమెకు నివాళులర్పించాలి. మహిళా హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన మనం మరువలేని నాయకురాలు ఆమె. మహిళల విముక్తి పరిపూర్ణం కాకుండా భారతదేశంలో విప్లవ సాధన లక్ష్యం నెరవేరదని నమ్మిన నాయకురాలు.**



గీతా ముఖర్జీ

ఈ దిశలో ముందుగా పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె ప్రభుత్వాలను డిమాండ్ చేసి చట్టం కోసం ఎన్నో పోరాటాలు జరిపారు. అనేక దశాబ్దాలపాటు ప్రజాస్వామ్య శక్తులు రిజర్వేషన్‌ల కోసం పోరాడాయి. నేడు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళా సంఘాలు ఇతర ప్రజాస్వామ్య శక్తుల భవిష్యత్ పోరాటాలకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తోంది. దేశంలో మహిళా సాధికారత కల్పించటానికి తామే కారణమని, ఈ ఘనత తమదేనని చెప్పుకు నేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది తమ గొప్పతనమని చాటుకునేందుకు ప్రభుత్వం తహతహలాడు తోంది. మహిళా హక్కుల పోరాట యోధులం తామే అని ప్రచారం చేసుకోవటానికి సిద్ధమైంది. అయితే రిజర్వేషన్ బిల్లును చట్ట రూపంలోకి తీసుకురావటానికి ప్రధాని మోదీ, ఆయన పార్టీ చిత్తశుద్ధితో చేసినదేమీ లేదు. రాజకీయంగా సిద్ధాంతపరంగా మహిళా సాధికారతకు వీరు వ్యతిరేకం. ఆర్‌ఎస్‌ఎస్ మహిళలకు సభ్యత్వాన్ని ఇవ్వలేదు. బీజేపీ ఈ సంస్థ నియంత్రణలోనే పనిచేస్తుంది. వీరు రాజకీయంగా, సిద్ధాంతపరంగా మహిళా సాధికారతకు వ్యతిరేకులు. మహిళలకు స్వేచ్ఛ అవసరం లేదన్న మనుస్మృతి ఈ శక్తులకు మార్గదర్శి. అకస్మికంగా ఒక్కసారిగా నారీ శక్తిని గుర్తించినట్టు, వారికి హక్కును కల్పించేందుకే ఈ చట్టం తీసుకు వస్తున్నామని చెప్పుకొంటున్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఈ బిల్లు గురించి ఏనాడూ మాట్లాడలేదు.

మహిళా రిజర్వేషన్‌ల బిల్లును యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996లో రూపకల్పన చేసింది. ఈ ప్రభుత్వంలో సీపీఐ ముఖ్యమైన స్థానాలలో పనిచేసింది. ఆనాడు ఓబీసీల రిజర్వేషన్‌లకు సంబంధించి తేడాలు రావటంతో ఈ బిల్లును ఆమోదించలేకపోయారు. ఆ సమయంలోనే గీతాముఖర్జీ నాయకత్వంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అత్యంత వేగంగా పనిచేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది. అయితే లోకసభ రద్దు కావడంతో ఈ బిల్లుకు కాలం చెల్లింది. వాజ్‌పేయి ప్రభుత్వంలోను ఈ విషయంలో చెప్పుకోదగిన పురోగతి జరగలేదు. యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు ఉండి మహిళల రిజర్వేషన్ చట్టం కోసం తీవ్రంగా కృషి చేశాయి. ఉమ్మడి కార్యక్రమంలో కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రముఖ స్థానాన్ని కల్పించారు.

2008 మే 6వ తేదీన మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. స్థాయీ సంఘం పరిశీలన అనంతరం 2010 మార్చి 9న ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. అనంతరం రాజకీయ అస్థిరతల కారణంగా ఈ అంశం విషయంలో పురోగతి జరగలేదు. మహిళా రిజర్వేషన్ చట్టం కోసం సీపీఐ, ఇతర వామపక్ష పార్టీలు ఎల్లవేళలా అంకిత భావంతో పోరాడాయి. ప్రగతి శీల మహిళా సంఘాలు ఈ విషయంలో దేశ వ్యాప్తంగా

ఉద్యమాలు నడిపాయి. జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఈ అంశంపై ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను 2021లో సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. సుప్రీంకోర్టు సైతం ఈ అంశానికి ప్రాధాన్యతను ఇచ్చి ఈ బిల్లును ఆమోదించకుండా జాప్యం చేస్తే తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. 2024లో లోకసభ ఎన్నికలు ఇంకా ఇతర అంశాలు బీజేపీ ప్రభుత్వం చట్టం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ విషయంలో బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోయినప్పటికి అవసరం కొద్దీ చట్టం చేయడానికి సిద్ధపడింది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను సాకుగా చూపి ఇప్పుడే అమలు చేయకుండా వాయిదా వేసింది. అమలులో జాప్యం చేయకుండా నిరోధించాలి. ప్రస్తుత లోకసభ రద్దు కాక ముందు బిల్లును చట్టంగా తీసుకు రావాలని వామపక్ష, ప్రజాస్వామ్యశక్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఇప్పటికే పంచాయతీలు, మున్సిపాలిటీలలో మహిళలకు 33 నుంచి 50 శాతం వరకు రిజర్వేషన్ కల్పించిన అనుభవం ఉన్నది. దీనివల్ల దేశ రాజకీయ చిత్రంలో సానుకూలమైన మార్పులు సంభవించాయి. ఇది మనం చూస్తూనే ఉన్నాం. మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టంగా తీసుకువస్తే రాజకీయ రంగంలో స్త్రీ, పురుషులకు ఒకే విధమైన స్థానం కల్పించాలన్న ఆశయం నెరవేరతుంది. ఈ చట్టాన్ని రాజ్యసభకు, రాష్ట్రాల శాసనసభలు, శాసన మండలులకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరింపజేయాలి. ఓబీసీలు, మైనారిటీలకు రిజర్వేషన్‌లు చట్టసభలలో కల్పించటం ద్వారా ప్రజాస్వామ్యం అర్థవంతమైనదిగా కొనసాగుతుంది. గీతాముఖర్జీ కమిటీ ఈ విషయాన్ని కూడా నివేదికలో పేర్కొన్నది.

ఇది తమ ఘనత అని తప్పెట కొట్టుకుంటున్న బీజేపీ నేతలు ఇంత వరకు ఈ బిల్లును ఏనాడు ఆలోచించలేదు. ఇప్పుడు కూడా నారీ శక్తి పేరుతో అధికారం దక్కించుకోవాలన్నదే వారి లక్ష్యం. సామాజిక న్యాయం కోసం మహిళలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని రాజకీయ, సిద్ధాంత అజెండాలో లేదు. ఇది ప్రజలందరికీ తెలిసిందే. ఈ ఘనత పోరాడిన మహిళలకు చెందుతుంది. మహిళా విముక్తి కోసం, న్యాయం కోసం పోరాడిన మహిళలు, ఇతర ప్రజాస్వామ్య శక్తులకు కమ్యూనిస్టులు అండదండగా నిలిచారు. ❑

# భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన జర్నలిస్టులు

**(11వ పేజీ తరువాయి)**

హిందూ ముస్లిం అల్లర్లను ఆపడానికి ప్రయత్నించిన విద్యార్థిని ఒక గుంపు హత్య చేసింది. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాన్ని రూపొందించిన హస్రత్ మోహానీ కథనాలు రాసినందుకు జైలుకు వెళ్లాడు మరియు హస్రత్ మోహానీ ప్రెస్ జప్తు చేయబడింది. మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ కూడా ఒక వార్తా పత్రికను ప్రచురించడం ద్వారా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మదన్ మోహన్ మాలవ్య 'హిందుస్థాన్'కు సంపాదకత్వం వహించారు. జర్నలిస్టుగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మహాత్మా గాంధీ స్వయంగా పత్రికలు ప్రచురించారు. పలు పత్రికలకు సంపాదకత్వం వహించారు. ప్రపంచ యుద్ధం సమయంలో భారీ సెన్సార్‌షిప్ కారణంగా ఆజాద్ హింద్ ఫౌజ్ మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి భారతీయులకు ఎలాంటి వార్త రాలేదు. కాంగ్రెస్ నాయకులతో సహా ప్రజలు, నేతాజీ జపాన్ ఏజెంట్ అని మరియు బర్మాలో పోరాడుతున్న సైన్యం జపాన్ కోసం భారతదేశాన్ని వలసరాజ్యం చేయడానికి ఉద్దేశించిన జపనీస్ ఇండియన్ ఫైటింగ్ ఫోర్స్ అని నమ్మారు. ఇమ్దాద్ సబ్రీ ఢిల్లీకి చెందిన జర్నలిస్టు, 1930ల నుండి నేతాజీతో సన్నిహితంగా పనిచేశారు. ఇమ్దాద్ సబ్రీ ఆజాద్ హింద్ ఫౌజ్‌కు మద్దతుగా వ్యాసాలు మరియు పుస్తకాలు రాయడానికి సెన్సార్‌షిప్‌ను ధిక్కరించాడు. ఇమ్దాద్ సబ్రీ రచనల ప్రభావంతో దేశానికి సత్యం తెలిసింది. ప్రజలు నేతాజీకి మద్దతుగా నిలిచారు మరియు ఆజాద్ హింద్ ఫౌజ్‌కు మద్దతుగా చారిత్రక రాయల్ నావల్ తిరుగుబాటు మరియు ఇతర నిరసనలను సాధ్యం చేశారు. ❑

# జి-20 ఢిల్లీ ప్రకటన, ప్రస్తావించని అంశాలు

(15వ పేజీ తరువాయి)

విషయంలో అవి కొన్ని సవాళ్ళను ఎదుర్కొంటున్నమాట వాస్తవమే. కాని ఆ సవాళ్ళు పెట్టుబడిదారీ వ్యవస్థనే సైద్ధాంతికంగా సవాలు చేసే స్థాయిలో లేవు. కీన్స్ కాలంలో అటువంటి సైద్ధాంతిక సవాలు కూడా ఉంది. ఇప్పుడు కార్మికవర్గం నుంచి ఎదురయే ఎటువంటి సవాలునైనా ఫాసిస్టు శక్తుల సహాయంతో దెబ్బ తీయవచ్చునని అవి భావిస్తున్నాయి. అయితే అవన్నీ పిచ్చి భ్రమలే. ప్రస్తుతం సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో భారీస్థాయిలో కార్మికవర్గ పోరాటాలు చెలరేగుతున్నాయి. బోల్షివిక్ విప్లవం వస్తుందని ఆనాడు పెట్టుబడిదారీ వర్గం ఊహించిందా? వాళ్ళ ఊహలకు అందని రీతిలో ఆనాడు విప్లవం జయప్రదం కాలేదా? ❑

# మహిళా రిజర్వేషన్ : మరో 'జుమ్లా' !



- పి.చిదంబరం

**జుమ్లా అనేది ఒక హిందీ పదం. దానికి అర్థం ఒక ధూర్త చర్య లేదా ఒక ధూర్త ప్రకటన అని చెప్పవచ్చు. 2014లోను, 2019లోను సార్వత్రిక ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీ అనేక జుమ్లాలను చేపట్టడం లేదా జారీ చేయడం జరిగింది. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు మరొక జుమ్లా మాత్రమే.**




భారతదేశ రాజ్యాంగబద్ధ, పార్లమెంటరీ చరిత్రలోని ముఖ్య తేదీలలో ప్రముఖంగా ప్రస్తావనార్హమైనవి మూడు ఉన్నాయి. అవి: (1) సెప్టెంబర్ 12, 1996- ప్రధానమంత్రి దేవెగౌడ ప్రభుత్వం రాజ్యాంగ (81వ సవరణ) బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఇంతకు మించి ఆ బిల్లు ఆమోద ప్రక్రియలో ఎటువంటి పురోగతి లేదు.

(2) మార్చి 9, 2010- ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రాజ్యాంగ (108వ సవరణ) బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. 1996 బిల్లు లాంటిదే ఇది కూడా. 186:1 ఓట్లతో ఈ బిల్లు ఆమోదం పొందింది. దానిని లోక్‌సభకు పంపించారు. అయితే అది అక్కడ పెండింగ్‌లో ఉండిపోయింది. 15వ లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లుకు కాలం చెల్లిపోయింది.

(3) సెప్టెంబర్ 18, 2023 - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగ (128వ సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. గతంలోని రెండు బిల్లుల వలే ఇది కూడా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ప్రతిపాదించింది. అయితే ఈ బిల్లులో మూడు షరతులు ఉన్నాయి. అవి దిగ్భ్రాంతికరమైన షరతులు.

పార్లమెంటు ఉభయ సభలూ 'నారీ శక్తి వందన్-2023' ను ఆమోదించాయి. రాష్ట్రపతి ఆమోదంతో అది కొత్త అధికరణ 334ఎ కింద అమలులోకి వస్తుంది. ఈ విషయమై ఆ బిల్లు ఇలా పేర్కొంది : రాజ్యాంగ (128వ సవరణ) చట్టం అమలు మొదలయి, జనాభా గణన జరిగి, దాని వివరాల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తరువాత మహిళా రిజర్వేషన్ చట్టం అమలవుతుంది'.

జనాభా గణన వాస్తవానికి 2021 సంవత్సరంలోనే జరగవలసి ఉన్నది. సహేతుకం కాని కారణాలతో జనగణనలో జాప్యం జరుగుతోంది. జనాభా గణన దేశవ్యాప్తంగా జరిగే కార్యక్రమం. దాని ఫలితాలను ప్రచురించేందుకు రెండు సంవత్సరాల సమయం పడుతుంది. తదుపరి జనాభా గణన తేదీ ఇంకా నిర్ధారణ కాలేదు. ఇదొక అనిశ్చిత పరిస్థితి.

రాజ్యాంగ అధికరణ 82లోని మూడో నిబంధన ప్రకారం లోక్‌సభలో ప్రతీ రాష్ట్రానికి సీట్ల పునః కేటాయింపును 2026 వరకు నిలిపివేశారు. 'ఒక వ్యక్తి, ఒక ఓటు' సూత్రం ప్రకారం దక్షిణ భారతావని, పశ్చిమ భారత రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గిపోతుంది. ఉత్తరాది రాష్ట్రాల సీట్ల సంఖ్య పెరుగుతుంది. సీట్లను కోల్పోయే రాష్ట్రాలు ఈ పరిస్థితిని అంగీకరిస్తాయా? నాణ్యమైన విద్యా వసతులు, మెరుగైన ఆరోగ్య భద్రతా సదుపాయాలు కల్పించి, కుటుంబ నియంత్రణ గురించి విస్తృతంగా, విపులంగా, సుబోధకంగా ప్రచారం చేసి ప్రజలను అందుకు అన్ని విధాల సంసిద్ధులను, సుముఖులను

చేసినందుకు తమను ఈ విధంగా శిక్షిస్తున్నారని దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలు విమర్శిస్తున్నాయి. 2026 అనంతరం చేపట్టే మొదటి జనాభా గణన ఫలితాలను ప్రచురించిన అనంతరం రాష్ట్రాలకు సీట్ల పునః కేటాయింపునకు రాజకీయ అవరోధాలు ఏర్పడే అవకాశమున్నది. లోక్‌సభలో రాష్ట్రాలకు సీట్ల పునః కేటాయింపు అనంతరం కొత్త 'డీ లిమిటేషన్ చట్టం' కింద నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమవుతుంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చివరిసారి 2002లో ఆరంభమై ఆరేళ్ల అనంతరం 2008 ఫిబ్రవరి 19న ముగిసింది.

ఆయా ప్రక్రియల అనుక్రమం ఇలా ఉంటుంది: 2026 అనంతరం మొదటి జనాభా గణన, ఫలితాల ప్రకటన లోక్‌సభలో రాష్ట్రాలకు సీట్ల పునః కేటాయింపుబీ కొత్త డీలిమిటేషన్ చట్టంబీ నియోజకవర్గాల పునర్విభజన. ఇవన్నీ పూర్తయిన తరువాతే మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. అయితే ఈ వరుసలోని ప్రతీ ప్రక్రియను ముగించే తేదీ ఏమిటో ఇంకా నిర్ధారించలేదు. ఈ అనిశ్చిత సంఘటనలపై మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు ఆధారపడి వున్నది. మొత్తం మీద ఈ కొత్త రిజర్వేషన్ల అమలు ప్రారంభమయ్యేది 2029 సంవత్సరం తరువాతే కావచ్చని నేను భావిస్తున్నాను.

చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలుపరచడంలో ఎదురయ్యే అవరోధాలు, ఆటంకాల గురించి మోదీ ప్రభుత్వానికి తెలియదా? 1996, 2010 సంవత్సరాలలో ప్రవేశ పెట్టిన బిల్లులలో అటువంటి అవరోధాలు లేవు. మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ అవరోధాలను కల్పించిందని మహిళలు ఆరోపిస్తే అది పూర్తిగా సమర్థనీయమే అవుతుంది. గౌరవనీయ ప్రధానమంత్రి సెప్టెంబర్ 19న మూడు వేర్వేరు సందర్భాలలో చేసిన వ్యాఖ్యలలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులో ఎదురయ్యే అవరోధాలను తమ ప్రభుత్వం ఎలా అధిగమించనున్నదో వెల్లడించలేదు. ఆ బిల్లుకు ముందుగా విధించిన షరతులపై ప్రభుత్వ మౌనం ఒక శుభ శకునాన్ని సూచించడం లేదు. మహిళా బిల్లు అమలు బాధ్యతను తదుపరి ప్రభుత్వం లేదా ఆ తరువాత వచ్చే ప్రభుత్వంపైనే మోదీ సర్కార్ మోపదలుచుకున్నదనేది స్పష్టం. ఒక పండ్ల బుట్టను మహిళలకు ఇచ్చి అందులోని ఫలాలు సమీప భవిష్యత్తులో తినకూడదని ఆంక్షలు విధించడంలా 'నారీ శక్తి వందన్-2023' వ్యవహారం ఉందనడం సత్య దూరం కాదు.

మహిళలు అనేక జీవన రంగాలలో బాగా వెనుకబడి ఉన్నారు. పార్లమెంటు, రాష్ట్ర శాసన వ్యవస్థలతో సహా వివిధ రంగాలలో వారికి సరైన ప్రాతినిధ్యం లేదు. వారి సంప్రదాయ సామాజిక హోదా, అస్వతంత్ర ఆర్థిక ప్రతిపత్తే అందుకు కారణాలుగా చెప్పవచ్చు. నిమ్న సామాజిక హోదా, వ్యక్తిగత ఆదాయం తక్కువగా ఉండడం, గృహిణి బాధ్యతలు సంయుక్తంగా చాలా మంది మహిళలను కుటుంబ బాధ్యతలకే పరిమితం చేస్తున్నాయి. తత్కారణంగానే రాజకీయ కార్యకలాపాలలో వారు సరైన స్థాయిలో పాల్గొనలేకపోతున్నారు. రాజకీయ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ఇతోధికంగా పెంపొందించేందుకు దివంగత ప్రధాన మంత్రులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు చొరవ తీసుకున్నారు. స్థానిక స్వపరిపాలనా సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టాలను వారు తీసుకొచ్చారు. ఆ కొత్త చట్టాల ఫలితంగానే గ్రామ పంచాయత్‌లకు, పురపాలక సంఘాలకు దాదాపు 13 లక్షల మంది మహిళలు ఎన్నికవుతున్నారు. ఈ ప్రగతిశీల పరిణామ తదుపరి తార్కిక పురోగతి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించడమే. చట్ట సభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించాలనే భావన మూడు దశాబ్దాల క్రితం అంకురించింది. అయితే అది ఇంతవరకూ పూర్తిగా ఆచరణలోకి రాలేదు. దాని అమలులో ఇంకెంత మాత్రం జాప్యం కూడదు. మహిళలు తమ ఓటు శక్తి ఏమిటో గ్రహించిన కాలమిది. ప్రస్తుతమున్న నియోజకవర్గాల నుంచే కొన్ని నియోజకవర్గాలను గుర్తించి, వాటిని మహిళలకు ప్రత్యేకంగా కేటాయించాలి. ఇందుకు జనాభా గానీ, నియోజకవర్గాల పునర్విభజన గానీ అవసరం లేదు. ఓటర్ల జాబితాలను తాజాగా సవరించితే సరిపోతుంది (ఇప్పుడు అన్ని రాష్ట్రాలలోనూ పంచాయత్‌లు, పురపాలక సంఘాలలో మహిళలకు సీట్లను రిజర్వ్ చేసేందుకు ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాలనే ఉపయోగిస్తున్నారు).

చట్ట సభలలో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రస్తుత ప్రభుత్వం 'నారీ శక్తి వందనన్-2023' బిల్లును రూపొందించి, పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. ఈ బిల్లు ఫలితంగా రాజ్యాంగంలో కొత్త అధికరణ 344ఎ ను చేర్చారు. అయితే మహిళా రిజర్వేషన్ల అమలును దారి మళ్లించి, జాప్యం చేసే ప్రయత్నంలో భాగమే ఆ కొత్త అధికరణ. మహిళా రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వ చిత్తశుద్ధి రాహిత్యానికి అదొక మేలి ముసుగు మాత్రమే. ఆ కొత్త అధికరణను రాజ్యాంగం నుంచి తొలగించాలి.

జుమ్లా అనేది ఒక హిందీ పదం. దానికి అర్థం ఒక ధూర్త చర్య లేదా ఒక ధూర్త ప్రకటన అని చెప్పవచ్చు. 2014లోను, 2019లోను సార్వత్రిక ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీ అనేక జుమ్లాలను చేపట్టడం లేదా జారీ చేయడం జరిగింది. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు మరొక జుమ్లా మాత్రమే. ❑

# ఈ యుద్ధం సనాతన ధర్మమంత ప్రాచీనం!



- డాక్టర్ ప్రసాదమూర్తి

**ఇది ఈ దేశానికి ఇప్పట్లో తీరే సమస్య కాదు, ఇప్పట్లో సమసిపోయే ఘర్షణా కాదు. పరస్పరం సంఘర్షించే రెండు భావజాలాల మధ్య వేల సంవత్సరాల సమరం ఇది. ఉదయనిధి స్టాలిన్ కాలాల కందిరీగల తుట్టెను కదిపాడు. అతని తలకు వెల కడుతున్నారు. శంభూకుడిలా తలనప్పగించి కూర్చునేది లేదని తెగేసి చెప్పిన తరాలకు వారసుడు ఉదయనిధి. ఆధిపత్యం, అణచివేత పునాదులుగా లేచిన మతం ఒక వైపు, సమన్యాయం, సమధర్మం ఊపిరిగా పుట్టిన చైతన్యం మరోవైపు. ఈ రెండింటి మధ్యా యుద్ధం జరగనిదెప్పుడు ? ప్రతి తరంలోనే కాదు, ప్రతి క్షణంలోనూ ఉంటుంది.**

ఉదయనిధి కేవలం ఈ సనాతన పోరాటానికి అధునాతన రూపం మాత్రమే. ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు ఇక ఇప్పుడైనా లేవండ్రా బాబూ అని గర్జిస్తారు. సంగ్రామం సమసిపోలేదని చెప్తారు. యుగాల పొడవునా కురిసిన నెత్తుటి సాక్షిగా జాతి మొత్తాన్ని మేలుకొలిపే పొద్దు పొడుపు పాటందు కుంటారు. ఇదేదో ఇప్పుడే మొదలైనట్టు వైరిపక్షం హూంకరి స్తుంది. ఒకసారి గతాన్ని తిప్పి చూద్దాం. 1927 డిసెంబర్ 25వ తేదీని గుర్తు తెచ్చుకుందాం. మంటల్లో దగ్ధమైన మనుస్మృతిని జ్ఞాపకం చేసుకుందాం. అదంతా చేసింది బాబాసాహెబ్ అంబేడ్కర్. మహద్ సత్యాగ్రహం సందర్భంగా మనుస్మృతిని అగ్నికి ఆహుతిచ్చాడు. అంటరానితనానికి ఆలవాలమైన మతాన్ని ధిక్కరిస్తున్నానని చెప్పడానికే ఈ పని చేశానన్నాడు. మతం పునాదుల మీద ఒక జాతినీ, నీతినీ నిర్మించలేరు అని అంబేడ్కర్ చేసిన హెచ్చరిక ఏ సనాతన ధర్మం గురించో, అదే సనాతన ధర్మాన్ని శతాబ్దాలకు ముందే బుద్ధుడూ నిరాకరిం చాడు. అంతకుముందు చార్వాకులూ నిరాకరించారు. మహాత్మా పూలే జీవితమంతా అదే పనిచేశాడు. తర్వాత పెరియార్ చేసిన యుద్ధమంతా అదే. 1956 ఆగస్టు ఒకటో తేదీన శ్రీరాముని చిత్రపటాలను బహిరంగంగా తగలబెట్టమని పెరియార్ పిలు పునిచ్చిన కాలం ఒకటుంది. లేదని ఎవరు అనగలరు? వేలాది అరెస్టుల మధ్య లక్షలాది జన సమూహం సాక్షిగా దగ్ధమైన రాముడి చిత్రపటాల చిటపటలు నిజం కాదని ఎవరు చెప్పగలరు? అంబేడ్కర్ మరణానంతరం రిపబ్లికన్ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో గణనీయంగా సీట్లు సాధించింది. 1959లో పెరి యార్‌ని కాన్పూర్ ఆహ్వానించి ఆయనకు ఖడ్గాన్ని బహూకరిం చారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో రామాయణ కాపీలను చించి నిర సన తెలిపిన సందర్భం ఉంది. ఎప్పుడో 1944లోనే పెరియార్ రాసిన వాల్మీకి రామాయణం, తర్వాత ముప్పయ్యేళ్ళకి సచ్చీ రామాయణ్ అని హిందీలోకి అనువాదమైంది. అది హిందీ లోకంలో భూకంపం సృష్టించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిషే ధిస్తే అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళితే అక్కడా చుక్కెదురైంది. సచ్చీ రామాయణ్‌లోని సత్యమే గెలిచింది. ఉత్తరాది మీదుగా వచ్చి దక్షిణాదిని కబళించిన ఆర్యు ల ప్రతినిధి రాముడని పెరియార్ వాదన. మూలవాసులైన ద్రవిడ సంతానాన్ని రాక్షసులుగా చిత్రించి, దక్షిణాది స్త్రీలను అవమానించిన రక్తచరిత్రే రామాయణం అని వాల్మీకి రామాయణాన్నే ఆధారంగా చేసుకుని పెరియార్ యథార్థ రామాయణాన్ని రాశారు. తమిళనాడు మూలమూలల్లోనూ ఆ రామాయణం నాటక రూపంలో ప్రదర్శింపబడింది. ఈ విషయం నెహ్రూ దృష్టికి వచ్చినప్పుడు ఉత్తరాది ప్రజల నుంచి అణచివేతకు గురైన దుష్పరిణామాల స్వరూపం ఇదని వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. 'ఇది అర్థం చేసుకోవాల్సిన సెంటిమెంటు. దీనిని విస్మరించిన హిందీ నాయకులు హిందీకి గానీ దేశానికి గానీ పెద్దగా మూల సహాయకులుగా ఉండలేరు' అని నెహ్రూ అభిప్రాయపడినట్టు 1954 డిసెంబర్ 15న 'ది మెయిల్' ప్రచురించిన విషయాలను యథార్థ రామాయణం అనే పుస్తకంలో పొందుపరిచారు. ఇంత చరిత్ర ఉంది. సనాతన ధర్మం ఎంత పురాతనమో దాని పట్ల వ్యతిరేకత కూడా అంతే పురాతనమైంది. అభ్యుదయ రచయితల సమావేశంలో సనాతన ధర్మం నిర్మూలన అనే అంశం మీద మాట్లాడుతూ ఉదయనిధి స్టాలిన్ తాను వచ్చిన వారసత్వపు చైతన్యాన్ని ప్రదర్శించాడు. ఎక్కడ ఏ సందర్భంలో ఎవరు ఏం మాట్లాడారన్నదే చూడాలి. తమిళనాడులో పెరియార్ రామస్వామి 20వ శతాబ్దంలో ఆర్య సంస్కృతి పెత్తనం మీద, ఆధిపత్యం మీద సాగించిన మహోద్యమం, ఈ దేశం మొత్తం మీద సనాతన ధర్మానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమాలకు, పోరాటాలకు గట్టి పునాది

(మిగతా 36వ పేజీలో)


# దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు !



- డా. దేవరాజు మహారాజు

**'నైతిక జీవితానికి మత విశ్వాసంతో పనిలేదు. దైవ చింతన అవసరమే లేదు' అని అన్నారు పి.బి.షెల్లీ - ప్రఖ్యాత ఇంగ్లీషు కవి. అస్థిత్వంలో లేని పరలోకాల గురించి, ఆత్మల గురించి చెప్పి పురాతన కాలంలోకి తీసుకుపోయేది బ్రహ్మ జ్ఞానం - దైవ జ్ఞానం' కానీ, కేవలం అస్థిత్వంలో ఉన్న భౌతిక విశ్వం గూర్చి, వాస్తవాలైన ప్రకృతి సూత్రాల గూర్చి శోధించి, సాధించి, మానవాళి ప్రగతికి తోడ్పడేది మానవ విజ్ఞానం - విజ్ఞానం శాస్త్రం - సైన్సు.**

తెలుగు రచయిత చలం ఒకచోట ఇలా అంటారు.. 'చిన్న తనం నుంచి ఓ మనిషి ఒక అభిప్రాయంతో పెరిగితే, ఆ అభిప్రాయం అతనికి సుఖాన్ని, తృప్తిని ఇస్తూ ఉంటే, ఎంత వాదించి, బోధించినా అతను దానికి వ్యతిరేకమైన భావనలోకి మారలేదు. పైగా దేవుడు ఉన్నాడనుకోవడం లాభదాయక మైనప్పుడు మనం ఎంత గొప్పతర్కం చేసి రూఢగా చెప్పినా – దేవుడు ఉండడానికి వీల్లేదన్న విషయం ఒప్పుకోడు. ఆ మనిషిలో కదలిక రాదు'. ఇలాంటి వారిని మనం మన నిత్యజీవితంలో చూస్తూనే ఉన్నాం. మరో ముఖ్యమైన విషయమేమంటే, దేవుడి భ్రమలో ఉన్న వారితో వాదనలు ప్రమాదకరం. వారు మానవ శ్రమతో తయారైనవి వాడుతూనే, మౌఢ్యాన్ని ప్రచారం చేసే ఆలోచన గలవాళ్ళు. మానవ శ్రమతో కాకుండా అంటే సైన్సుతో కాకుండా, కేవలం దేవుడి కృపతో బతికే నిజమైన భక్తుడు ప్రపంచంలో ఒక్కడు కూడా లేడన్నది వాస్తవం! దేశంలో విద్యా వంతుల శాతం సుమారు యాభై అనుకుందాం. ఈ యాభై శాతం జనాభా వివేకవంతులై ఉండాలి కదా? ఉంటున్నారా? చదువు దారి చదువుదే, మూఢ విశ్వాసాల దారి మూఢ విశ్వాసాలదే. చదువుకుని కూడా మూఢ విశ్వాసాల నుంచి బయటపడని వారే అధికం. గౌరవం, స్థాయి, ఉన్నంత మాత్రాన మూర్ఖపు ఆలోచనలు ఉండకూడదని ఏమీలేదు. చదువుకున్న గౌరవనీయ మూర్ఖులుంటారు. దేశానికీ, రాష్ట్రాలకూ అధినేతలవుతున్నారు. అలాగే హుందాగా ఉండాల్సిన వారు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. పైగా అహంభావంతో అహంకారంతో బతుకుతుంటారు. మాది అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని ప్రగల్భాలు పలుకుతూ అప్రజాస్వామిక కార్యకలాపాలు




నిర్వహిస్తూ ఉండటం ఈ దేశంలోని రీతి రివాజు. అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనయి ఉండి శాటిలైట్ మోడల్ తీసుకెళ్లి తిరుపతి దేవుడికి సమర్పించి పూజలు చేస్తారు. ఆశ్రమాల్లో స్వాముల ఆశీర్వాదాల కోసం పరుగులు పెడతారు. గణిత శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొంది కూడా న్యూమరాలజిస్ట్ చెప్పాడని, పేర్లలో అక్షరాల సంఖ్య మార్చుకుంటారు. ద్రవ లక్షణాలు, రాతి లక్షణాలు తెలిసిన విద్యాధికులే విగ్రహాలు పాలు తాగుతున్నాయని నమ్ముతుంటారు. పొర్లు దండాలు పెడుతుంటారు. పర్యావరణ శాస్త్రం క్షుణ్ణంగా చదువుకున్న మేడమ్ గారు తనే పూనుకుని కప్పల పెండ్లిండ్లు చేయిస్తుంది. ఆస్ట్రానమీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయి ఉండి కూడా ఆస్ట్రాలజీని నమ్ముకుంటారు. ఓషనోగ్రఫీ (సముద్ర శాస్త్రం)లో స్నాతకోత్తర పట్టా సాధించిన వారే పుణ్యం వస్తుందని ఎవరో అనామకుడు చెబితే నమ్మి, నదీ జలాల్లో నాణాలు నోట్ల కట్టలు విసిరేస్తారు. నూనెల లక్షణాలన్నీ బాగా అధ్యయనం చేసిన పరిశోధకుడే వెళ్లి అక్కడ ప్రేయర్ ఆయిల్ పూసుకుంటాడు. జీవశాస్త్రం మథించిన మహిళలే పాము పుట్టల్లో పాలు పోసి, నాగేంద్రుడు పాలు తాగాడని సంతోషిస్తారు. మేనేజ్‌మెంట్ కోర్సులో టాపర్‌గా నిలిచిన

అమ్మాయి మంగళవారం మహా చెడ్డదని, మడి కట్టుకుని కూర్చుంటుంది. ఆర్థికశాస్త్రంలో అపారమైన జ్ఞానం సంపాదించు కున్నవాడు శుక్రవారం అప్పిస్తే తిరిగి వస్తుందా? రాదా? అని మీనమేషాలు లెక్కిస్తాడు. బుల్లెట్లకు ఎదురునిలిచే ఉక్కు శరీరం పెంచుకున్న వాడు పిల్లి ఎదురైందని వెనక్కి తిరిగివస్తే లాభమేముంది? భూగర్భశాస్త్రంలో సాధికారంగా పట్టు సాధించి – తన జ్ఞాన సంపదను, ఇంగిత జ్ఞానాన్నీ కూడా పక్కన పెట్టి, కొబ్బరి కాయ పట్టుకుని నడిచేవాడెవడో నీళ్లు ఎక్కడ పడతాయో చెపుతానంటే వాడివెంట పడి వెళితే.. లాభమేముందీ? ఆర్కియాలజీ విభాగానికి అధిపతి అయిన మహాతల్లి ఏదో చెట్టుకు లింగం ఆకారంలో బొడుపు కనిపించిందని ఉపవాసదీక్ష ప్రారంభిస్తే.. లాభమేముందీ? అనాటమీలో మాస్టరీ చేసిన డాక్టరు గారు, ఆవు మూత్రానికి అల్సర్లు, క్యాన్సర్లు తగ్గుతాయని ఎవరో కోన్‌కిస్కా బాబా చెపితే నమ్మి తాగడం మొదలుపెడితే.. లాభమేముంది? ప్రపంచంలో కేవలం భారతదేశంలో మాత్రమే ఆవునెయ్యి కాల్చబడుతుంది. పాలు నేలపాలవుతాయి. ఆవు మూత్రం మాత్రం ఔషధంగా తాగబడుతుంది. 'ఆవు పేడ కోహినూర్ వజ్రం కంటే విలువైంది' అని అన్నారు బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర. ఈయనకున్న తెలివి తేటలు కూడా ఆనాటి బ్రిటిష్ వారికి లేనందువల్లనే కదా? ఆవుపేడ వదిలేసి అనవసరంగా కోహినూర్ వజ్రం తీసుకుపోయారు? కొన్ని విషయాలు కేవలం ఈ దేశానికే ప్రత్యేకం.. ప్రపంచంలో ఇంకెక్కడా జరగవు.. ఒక్క పరీక్ష కూడా రాయని, ఎందులోనూ ఉత్తీర్ణత సాధించని ఈ దేశ ప్రధాని, పరీక్షలు రాసేవారికి సూచనలిస్తారు. తన మెల్లకన్నును నయం చేసుకోలేని రాందేవ్ బాబా కేన్సర్ రీసర్చ్ సమావేశాలలో ప్రసంగిస్తారు. భార్యను హత్య చేసి, ఆరోపణలు, కేసులు ఎదుర్కొంటున్న జగ్గీ వాసుదేవ్, కుటుంబ బంధాలను ఎలా నిలుపుకోవాలో స్త్రీ పురుష సమానత్వం ఎలా సాధించాలో – కార్పొరేట్ బుద్ధిహీనులకు బుద్ధి ప్రసాదిస్తారు. మళ్లీ ఈయనే స్త్రీలకు 'పిల్లల పెంపకమే ముఖ్యమైన బాధ్యత' అని సెలవిస్తారు. మరి తన కూతురు పసిదానిగా ఉన్నప్పుడు భార్యను చంపి, కూతురికి తల్లిలేకుండా ఎందుకు చేశారు ? ఆయన తన కుట్రలో తన ప్రేమికురాలి సహాయం ఎందుకు తీసుకున్నారు? ఈయన నిర్వాకం గురించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఇంగ్లీషు దినపత్రిక ప్రచురించిందంతా అబద్ధమా? ఎప్పుడూ ఎక్కడా ఎందుకు మాట్లాడరు?

'దేశంలో మెజార్టీ హిందువులది కాబట్టి, మిగతా వారంతా హిందూ ధర్మాన్ని అనుసరించడం, ఆచరించడం బావుంటుంది' అని సూచించారు దేశ ప్రధాని. అది సరే.. దేశంలో మెజార్టీ పేదలది. మరి పరిపాలన పేదలకు అనుగుణంగా ఎందుకు ఉండటం లేదు ? అనే ప్రశ్న వస్తుంది. కార్పొరేట్ కంపెనీల కను సన్నల్లో వారికి అనుగుణంగా పరిపాలన సాగుతోందంటే దాని వెనక ఉన్న కుట్ర ఏమిటి ? 'కుమాన్‌లో భాగేశ్వర్ జిల్లాలో ఉన్న గరుడ్ గంగానది నీళ్లు తాగితే మహిళలకు సిజేరియన్ ఆపరేషన్లు జరగవని, ఆ నదిలోని రాళ్ళు తెచ్చి పాముకుట్టిన చోట రాస్తే విషమెక్కదని, మనుషులు ప్రాణాలతో బయటపడతా'రని ఉత్తరాఖండ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడూ, నైనితాల్, ఉధమ్‌సింగ్‌నగర్ పార్లమెంట్ మెంబరూ అయిన అజరుభట్ ప్రకటించారు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం దీన్ని కూడా అమలు చేయాలి. ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గితే మంచిదే కదా?

ప్రస్తుత ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక భారతదేశంలోని గోవులు ఒక నిర్ణయానికి వచ్చాయి. 'పాలకన్నా ప్రస్తుతం దేశ ప్రజలకు మూత్రం అవసరం చాలా ఉంది గనక, తాము దాన్నే ఎక్కువగా ఉత్పత్తి చేయాలని" తీర్మానించుకు న్నాయి. ఆవులు ఆక్సిజన్ పీల్చుకుని ఆక్సిజన్ వదిలేస్తున్నాయని పెద్ద పెద్ద దేశ నాయకులు చెపుతున్నారు. అలాగైతే అవి గాలి పీల్చుకుంటున్నది ఎందుకూ? అవి గాలి పీల్చుకుండా ఉంటే పోతుంది కదా. అలా పీల్చుకోకపోయినా ఆవులు బతుకుతాయా ? లేదా? అని, గాలి పీల్చుకోనపుడు ఆ జంతువుల్లో జీవన క్రియలు జరగుతాయా? లేదా? అని అని, పరిశోధనలు చేయించి, వాటి ఫలితాల వివరాలు దేశానికి వెల్లడించాలి. నిత్యం మనం సంభాషించే భాషని సంస్కృతం కాపాడుతూ ఉందని – ఆ విషయాన్ని ఒక కంప్యూటర్ చెప్పినట్టుగా నాసా ధృవీకరించిందని మన కేంద్ర వనరుల శాఖామంత్రి రమేశ్ పోక్రియాల్ వెల్లడించారు. దీనిమీద వైజ్ఞానిక లోకం ఎందుకు మౌనం వహించిందీ? అసంబద్ధమైన విషయాన్ని ఖండించక పోవడమూ అసంబద్ధమే కదా? పవరుంటే అబద్ధాలాడొచ్చా?

'యెల్లలోకము లొక్కయిల్లై / వర్ణ భేదము తెల్ల కల్లై /

వేల మెరుగని ప్రేమ బంధము / వేడుకలు కుడియ /

మతములన్నియు మాసిపోవును / జ్ఞాన మొక్కటి నిలిచి వెలు గును"– అని మన తెలుగు మహాకవి గురజాడ అప్పారావు కలలు గన్నారు. ఆయన బతికి ఉన్న కాలానికి ఇప్పటి ప్రభుత్వం అధికారంలో ఉంటే అనవసరంగా అలా ఆశలు పెంచుకునే వారు కాదేమో! భారతీయ తత్వశాస్త్రమంటే మనకు ఇంతకాలం తప్పుడు సమాచారమిస్తూ వచ్చారు. బ్రాహ్మణీయ, మనువాద, ఆధిపత్య భావజాలం భారతీయ తత్వశాస్త్రం కాదు. ఈ భావ జాలానికీ శ్రమ జీవులకూ సంబంధమే లేదు.

ప్రజల శ్రమను గుర్తించింది లోకాయతం, చార్వాకం, బౌద్ధం వంటి భౌతిక వాదాలు మాత్రమే! అవే దేశంలో మెజారిటీ శ్రమజీవుల వాదాలు. దేశ వైజ్ఞానిక వారసత్వం ఈ వాదాలదే. ఈ వాదాలన్నీ శ్రమ జీవులవే. మెజార్టీలో ఉన్న ఈ దేశంలోని శ్రమ జీవులు నేతల మీద ఆధారపడకుండా – తమ భౌతిక, వైజ్ఞానిక వాదాల్ని దృఢపరుచుకోవాల్సి ఉంది. తమను తాము రక్షించుకోవాల్సి ఉంది. ❑

# అభ్యుదయ సాహిత్య వారసత్వాన్ని నిలబెట్టుకుందాం

**- అరసం 18వ జాతీయ మహాసభ ప్రకటన**

**నలభై మూడేళ్ల కిందట అన్ని భారతీయ భాషలకు చెందిన మహత్తరమైన, ఉజ్వలమైన అభ్యుదయ రచయితల ఉద్యమ పరిరక్షకులమైన మనం ప్రజా స్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం ఆదర్శాలకు నిబద్ధులమై ఇక్కడే సమావేశమయ్యాం. స్వాంత్ర్యోద్యమంలో పెంచి పోషించిన, రాజ్యాంగం పూచీపడ్డ సమానత, న్యాయం, సెక్యులర్ ప్రజాస్వామ్యంలాంటి ఆదర్శాలకు పెద్ద సవాళ్లు ఎదురవుతున్న స్థితిలో మళ్లీ ఇక్కడే 18వ మహాసభలో సమావేశం అవుతున్నాం.**

ప్రస్తుతం భారత ప్రజాస్వామ్య అస్తిత్వానికి ఇదివరకు ఎన్నడూ లేని సంక్షోభం ఎదురవుతోంది. ఈ శతాబ్దంలో, ముఖ్యంగా గత దశాబ్ద కాలంగ తిరోగమన, అధికసంఖ్యాకుల ఆధిపత్యం, మూఢ నమ్మకాలు, పునరుద్ధరణవాద భావాలను గొప్పగా కీర్తిస్తున్నారు. వ్యవస్థలో భాగం చేస్తున్నారు. దీనివల్ల హేతువాదం, బహుళత్వం, శాస్త్రీయ ఆలోచన, అభ్యుదయ దృక్పథం లాంటి వాటి స్థానంలో ఈ తిరోగమన భావజాలం ప్రబలిపోతోంది. సెక్యులర్ ప్రజాస్వామ్యాన్ని అత్యధిక సంఖ్యాక మతరాజ్య వ్యవస్థలా మార్చేసే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జ్ఞాన సముపార్జనా వాతావరణాన్ని కలుషితం చేసి స్వయం ప్రతిపత్తి ఉన్న రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సార్వజనీన స్థాయి, పరిశోధన, విద్యా వ్యవస్థలు, విశ్వ విద్యాలయాలతో సహా అన్నిచోట్లా మేధోపరమైన సంవాదాలకు ఉన్న చోటు కుంచించుకు పోయేలా చేస్తున్నారు. భారత సమాజంలోని బహుభాషల, బహుళత్వ, ఉమ్మడి సాంస్కృతిక సంపదను ఉపేక్షించి సంస్కృతిని ఏకపక్షంగా, ఒక వర్గానికే చెందిందిగా, సంకుచితమైందిగా మార్చేస్తున్నారు. బుద్ధుడు, బసవన్న, కబీర్ సంప్రాదాయలను చెరిపేస్తున్నారు. సందర్భ శుద్ధి లేకుండా గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. హిందుత్వ రాజకీయాలకు పెట్టుబడిదారీ వ్యవస్థలకు, కార్పొరేట్ శక్తులకు మధ్య ప్రత్యక్ష సంబంధం తీవ్ర కలవరం కలిగిస్తోంది. ఈ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంవల్లే నిరంకుశవాదం వస్తుంది. ఇది స్వదేశీ ఫాసిస్టు రూపమే. కానీ దీని పుట్టుక, అమలు విధానం హిట్లర్ నాజీయిజం నుంచి స్ఫూర్తి పొందినవే. స్వదేశీవ్యవస్థలలో ప్రత్యక్షసంక్షోభం తలెత్తింది. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిరసనలను, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచి వేస్తున్న ఉదాహరణలు కొల్లలుగా ఉన్నాయి. అనేకమంది మేధావులను, రచయితలను, మానవ హక్కుల కార్యకర్తలను ఈ





సమయంలోనే జైళ్లల్లో పెట్టారు.

నరేంద్ర దభోల్కర్, గోవింద్ ఎం.ఎం. కల్బుర్గి, గౌరీ లంకేశ్ ఈ క్రమంలో ప్రాణత్యాగం చేసి అమరులయ్యారు. అంతర్జాతీయ క్షమా సంస్థ, ఇతర మానవ హక్కుల సంస్థల మీద దర్యాప్తు పేరుతో దాడులు చేసి, అవి తమ పని చేయడానికి వీలు లేకుండా చేశారు.

**1990లలో ఉదారవాదం, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ లాంటి ఆర్థిక విధానాలు అమలు చేసినందు వల్ల అసమానత, పేదరికం బాగా పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు లేకపోవడం, జీవితావసరాలు తీరకపోవడం వల్ల 80 కోట్ల మంది కనీస జీవితావసరాలకోసం నానా పాట్లు పడుతున్నారు. విద్య, వైద్య రంగాలకు సంబంధించిన బాధ్యతలను రాజ్య వ్యవస్థ వదిలేసింది. మధ్య తరగతి వారి మీద అనవసరమైన అధిక మొత్తాలలో పన్ను పెంచేశారు. పింఛన్లు రాని వర్గాల వారు విపరీత సమస్యలు ఎదుర్కుంటున్నారు. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత తరం భవిష్యత్తు కూడా ప్రమాదంలోనే ఉంది.**

రాజ్యాంగం ఆశించిన సంక్షేమ రాజ్యాంగ భావనను వదిలేసి మొత్తం దేశాన్ని ఒక వాణిజ్య పథకంగా మార్చేశారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ లాంటి ఇతర రాజ్యాంగ వ్యవస్థల మీద దాడి చేస్తున్నారు. వాటిని బలహీనం చేస్తున్నారు. పత్రికలు, ప్రసార సాధనాలైన ఎలక్ట్రానిక్ మీడియాను లొంగదీసుకుని అసమర్థంగా మార్చేశారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల మీద కూడా గట్టి నియంత్రణ ఉంది. ప్రపంచ వ్యవస్థలో సామ్రాజ్యవాద ధోరణి మొదలైనప్పటి నుంచి ప్రత్యామ్నాయ, స్వతంత్ర విధానాలను విడనాడారు.

ఈ అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి గో సంరక్షణ, లవ్ జిహాద్, హిజాబ్, గంగ, గీత లాంటి అంశాలను లేవనెత్తు తున్నారు. మతం, కులం, వ్యక్తిగత విశ్వాసాల ఆధారంగా సమాజాన్ని చీల్చడానికి అన్నిరకాల ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. ఇలాంటి నేరపూరిత కార్యకలాపాలపై ప్రభుత్వ నియంత్రణ ఊసే లేదు. పైగా ఇలాంటి దుండగులకు శిక్ష పడుతుందన్న భయం లేకుండా ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. అసమ్మతి తెలియజేసేవారు, ప్రతిఘటించే వారిపై అనేక రకాల అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వారిమీద 'అర్బన్ నక్సలైట్లు', 'టుకే టుకే గ్యాంగ్', 'అవార్డ్ వాపసి గ్యాంగ్' అన్న ముద్రలతో నిందలు వేస్తున్నారు.

## హిందూ పునరుద్ధరణ వాదం

ప్రస్తుతం హిందూ పునరుద్ధరణ వాదం పాలకవర్గాల ప్రధాన ఎజెండాగా కొనసాగుతోంది. పురోహితులు పార్లమెంటులో సెంగోల్ను ప్రతిష్టించడం, అయోధ్య ఆలయ శంకుస్థాపనలో ప్రభుత్వాధినేత పాల్గొనడం ఈ ఎజెండాను బాహాటంగా అంగీకరించడమే. దేశ విభజన విషాదాన్ని 'విభజన విభీషిక దివస్'గా పాటించి ప్రజల మనసుల్లో ఆ భావం శాశ్వతంగా ఉండేట్టు చేస్తున్నారు. అద్భుత శక్తులున్నాయని చెప్పుకునే బాబాలు ప్రజల మనసులను కలుషితం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వ, పరిపాలక విభాగం మద్దతు ఉంది.

## మైనారిటీలను అణగదొక్కుతున్నారు

మణిపూర్, మేవాత్ నుంచి ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో విభజన, వేర్పాటువాద బీజాలు నాటుతున్నారు. నగరాల పేరు మారుస్తూ ఉమ్మడి అస్తిత్వాన్ని, గుర్తింపును మార్చేస్తున్నారు. అల్ప సంఖ్యాక మత వర్గాల వారు లవ్ జిహాద్, గో హత్యలకు, బలవంతపు మత మార్పిడులకు పాల్పడుతున్నారని ప్రచారం

చేసి వారిని శత్రువులుగా చిత్రిస్తున్నారు. వెర్రెత్తినట్టు వ్యవహరించే వారు పాల్పడుతున్న హత్యాకాండ, బుల్డోజర్ న్యాయం లాంటివి మైనారిటీలను అణచివేయడానికి ప్రభుత్వానికి కొత్త ఆయుధాలు గా ఉపయోగపడుతున్నాయి. ఈ పద్ధతిలో అసమ్మతి గొంతు నొక్కుతున్నారు. మహిళల, దళితుల, రైతుల అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తే వారిని, వారి హక్కుల కోసం పోరాడే వారిని విస్మరించడమే కాకుండా అణచి వేస్తున్నారు. రాజకీయాలలో జబ్బ పుష్టిగల వారికి రక్షణ కల్పించడం మామూలు అయిపోయింది. సమాజాన్ని చీల్చే, విభజించే ప్రకటనలు చేసే వారికి రక్షణ కల్పిస్తున్నారు. న్యాయస్థానాలు ఇలాంటి వారిమీద చర్య తీసుకోవాలని ఆదేశించినా లక్ష్య పెట్టడం లేదు. మనువాద, అధిక సంఖ్యాకుల ఆధిపత్యవాదం, మనువాద భావజాలంవల్ల సహజంగానే మహిళలు, ఆదివాసులు, దళితులపట్ల వివక్ష ప్రదర్శించడం, కోరేగావ్ ఉదంతాల్లో ఇదే కనిపిస్తుంది. ఆదివాసులను వారి సంస్కృతిక చైతన్యానికి దూరం చేసిన వారికి చెందవలసిన నీరు, అడవులు, భూములను లూటీ చేయడం నిరాఘాటంగా కొనసాగుతోంది. ఈ లూటీ వల్ల అంతిమంగా లాభం పొందేది కార్పొరేట్ పెట్టుబడిదారులే. వీరికి మితవాద రాజకీయాలతో సన్నిహిత సంబంధం ఉంది. భావజాలం ఆధారంగా అసమ్మతి వ్యక్తం చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా మార్చేశారు.

### రచయితల ఆగ్రహం

ఇదే సమయంలో తమిళ, తెలుగు, కన్నడ మలయాళ, గుజరాతి, సంథాలి(ఇంగ్లీషు) రచయితలైన పెరుమాళ్ మురుగన్, కంచ ఐలయ్య, కె.ఎస్.భగవాన్, ఎస్.హరీశ్, పరుల్ కక్కర్‌కు వ్యతిరేకంగా వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. కోర్టు కేసులు మోపారు. ఇలాంటి సంఘటనలన్నీ రచయితలమైన మనకు ఆగ్రహం, కలత కలిగిస్తున్నాయి. చరిత్రను మార్చి రాస్తున్నారు. చరిత్ర క్రమాన్నీ తారుమారు చేస్తున్నారు. చారిత్రక పురుషులు, పరాక్రమవంతులైన అక్బర్, టిప్పు సుల్తాన్ లాంటి వారి గురించి ఉన్న అంశాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించి. హిందుత్వ హీరోల గురించి చేరుస్తున్నారు. దీనివల్ల భారత్ సామాజిక నిర్మాణంలో అనివార్యంగా వైవిధ్యాన్ని గురించిన అవగాహన మృగ్యం అవుతోంది. మొత్తం వైవిధ్యమే నాశనం అవుతోంది. కొత్త తరం ఏకపక్ష అభిప్రాయాలు ఏర్పరుచుకుంటుంది. తప్పుడు దిశలో ఆలోచిస్తారు. వారికి చరిత్ర, బహుళత్వం గురించిన సంపూర్ణ అవగాహన కొరవడుతుంది. ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాలలో తీసుకొచ్చిన తిరోగమన మార్పులు దీనికి నిదర్శనం. నూతన విద్యా విధానం ఈ మార్పులను ప్రతిబింబిస్తోంది. ఇలాంటి పరిస్థితి ఏ దేశ, లేదా సమాజాభివృద్ధికి పెద్ద అడ్డంకిగా, ప్రమాదకరంగా ఉంటుందని మనందరికీ తెలుసు. మన ప్రతిఘటనాత్మక చైతన్యంతో దాదాపు గత దశాబ్ద కాలంగా మనం ఈ దుస్థితిని గమనిస్తున్నాం. రచయితలు ఉమ్మడి వేదికల ద్వారా మన నిరసన కూడా తెలియజేశాం. రైతుల ఉద్యమం, మహిళా మల్లయోధుల పోరాటం, మానవ హక్కుల పరిరక్షకులు, మేధావులు, నిర్భయంగా పని చేసే పత్రికా రచయితల విషయంలో మన పాత్ర వారికి మద్దతుగా నిలిచింది. పౌరసత్వ జాబితా గురించి కూడా మనం ఇలాంటి మద్దతే ఇచ్చాం. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల దృష్ట్యా మన ప్రథమ కర్తవ్యం రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించడమే. దీనికి తోడు విస్తృతమైన ప్రజా పోరాటాల్లో మనం భాగస్వాములం కావాలి. ఈ పని చేయాలంటే భావ సారూప్యత గల రచయితల సంఘాలతో మనం ఐక్య వేదిక నిర్మించాలి. ఈ సందర్భంగా 1936లో అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపక సమావేశం

1936లో లక్నోలో జరిగినప్పుడు ప్రేం చంద్ చేసిన ప్రసంగం మనకు గుర్తొస్తుంది. ఆయన ఇలా అన్నారు. 'సాహిత్యంలో జీవిత సత్యాలు, అనుభవాలు వ్యక్తం అవుతాయి. అందులో జీవితం మీద విమర్శ కూడా ఉంటుంది. అట్టడుగువర్గాల, పీడితుల, అధికారాలు లేని వారి పక్షాన నిలబడడం సాహిత్యం విధి. అది వ్యక్తులైనా కావచ్చు. బృందాలు అయినా కావచ్చు. కళ ప్రయోజనం గురించి ఆలోచించాలి. అందం, సౌందర్యాత్మకత కొలమానాల ను మనం మార్చాలి. అందం అనే విస్తృత పటంలో యావత్ప్రపంచం ఉండాలి. మంచి అభిరుచి ఉండాలి, ఆత్మ గౌరవాన్ని ఆదరించాలి. మానవాళిని వ్యతిరేకించకుండా ఉండాలి. రచయితా సమాజంలో అంతర్భాగమే. సమాజం నుంచి వేరు చేస్తే రచయితకు ఉండే విలువ శూన్యమే. సాహిత్యం కేవలం వినోదం లేదా విలాసం కోసం అని మనం పరిగణించం. ఉన్నత ప్రమాణాలుగల సాహిత్యమే ఈ పరీక్షకు నిలబడగలుగుతుంది. అది స్వేచ్ఛ కావచ్చు, సౌందర్య సారం కావచ్చు, సృజనశీలత ఆత్మ కావచ్చు, జీవిత సత్యాలు కావచ్చు. అది మనలను కలచి వేయవచ్చు. అది మనల్ని నిద్ర పుచ్చేది కాకూడదు. నిద్ర అంటే మరణంతో సమానమే. ప్రేమ్‌చంద్ చెప్పిన ఈ మాటలు సవాళ్ల మయమైన ఇప్పటి పరిస్థితిలోనూ వర్తిస్తాయి. మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. ఈ మహత్తరమైన వారసత్వం మనదేనని మనం ఉమ్మడిగా నిర్ణయించుకుందాం. ❑

**(ఈ ప్రకటనను 2023 ఆగస్టు 20, 21, 22 తేదీలలో జబల్పూర్లో జరిగిన అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం మహాసభలో ఆమోదించారు.)**

# వైజ్ఞానిక రంగంలో తెలుగు భాషా వికాసం ఒక పరిశీలన



- డాక్టర్ సి.వి.సర్వేశ్వరశర్మ

**మానవుడి ముఖయంత్రం నుండి వెలువడిన అర్థవంతాలైన ధ్వనుల సముదాయాన్ని భాష అంటారు. మనిషి తన మనసులోని భావాన్ని అభివ్యక్తం చేసే సాధనాల్లో భాషే ముఖ్యమైన సాధనం. శబ్దంవల్ల అర్థం తెలియడాన్ని శక్తి అంటారు.భాష ఉపయోగం విస్తరించిన కొలది వివిధ శబ్దాలకు వివిధ అర్థాలు ఏర్పడడం జరిగింది. అంటే ఒక పదానికి వ్యవహారంలో ఒక అర్థం, సాహిత్యంలో మరొక అర్థం,శాస్త్రం లో మరొక అర్థం ఏర్పడిన సందర్భాలున్నాయి.**

ఒక పదం లోక వ్యవహారంలో ఒకలా, శాస్త్రీయ వ్యవహారం లో మరోలా ప్రయోగించవచ్చు. మనిషి సంఘజీవి కాబట్టి పరస్పర భావప్రసారం అనివార్యం. లోకంలో సగం అనర్థాలకు కార ణం అపార్థాలు. ఈ అపార్థాలకు కారణం అన్నవాడు అనుకు న్నది అనుకున్నట్లు అన్నాననుకున్న వినేవాడు అలా అర్థం చేసు కోకపోవడం. అంటే తన భావప్రసారానికి తాను ఉపయోగించిన భాషలోనో, దానిని పలికిన తీరులోనో లోపం జరిగి ఉండాలి. లేదా వినే వానిలో అవగాహన లోపం ఉండి ఉండవచ్చు.

### రాజభాష

మన రాష్ట్రాన్ని పూర్వం పరిపాలించిన పరిపాలకులు మాతృ భాషనే రాజభాషగా పరిగణించేవారు. పూర్వం సంస్కృతం రాజ భాషగా వున్నా నన్నయ కాలం నాటికి (11వ శతాబ్దం) తెలుగు రాజభాషగా స్థిరపడింది. దైనందిన కార్యక్రమాలకు ఏ భాష వాడేవారో స్పష్టంగా చెప్పలేము గాని, సాహిత్య, శాస్త్ర గ్రంథాల లో పద్య రూపంలో ఉండే గ్రాంధిక భాషే ప్రబలంగా ఉండేది. 16వ శతాబ్దం నాటికి గ్రాంధిక భాషలో వచన రచనలు కొద్దిగా రావడం మొదలయ్యింది. ఆంగ్ల ప్రభుత్వం ఏర్పడిన తరువాత భావ పరివర్తన ఏర్పడి తెలుగు భాషలో గ్రాంధిక, శిష్ట వ్యవ హారిక భాషావాదాలు చోటు చేసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం 1835లో విద్యా విధాన అధికారిగా మెకాలే విద్యా విధానంలో ఇంగ్లీష్ మీడియంలోనే జరగాలని గట్టిగా పట్టుపట్టాడు. ఫలితంగా విద్యావ్యవస్థలో ఇంగ్లీష్ మీడియం మొదలయ్యింది. నిజానికి ఆ నాటికి మన భాషల కంటే ఇంగ్లీష్ భాష ఏమీ గొప్పగా లేదు. మూడు, నాలుగు వందల సంవత్సరాల క్రితం ఇంగ్లీష్ భాష వారి దేశంలోనే పామర భాషగానే చెలామణి అయ్యేది.ఆ రోజుల్లో సైన్స్ రచనలన్నీ లాటిన్ భాషలో ఉండేవి. అయితే బ్రిటిష్ వారు లాటిన్ భాష పండిత భాష అని, శాశ్వతమైనది కాదని తమ ఆధిక్యతను నిలబెట్టుకోవడానికి కొన్ని శతాబ్దాలు కృషి చేశారు. 1835లోనే మిగతా భారతీయ భాషల మాదిరి బోధన మన మాతృ భాష తెలుగులో ఉండాలని నిర్ణయించి ఉంటే ఈ పాటికి తెలుగుభాష అన్ని విధాల పరిపుష్టి చెంది ఉండేది. మెకాలే ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియం బోధన వలన ఇంగ్లీష్ అభివృద్ధి చెంది తెలుగు కుంటుపడింది.

### తెలుగు భాష - పాఠ్య పుస్తకాల తయారీ

వైజ్ఞానిక బోధనా భాషగా తెలుగు భారతీయ భాషలన్నిటి లోనూ అత్యంత అనువైనదని జె.బి.యన్.హాల్డేన్ ప్రశంసించా డు. తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని యూరోపియన్లు అభివర్ణించారు. అంతవరకు ఎందుకు 'దేశ భాషల యందు తెలుగు లెస్స' అన్నాడు శ్రీకృష్ణ దేవరాయులు. తెలుగు భాష విషయంలో పూర్వపు గ్రాంధిక భాష మారకూడదని ఒక వర్గం, శిష్ట వ్యవహారిక భాషనే గ్రంథ రచనలో ఉపయోగించాలని రెండవ వర్గం వాదించడంలో పండిత లోకం రెండు వర్గాలుగా చీలిపోయింది. సామూహిక విద్యా సౌకర్యాలకు, శాస్త్ర గ్రంథాల రచనకు శిష్ట వ్యవహారిక భాష తగినదని నిర్ణయించారు. విద్యార్థులకు గ్రాంధిక భాష అభ్యసించడం కష్టముగా ఉంటుం దని, అసలు అటువంటి భాష జ్ఞానం వారికి అవసరం లేదని శిష్ట వ్యావహారిక భాష వాదులు వాదించారు. అనేక వాదోప వాదాలు, సాంఘిక, రాజకీయ, పరిణామాల తరువాత శిష్ట వ్యవహారిక భాషే స్థిరపడి శాస్త్ర గ్రంథాల రచన, అధ్యయనం ఈ భాషలోనే కొనసాగుతున్నాయి. మాతృ భాషలో విద్యా వ్యాప్తి కోసం పాఠ్య పుస్తకాల తయారు చేయించడం కోసం 1968లో తెలుగు అకాడమీ అవతరిం చింది. నిపుణులను ఆహ్వానించి సదస్సు నిర్వహించింది. ఈ నిపుణులలో కొందరికి వస్తు నిష్టకన్నా వ్యక్తి నిష్ట ఎక్కువ. ఒకప్పుడు తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు ఉంటాయి. మొత్తం మీద రచనలు మొదల య్యాయి. మాటలు వాడేటప్పుడు

వాటి అర్థాన్ని నిర్వచించడానికి ప్రధానంగా నాలుగు పద్ధతులు ఉంటాయి. అర్థారోపణ, శబ్దకల్పన, శబ్దమూల విచారణ, అంతర్వాణి పద్ధతులు. వీటిపై పూర్తి అవగాహన లేని కారణంగా అనువాద రచనలు గాడి తప్పి తెలుగులో ప్రత్యక్షం కావడం జరుగుతోంది. ఉదాహరణకు వృక్ష శాస్త్రం రచన చేసిన ఒక గ్రంధకర్త ఆకులకు వెంట్రుకలు ఉంటాయని రాశాడు. తమాషా ఏమిటంటే ఆంగ్లంలో 'హెయిర్' అనే పదం ఒకటి మాత్రమే ఉంది. కాని తెలుగులో 'వెంట్రుక, నూగు, ఆరు, మాగారు' వంటి పదాలు ఉన్నాయి. తెలుగులో ఉన్నంత వైవిధ్యం ఇంగ్లీష్‌లో లేదు. ఇంగ్లీష్‌లో 'కజిన్', అంకుల్', నెఫ్యూ' లాంటి మాటలకు విస్తృత అర్థాలు ఉన్నాయి. ఉదాహరణకు అంతర్వాణి పద్ధతి పరిశీలిస్తే కొన్ని భావాల సముదాయం నుంచి మాటలు పుడుతూ ఉంటాయి. 'జాతి' అంటే కొన్నినిర్థిష్ట లక్షణాలు గల జన సమూహం కళ్ళకు కనిపిస్తుంది. 'తెలుగు జాతి' అనేమాట వినగానే వారి లక్షణాలు, నివసించే ప్రాంతాలు మెదడులో మెరుస్తాయి. ఇటువంటి పదాలు మనకు తెలుగులో ఎన్నో ఉన్నాయి. అసలు తెలుగులో వున్న మాధుర్యం, సౌందర్యం, తెలుగుకి మాత్రమే స్వంతం.

## ప్రామాణిక భాష

అభ్యాసం వల్ల పనిలో నేర్పరితనం వస్తుంది. అభ్యాసం ద్వారా అనుభవం వస్తుంది. అభ్యాసం, అనుభవం మూడు రకాలు. చారిత్రక సామాజికాభ్యాసం, శాస్త్రీయాభ్యాసం, స్వంత అభ్యాసం. సమాజం సంచయించిన అనుభవం అనేక రూపాల్లో మనకు అందుబాటులో ఉంది. శాస్త్రీయ అనుభవం కూడా అందుబాటులో ఉంది. ఈ రెండు అనుభవాలను ఆకళింపు చేసుకుని స్వానుభవాన్ని జోడించుకుంటే అప్పుడు కమ్యూనికేషన్‌కు కావలసిన ప్రామాణిక భాష నిర్మాణం సాధ్యమవుతుంది.

## రచనలలో ఎదురయ్యే సమస్యలు

గణిత, విజ్ఞాన, సాంకేతిక, సాంఘిక శాస్త్ర గ్రంథాల రచన శిష్ట వ్యవహారిక భాషలో కొనసాగినా ఈ శాస్త్రాలలో వాడిన పరిభాషను, భాషను సంస్కృత భూయిష్టం చేయడం వలన అర్థం మరుగున పడిపోయి, భావస్పష్టత లేకుండా పోయింది. గణిత, విజ్ఞాన, సాంకేతిక రంగాలలో వచ్చే అంశాల భావనలలో తార్కికంగా భాష సహాయంతో భావనలు పెంపొందించడం అనేది ముఖ్యమైన విషయం. భావన, భావన పరంపర ఏర్పడడంలోను సరళం నుండి క్లిష్టంగా ఉండే విషయాలను అవగాహన చేసుకోవడంలోను భాష ప్రముఖపాత్ర వహిస్తుంది. పదాల్లోను, పద వివరణలలోను ఉపయోగించే తెలుగుతోనే స్ఫూర్తికలగాలి.

## పాఠ్య గ్రంథాలలోని భాష

ప్రస్తుతం వాడుకలోనున్న పాఠ్య గ్రంథాలలోని భాష ఏ విధంగా ఉందో ఒకసారి పరిశీలిద్దాం. 'పరమాణువుల దృష్ట్యా తుల్యం చేయగా' అని రసాయనశాస్త్రంలో ఒక వివరణ. ఇందులో పరమాణువు వరకు 'పరిభాష', 'దృష్ట్యా', 'తుల్యం'వంటి పదాలు కూడా పరిభాష వలె భ్రమ పెడుతున్నాయి. ఆ పదాలు మార్చి నా ఎటువంటి నష్టం వాటిల్లదు. 'దృష్ట్యా'కి బదులు 'దృష్టి'తో, 'తుల్యం'కి బదులు 'సమానం' అని రాస్తే విషయం సులువుగా విద్యార్థులకు అర్థమవుతోంది. అవసరం వున్నా లేకపోయినా సంస్కృత పదాలు స్వేచ్ఛగా వాడే తెలుగు రచనలు చదివి అదే శైలికి శాస్త్ర గ్రంథ రచయితలు అలవాటు పడుతున్నారు. గతంలో వేమన స్పష్టంగా సూచించాడు. కొండను కొండ అంటే చాలు 'కుధరం' అనవలసిన అవసరం ఏముంది? అదే విధంగా 'కుండ'ను 'కుండ' అంటే సరిపోతుంది. 'భాండం' అని రాయాలా ? గ్రాంధిక వాసనలు శిష్ట వ్యవహారిక శైలి ఈ రెండూ ఒకే కర్రకు ఉన్న రెండు కొనలు వంటివి.

## వాక్యం గురించి

గతంతో పోలిస్తే మన శాస్త్ర గ్రంథాలలో తెలుగు వాక్యం చాలా మారింది. ఇంకా మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'శ్వాసక్రియ మనిషి జీవించడానికి అవసరమయ్యే అతి ముఖ్యమైన శరీరధార్మిక ప్రమేయం'. ఇది ఇంగ్లీష్‌లో వున్న వాక్యాన్ని యధాతథంగా అనువదించి ఉండవచ్చు. అర్థం అవుతున్నప్పటికీ పరభాషల ప్రభావం నుండి ఇంకా పూర్తిగా బయటకు రాలేకపోతున్నారు రచయితలు. భావం అసంపూర్తి గానే ఉండిపోతోంది. 'మనిషి బతకడానికి శ్వాసక్రియ అత్యవసరం. అది శరీర ధర్మం' అంటే చక్కగా అర్థం అవుతుంది. 'ఈస్టర్న్ హెమీస్ఫియర్' అంటే 'ప్రాగార్థ గోళం', 'పూర్వార్ధగోళం' వంటి పదాల ఉపయోగించడంకన్నా 'తూర్పు అర్థగోళం' అని రాస్తే ఎంత సులువుగా అర్థం అవుతుంది.

## ఆఫీషియల్ లాంగ్వేజ్ తెలుగు

ఆఫీషియల్ లాంగ్వేజ్ తెలుగు అంటే అధికార భాష తెలుగు అని అర్థం చెబుతున్నారు. అంటే మిగతా భాషలు ఏ విధమైన అధికారం లేనివా ? అనే ప్రశ్న ఎదురవుతుంది. సులువుగా దీనిని కార్యాలయ భాష అంటే సరిపోతుంది కదా! అని కొంత మంది ఆలోచన. ప్రకృతి శాస్త్రాలలోని పరిభాషకు ఒకపక్క సంస్కృతాన్ని, మరొక పక్క ఇంగ్లీషుని ఆశ్రయించక తప్పడం లేదు. దీనివల్ల నష్టం లేదు. ఆధునికంగా తెలుగు భాష పెరుగు తోందనుకోవాలి.

1) 'డాక్యుమెంట్స్' అంటే కాగితం పత్రాలు అనడం కన్నా 'దస్తావేజులు' అంటేనే బాగుంటుంది.

2) 'మేన్యువల్ లేబర్' అంటే  మానవీయ శ్రమ అనాలా? కాయకష్టం అంటే సరిపోతుంది కదా!

3) 'ఫ్లెక్సిబుల్' అంటే  'అదృడత' అని అనడం కన్నా 'సరళం' అంటేచాలదా? అని కొంతమంది సూచనలు. వినగానే కొంతైనా అర్థమయ్యేటట్లు పరిభాషను సవరించుకుంటే బోధనా భాషగా, పరిపాలన భాషగా  తెలుగు మరింత అభివృద్ధి చెందుతుంది.

## పత్రికల పాత్ర

భాషా సాంకర్యానికి ఎవరూ ఏనాడూ వెరవు చూపలేదు. 180 ఏళ్లనాడు వెలువడిన తెలుగు పత్రికలలో రాసిన భాష అతి నికృష్టమైన సంకర భాష. వాళ్ళకు సంపాదకుడు, విలేఖరి, వంటి పదాలు కూడా స్ఫురించలేదు. తెలుగు వారు ఏమీ స్వతంత్రంగా రాయలేరని, అనువాదాలు, అనుకరణలు, అతిశయోక్తులు చేశారని ఒక రచయుత 'త్రిలింగ' పత్రికలో  వ్యాసాలు ధారావాహికంగా రాశాడు. ప్రస్తుతం దిన పత్రికలు, ఇతర మాగ్జయినులలో శాస్త్రీయ విశేషాలు రాస్తున్నారు. స్వతంత్రంగా పరిశోధనలు చేస్తున్న ఏ శాస్త్రవేత్త పరిశోధనలపై తెలుగులో వ్యాసాలు రాయడం లేదు. వారికి ఇంగ్లీషులో విశేషాలు వెలువడితే చాలు. తెలుగులో వాటిని అందరూ రాయ లేరు. రాసే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. కారణం తెలుగులో రాయాలంటే అర్ధ జ్ఞానం ఉండాలి కదా! అసలు తెలుగు పత్రికలన్నిటికి శాస్త్రీయ విశేషాలు రాయగల సిబ్బంది ఉన్నారా? అనేది ఒక సందేహం.

**తెలుగులో సైన్స్ రచనలు చేసే రచయితలు ఉన్నారు. అయితే వారి రచనను పాఠకులకు అర్ధ మయ్యే  రీతిలో, ఆకర్షించే ప్రణాళికతో రాయాలంటే  భాష మీద పట్టు, విషయంపై పూర్తి అవగాహన ఎంతో అవసరం. పారితోషకం చెల్లించకుండా రచనలు ప్రచురిస్తే  ఆ రచనలలో ఎంతసారం ఉంటుందో వేరుగా చెప్పనవసరం లేదు. సైన్స్ వ్యాసాలు తెలుగులో రాయడం అంత సులువు కాదు. రచయిత విశేషంగా అధ్యయనం చేస్తూ ఉండాలి. దానిని సామాన్యునికి అర్థమయ్యే రీతిలో మలిచి రాయాలి. అటువంటి రచయితలు తక్కువగానే ఉన్నారు. ఎక్కువగా ఇంగ్లీషులో ప్రచురితమైన వాటిని చేతనైన పద్ధతిలో అనువాదం చేసి రాస్తున్నారు. మరి కొంతమంది పాత రచనలను సేకరించి రాస్తున్నారు.**

పత్రికలు ముఖ్యంగా వ్యవసాయ, వైద్య విషయాలపై వ్యాసాలు ప్రచురిస్తున్నాయి. ఇవి సమాచార ప్రధానమైనవిగానే ఉంటున్నాయి. వైద్య సలహాల్లో జవాబులు తరచు పునరావృతం అవుతూ ఉంటాయి. కొన్ని పత్రికలు సెక్స్ విజ్ఞానం పేరుతో బూతులు ప్రచురిస్తున్నాయి. వాటిని సైన్స్ అనలేము. రాష్ట్ర విద్యాశాఖ ప్రచురించిన 'కౌమారవిద్య' పుస్తకం చక్కగా ఉంది. అది ఎవరైనా చదువుకునేందుకు వీలుగా ఉంది.

## సాహిత్య ప్రక్రియలు

తెలుగు భాషా వికాసానికి సాహిత్య ప్రక్రియలు ఎంతగానో ఉపకరిస్తాయి. సైన్స్‌ను కథలు, కవితలు, పాటలు, నాటికలు, బుర్రకథలు, సంగీత నృత్య రూపకాలు, ఉపన్యాసాలు వంటి ప్రక్రియల ద్వారా తెలుగులో రచనలు చేయడం వలన వైజ్ఞానిక రంగంలో భాష వికాసం జరగడానికి వీలవుతుంది. ఈ వ్యాసకర్త ఈ ప్రక్రియలను ఆసరా చేసుకుని 92 వైజ్ఞానిక గ్రంధాలు రాశారు. అంతేకాదు దాదాపు అన్ని తెలుగు దిన, వార, మాస పత్రికలలో 1976 నుండి ఇప్పటి వరకు 11 వేలకు పైగా  సైన్స్ వ్యాసాలు రాశారు. 1984లో సైన్స్ ప్రచారంకోసం 'కోనసీమ సైన్స్ పరిషత్'ను స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాలు స్వచ్ఛందంగా పర్యటించి 2,820 సైన్స్ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల్లో సైన్స్ కథలు, కవితలు, పాటలు, నాటికలు, బుర్ర కథలు, సంగీత నృత్య రూపకాలు, ఉపన్యాసాలు, ఎగ్జిబిషన్లు వంటివి ఏర్పాటు చేయడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల సైన్స్ పాఠ్య పుస్తకాల రచయితగా, సంపాదకునిగా నియమించి ఈ వ్యాసకర్త సేవలు వినియోగించుకుంది. అంతేకాదు ఈయన కొన్ని సైన్స్ రచనలను తెలుగు పాఠ్య పుస్తకాలలో  మన ప్రభుత్వ విద్యా శాఖ, మహారాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ పాఠాలుగా ప్రచురించాయి. ఆకాశవాణి కొన్ని కేంద్రాలు సైన్స్ ధారా వాహికలు రాయించుకున్నాయి. మొత్తం 280 సైన్స్ ప్రసంగాలు రేడియో ద్వారా ప్రసారం అయ్యాయి. దాదాపు 70 టెలివిజన్ కార్యక్రమాలలో పాల్గొని సైన్స్‌ను తెలుగులో వ్యాప్తి చెందించడానికి కృషి చేయడం జరిగింది. ఆంధ్ర సారస్వత పరిషత్, భీమవరం 2022 జనవరి 7న నిర్వహిస్తున్న వైజ్ఞానిక సదస్సు వలన తప్పని సరిగా వక్తల ప్రసంగాల వలన, పలువురిలో తెలుగు భాషాభివృద్ధికి ఎవరికి వారే చేయాల్సిన కృషిపై ఒక కదలిక మొదలు కావాలి. తెలుగు భాషాభివృద్ధి కోసం వీరు తీసుకుంటున్న బాధ్యత పలువురికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ❑

# గురజాడ బతికేడు మూడు యాభైలు!



- అట్టాడ అప్పల్నాయుడు

'రెయిలు పడీ వరకు ఎప్పుడు పడునని ఆసక్తితో యెదురు చూచు చుంటిమి. గాని రెయిలు పడ్డ తర్వాత కూడా గౌణుగుడునకు కావలసినన్ని అవకాశములు రెయిల్వే వారు కల్పించినారు. ఊళ్ల దగ్గర స్టేషనులుంటే ఉపద్రవము వస్తుందని కాబోలు యోచించి కాళ్లకు కసరత్తు కలిగి పురజనులు దృఢముగా వుండగలుగుటకు ఊళ్లకు కడుదూరముగా స్టేషనులు వుంచినారు. కొన్ని చోట్ల తుని తగవులు కూడా చేయుచు వచ్చిరి. అలమండ స్టేషను ఊరికి రమారమీ రెండు మైళ్ల దూరము, సింహాచల స్టేషను వూరికి మూడుమైళ్లు, వాల్తేరు స్టేషను త్రిశంకు స్వర్గము వలె వాల్తేరుకు విశాఖపట్నముకు అంటివుండక రెంటికీ యెడమగా వున్నది. విజయనగరం నుంచి అనకాపల్లి వెళ్లగోరువారు అసావాదిత్యో బ్రహ్మా అని అనకాపల్లి త్రోవ వదిలి వాల్తేరు స్టేషను యాత్ర చేసి వొకగంట ఆ స్థలమును సేవించి, తిరిగి వదలిపెట్టి అనకాపల్లి త్రోవవరకు వెనుకకు త్రొక్కి అక్కడనుండి అనకాపల్లి వెళ్లేసరికి మధ్యాహ్నము కాగా ఆ యెండలో వూరికి అద్దెబళ్లకుగాను బండివారలతో అద్దెను గురించి పోరాడి, వూరు చేరి మూడు ఝాములలోగా యిన్ని మెతుకులు కడుపులో వేసుకొన్న యెడల కృతార్థులని యోచించతగును...' గురజాడ అప్పారావుగారు 1893 డిసెంబరు 10వ తేదీన విజయనగరంలో రెయిలు ప్రయాణం చేసిన సందర్భంగా రాసుకున్న డైరీలో వాక్యాలు!

మద్రాసు నుంచి విశాఖపట్నం వరకూ రైల్వే లైను 1893లో ఆరంభమయ్యింది. 1910 నాటికి అది కలకత్తా వరకూ పొడిగించారు (అప్పటికి కలకత్తా మన దేశ రాజధాని). 1892 ఆగస్టులో 'కన్యాశుల్కం' మొదటి ప్రదర్శన జరిగింది. (ఈనాడు మనకు పరిచయమయిన రెండో కూర్పు 1909లో ప్రచురణయ్యింది. 1910లో తొలి ఆధునిక కథ 'దిద్దుబాటు'ను గురజాడ రాసేరు. ఆధునికతకు రైల్వేలూ, బస్సులూ, యితర యంత్ర ప్రయాణసాధనాలూ ఉపకరిస్తాయని చెపుతారు. ఇది ఒక రకంగా నిజమేకావచ్చుగానీ, ఆ సాధనాల నిర్వాహకులూ, లేదా యజమానులూ, లేదా పాలకులూ సమాజాన్ని ఆధునికత వైపు నడిపించాలనే లక్ష్యంతో వీట్ని ప్రవేశపెట్టడంగానీ, నిర్వహించడంగానీ చేయరు! వారి నిర్వాకం ఎలా వుంటుందో రైలు వొచ్చిన తొలినాళ్లలోనే, యెక్కిన తొలి ప్రయాణంలోనే, భవిష్యత్‌ని దర్శించేడు గురజాడ. నూట ఇరవయ్యేళ్ల తర్వాత గూడా రైళ్లు, స్టేషనులు పురజనుల కాళ్లకు కసరత్తులూ,



దృఢత్వమూ యిచ్చేందుకే ప్రయత్నలోపం లేకుండా కృషి చేస్తున్నాయి. నిజానికి డైరీలోని ఆ వాక్యాలు ప్రజల జీవనావసరాల పట్ల రాజ్యపు నిరాసక్త ధోరణిని నిర్మొహమాటంగా, వ్యంగ్యంగా యెత్తిచూపించేవి!

ఆధునిక రెయిలు ప్రయాణసాధనం వచ్చిన రోజుల్లోనే కళింగ ప్రాంతంలోని కన్యాశుల్క దురాచారమ్మీద శాసనసభల్లోనా, యితరేతర వేదికల్లోనా చర్చజరుగుతోంది. కానీ చర్చల సారాంశాలు సాధారణ ప్రజానీకాన్ని చేరడం లేదు. విజయనగరం మహారాజాగారి కోరిక మేరకు ప్రజలకు చేరేవిధంగా కన్యాశుల్కం దురాచారాన్ని దుయ్యబడుతూ నాటకం రాయదలచి, గురజాడ రాసేరు. ఆ నాటకాన్ని మొదటి రెయిలు కంటే ముందే 1892లో జగన్నాథ విలాసినీసభ వారు ప్రదర్శించేరు. రెయిలు మన కళింగం దాటి కలకత్తాకు పొడిగించిన యేడాది 1910లో గురజాడ 'దిద్దుబాటు' కథ రాసేరు. ఈ రెండు తేదీలూ, గురజాడ రచనలూ కలిపి యెందుకు రాస్తున్నానంటే – ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ఆధునిక ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి విధానాలూ, మార్కెట్టూ, వాటి ప్రభావమూ, అప్పటికి మన ప్రాంత స్థితిగతులను గుర్తు చేసుకుంటూ, ఆ వెలుగులో గురజాడ రచనలను పరిశీలించి, ఆయనను ఎలా అర్థం చేసుకోవాలో, ఆయన నుంచి యేమి స్వీకరించాలో బోధపరచుకోడానికి ఉపకరిస్తుందని!

తాను ఎక్కిన రైలు తీరుతెన్నుల్ని విమర్శించిన గురజాడ – బహుశా రచయితకు సమాజాన్ని దిద్దుబాటు చేసే లక్ష్యం వుండి

తీరాలనుకున్నాడేమో, అందుకే తన రచనలన్నీ సామాజిక స్థితిగతులమీదా, సమాజంలో జరుగుతోన్న అక్రమాలమీద, అమానుషాలమీదా విమర్శా, విసుర్లూ, వ్యంగ్యాస్త్రాలుగా ప్రయోగిస్తూ, కొన్నిచోట్ల మన కంటికి ఆననంత సుదూర మానవ సుందర స్వప్నాన్ని మన కళ్లకు చూపిస్తూ, మనం నిర్మించుకోగలిగే స్వర్గాన్ని గొప్ప విశ్వాసంతో బోధిస్తాడు! అది 'కన్యాశుల్కం' నాటకం కావచ్చు, 'దిద్దుబాటు' కథ కావచ్చు, 'సంస్కర్త హృదయం' కథ కావచ్చు, 'దేశభక్తి' గీతం కావచ్చు, 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' కావచ్చు, కొసకి 'కొండుభట్టీయం' కావచ్చు. గురజాడ లక్ష్యం మనుషుల్ని మంచివైపు నడిపించడం. అందరూ మంచిగా వుంటే అందరికీ మంచి జరుగుతుందన్న శుద్ధ ఆదర్శవాదం కావచ్చేగానీ, గురజాడ ఆకాంక్ష అది!

స్త్రీ పురుషులు సమానమనీ, యిద్దరూ ఒక స్వర్గాన్ని నిర్మించుకోవాలనీ తొలిసారి ప్రేమ అనే భావనను సాహిత్యంలోకి తీసుకువచ్చేడు. మగడు వేల్పను పాత మాట... అన్నాడు. ఈ భావనతో కవితలే గాక 'దిద్దుబాటు', 'మెటిల్డా' కథలు రాసేడు. ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చునన్నాడు. అలాగే అప్పటికే చరిత్రలో జరిగిన మత కల్లోలాలల్లో జరిగిన హింసను చూసి, మతాన్ని ఈసడించేడు. మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగునన్నాడు. 'పెద్దమసీదు', 'దేవుళ్లారా మీ పేరేమిటి' అన్న కథలు రాసేడు. అప్పటి సంస్కర్తల బోలుతనాన్ని ఎండగట్టే 'సంస్కర్తహృదయం' కథ ఇంగ్లీషులో రాసేడు (అవసరాల సూర్యారావు తెలుగులో అనువదించేరు). ఇలా కథ, కవిత, నాటకం, వ్యాసం యేది రాసినా సమాజాన్ని దిద్దుబాటు చేసే కర్తవ్యనిర్వహణగా గురజాడ రాసేరు. వారి రచనలెంత గొప్పవో, యిప్పటికీ వాటి రెలవెన్సు కోల్పోకపోవడమే ఉదాహరణ! దేశభక్తి గీతం నిజానికి యీ భూమ్మీది యే దేశానికయినా ఒప్పే జాతీయ గీతం! అది 1910లో రాసేరు. అప్పటికి మన దేశం యింకా ఒక దేశంగా, యిప్పుడున్న భౌగోళిక రూపంలో లేదు. రాజులూ, నవాబులూ, ఆంగ్లేయులూ పాలిస్తున్నారు. ఇంకోవేపు ఆంగ్లపాలన తొలగాలన్న ఆందోళనలు నడుస్తున్నవి. స్వాతంత్ర్యం సిద్ధిస్తే, ఒక దేశంగా మన దేశం రూపొందితే యెలా వుండాలి, ప్రజలెలా వుండాలి, పాలకులెలా వుండాలి, దేశమేరీతి ముందుకుపోవాలి అన్న ప్రణాళికను ఆ గీత రూపంలో అందించేరు. కనుకనే వందేళ్లకు ఒక టాగూరు జన్మిస్తారేమోగానీ, వెయ్యేళ్లకు ఒక గురజాడ జన్మించడం కష్టమన్నారు విమర్శకులు! దురదృష్టవశాత్తూ అధి నాయకులను భాగ్యవిధాతలుగా కొలిచే గీతం మన జాతీయ గీతమయ్యింది (రాసిన రచయితే ఆ గీతం పట్ల అసంతృప్తిని వెళ్లగక్కినా). గురజాడ తెలుగులో రాయడం ఆయన దురదృష్టం, తెలుగువారి అదృష్టం! అసలు రచన ఆరంభం ఇంగ్లీషులోనే చేసేరు, సారంగధరను ఇంగ్లీషులో రాసేరు!

కథ, కవిత, గీతాలేగాక గురజాడ రాసిన వ్యాసాలు ఎన్నో ఉన్నాయి. మాటామంతీ శీర్షికన, గ్రామ్యశబ్ద విచారణము గురించి నాలుగూ వ్యాసాలు, ఆంధ్రకవితాపిత శీర్షికన నాలుగు వ్యాసాలు, బంకించంద్రుని నవల మీద సమీక్ష, ఇద్దరు రాజులు శీర్షికన రవీంద్రనాథ్ టాగూర్ గురించీ వ్యాసం, ఇంకా వంగీయసాహిత్య పరిషత్తు గురించీ, కన్నడ వ్యాకరణము గురించీ వ్యాసాలు రాసేరు. ఆంగ్లేయుల సాహిత్యం గురించీ, అక్కడి విమర్శనా రంగపు వైభవం గురించీ రాసేరు. ఈ రచనల కారణంగా అప్పటి పండితులు, గ్రాంథిక భాషావాదులు గురజాడను అనేక రకాలుగా విమర్శ చేసేవారు. గురజాడ వాటన్నిటినీ సవివరంగా ప్రతిస్పందించి పూర్వపక్షం చేసేరు. ఒకాయనయితే ఆకాశరామన్నగా అవతరించి గురజాడను – 'ఇక మీదట యిటువంటి రాతలు రాయనని, బుద్ధి వచ్చినటుల పత్రికా ముఖముగా ప్రచురించండి. నేనెవరినో మీరెరుగుదురా?' అని హెచ్చరించేరు. దానికి గురజాడ జవాబు చదివితే గురజాడ వ్యంగ్యబాణం యెంతటి వాడియయినదో తెలుస్తుంది. 'ఆకాశరామన్న బహు దొడ్డ మనిషి. బహు ప్రాచీనుడు. రాతలు లేని కాలంలో ఆతని ఆఫీసు అమలు యెలా జరిగెనో నిశ్చయించలేము. చెట్టు చాటునుంచీ, పుట్ట చాటు నుంచీ ముఖం పెట్టి యెదట చెప్పరాని వార్త కేకవేసి వెళ్లేవారు కాబోలు...' యిలా ఆరంభించి, ఆకాశరామన్న భావాలనూ, అతని రాతలనూ జలకడిగేసేడు గురజాడ! బంకించంద్రుని నవలను యెలా అర్థం చేసుకోవాలో, దాని పరిమితులేమిటో చెబుతూ, 'లోకోత్తర కల్పనలుండక, లోకత్తరమయిన రచన వుండదు. గానీ మనుష్యజాతము యొక్క మనోధర్మములను, వస్తుతత్వము ననుసరించి కథ నడువవలే' అంటాడు గురజాడ! 'ఇద్దరురాజుల' శీర్షికలో రవీంద్రుని ఇల్లూ, అక్కడి సాహిత్య, సంగీత గోష్టులూ, రవీంద్రుని ఆకర్షణీయ రూపమూ వర్ణిస్తూ – ఆఖరువాక్యంగా, 'కలకత్తా పట్టణంలో చిట్టచివరికి దోమలు సైతం పొలిటీషియన్సే' అనంటాడు. అంత సూక్ష్మ పరిశీలకుడు గురజాడ!

గురజాడ సృజనాత్మక రచనలేగాక, అతని డైరీ, వ్యక్తుల రూపురేఖలూ, వారి వ్యక్తిత్వాల గురించి ఆయన రాసుకున్న నోట్సు, విజయనగరం మహారాజా గురించి రాసుకున్న జ్ఞాపకాలూ, కొన్ని పదజాలాలూ, ప్రాంతాలూ, ముఖ్యంగా ఆయన చదువుకున్న ప్రాచీన, ఆధునిక గ్రంథాల వివరాలూ, ఆంగ్లభాషలోని గ్రంథాలూ... వీటన్నిటీ పరిశీలిస్తే బతికిన ఏభయ్యేళ్లలోనే మహానుభావుడివన్నీ యెలా చేసేడనిపిస్తుంది, ఒక పక్క రాజాస్థానపు బరువు బాధ్యతలు చూస్తూ, అర్భకపు శరీరంతో, అదీ ఉబ్బసవ్యాధితో! 'ఎవడు బతికేడు మూడు యాభైలు' అంటారుగానీ, గురజాడ బతికేడు మూడు యాభైలు, బతుకుతాడింకెన్నో మూడు యాభైలు! ❑

# గురజాడ జీవితంలో బౌద్ధం

- టి. రవిచంద్

**ఆంధ్రులలో ఆధునిక భావాలకు నిజమైన ప్రతినిధి మహాకవి గురజాడ అప్పారావు (1862-1915). ఆయన బౌద్ధమతంపై ప్రత్యేకమైన ఆసక్తి కనబరిచినట్లు ఆయన రచనల ద్వారా వెల్లడవుతుంది. విజయనగర సంస్థానం శాసన పరిశోధకుడిగా కళింగాంధ్రలోని వివిధ చారిత్రక ప్రదేశాల్లోని శాసనాల్ని గురజాడ అప్పారావు అధ్యయనం చేశారు. కళింగ దేశ చరిత్ర రాయాలని సంకల్పించి దానికి సంబంధించిన సమాచారం సేకరించారు. ఈ విషయానికి సంబంధించిన స్పష్టమైన ఆధారం ఆయన 'జాబులు-జవాబు'లలో లభిస్తుంది.**



వి.సూర్యనారాయణ అనే సాహిత్యాభిమాని మచిలీపట్నం నుండి 20-6-1914 గురజాడకు రాసిన ఒక లేఖలో ఆయన రాయ సంకల్పించిన చరిత్రను త్వరగా పూర్తిచేయమని కోరుతూ ఆ లేఖలో ఇలా కోరారు: 'చరిత్ర రచన అలాగునే వుంచివేసినారు. ఇతర వ్యాపకాలు తగ్గించుకొని, మీరు తలపెట్టిన చరిత్రను పూర్తిచేయడం మంచిది. దానినీ, నిఘంటువును దేశానికి మీరు సమర్పించాలి. మీరనుకుంటున్న విశాఖ జిల్లా చరిత్ర త్వరలో వెలువడితే ఇతర జిల్లాల వారికి ఆదర్శప్రాయంగా ఉంటుంది. ఆయన రాయాలనుకున్న చరిత్ర గ్రంథం కొరకు ఎంతో అధ్యయనం చేశారు కళింగాంధ్రలో లభిస్తున్న శాసనాల్ని పరిశీలించారు. కళింగ దేశమంటే అశోకుడి జీవితంతో, బౌద్ధ చారిత్రక ప్రదేశాలతో ముడిపడి ఉన్న ప్రాంతం. ఆయన 'జాబులు - జవాబులు' గ్రంథంలో బౌద్ధ చారిత్రక ప్రదేశాలకు, శిల్పాలకు సంబంధించి అక్కడక్కడ కొన్ని అభిప్రాయాలు కనిపిస్తాయి. 1902లో రాసుకున్న దినచర్యలో బర్గెస్ 'అమరోటి, జగ్గయ్యపేట' గ్రంథాన్ని గురజాడ ప్రస్తావించారు. బెంగాలీ బౌద్ధ పండితుడు, పాలీ భాషావేత్త, పండిట్ హరిప్రసాద్ శాస్త్రితో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. హరిప్రసాద్‌శాస్త్రి కలకత్తాలోని పాలీటెక్ట్స్ సొసైటీకి చెందినవారు. ఆయన నేపాలులోని బౌద్ధ సాహిత్యాన్ని రాజేంద్రలాల్ మిత్రతో కలిసి పరిశోధన చేసి ప్రపంచానికందించారు.

గురజాడ స్వయంగా చరిత్ర విద్యార్థి కావడం, కళింగ దేశ చరిత్రను శ్రద్ధగా అధ్యయనం చేయడం వల్లనే ఆయన సరిగ్గా వంద సం?ల క్రితం (21 మే, 1909) తన ప్రియ శిష్యుడైన ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం పంతులుకు రాసిన లేఖలో 'బౌద్ధం అణగదొక్కబడినప్పుడు, భారతదేశం మతపరంగా ఆత్మహత్య చేసుకొంది' అని సంచలనాత్మకమైన అభిప్రాయం వెల్లడించారు. ఒక చారిత్రక పరిశోధకుడిగా ఆయన తన శిష్యుడికి రాసిన లేఖలో వ్యక్తీకరించిన అభిప్రాయం చాలా విలువైనది. బౌద్ధాన్ని అణగదొక్కబడినప్పుడు భారతదేశం మత రీత్యా ఆత్మహత్య చేసుకుంది అనే అభిప్రాయాన్ని ఒక అభ్యుదయకవి ఏదో ఒక ఆవేశపూరిత సమయంలో ప్రకటించిన అభిప్రాయంగా తీసిపారేయడానికి వీలులేదు. గురజాడ కేవలం కవి మాత్రమే కాదు. విశిష్టమైన చారిత్రక దృక్పథం గల గొప్ప ఆధునిక చింతనాపరుడు. ఆయన సమగ్ర మూర్తిమత్వాన్ని గ్రహించాలంటే ఆయనకు ఎంతటి మహనీయ చారిత్రక దృక్పథం ఉందో తెలుసుకోవాలంటే ప్రచురించబడిన ఆయన రచనలకంటే 'ఆయన డైరీలు, నోటు పుస్తకాలు, లేఖలూ ఎక్కువ ఉపయోగం' అంటారు గురజాడ జీవిత చరిత్రకారుడు కీ.శే. వి.ఆర్.నార్ల (నార్ల వెంకటేశ్వరరావు). తెలుగు సాహిత్యంలో ఆధునికతకు ఆద్యుడు మహాకవి గురజాడ. మానవ జీవితంలో భాషకు, సాహిత్యానికి ఉన్న స్థానాన్ని ఆయన గుర్తించినట్లు

తెలుగు సాహిత్యంలో మరొకరు గుర్తించలేదు. కన్యాశుల్కం తొలికూర్పుకు రాసిన ఆంగ్ల పీఠికలో 'తెలుగు సాహిత్య భాషను నాగరికతా వ్యాప్తికి ఒక ఈ వాక్యంలో గొప్ప సాధనం చేయాలంటే' ఏమి చేయాలో ఆయన స్పష్టంగా గుర్తించాడు. అంతకంటే ముఖ్యమైన విషయం – 'సాహిత్యాన్ని (భాషను) ఒక గొప్ప నాగరికతా ప్రదాత" (A great civilizing medium) అని అభివర్ణించడం. సాహిత్యంతోపాటు సకల కళల్ని వ్యాపార సాధనాలుగా మార్చుకొంటున్న ఈ కాలంలో నాగరికత స్థానంలో అనాగరికతకు పట్టం కడుతున్నారు. భాషా, సాహిత్యాలు ఆధిపత్యవాదుల అనాగరిక చర్యల్ని కాపాడుకోవడానికి గొప్ప సాధనాలుగా రూపం దాయేమోననిపిస్తుంది ! గురజాడ ఆధునిక సాహిత్యంలోని వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆయన సాహిత్య రచన రాసిలో కొంచమే అయినా అది కళాత్మకమైనదే కాదు భావాలరీత్యా విప్లవాత్మకమైంది. దాని ప్రభావం అసాధారణమైనది. అందువల్లనే వంద సంవత్సరాల క్రితం ఆయన రాసిన లేఖను గూర్చి ఇప్పుడు ఆలోచిస్తున్నాం. నాటక రచయితగా, కథానికా రచయితగా, వ్యాస రచయితగా, కవిగా గురజాడ ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో తన స్థానమేమిటో నిరూపించుకున్నారు. లేఖా రచయితగా ఆయన అంత ప్రసిద్ధి చెందలేదు. సాహిత్య ప్రక్రియల్లో లేఖా ప్రక్రియ విస్మరించదగింది కాదు. అదొక గొప్ప సాహితీ ప్రక్రియ. తెలుగు రచయితలలో గురజాడ నుండి సంజీవదేవ్ వరకు లేఖా సాహిత్యం సృష్టించిన వారే. నిజానికి ఒక రచయిత సమగ్ర మూర్తిమత్వం తెలియాలంటే ఆయన రాసిన లేఖలు ఎంతో విలువైన సమాచారాన్నందిస్తాయి. ప్రచురణ పొంది మనకు అందుబాటులోకి వచ్చిన లేఖలు "జాబులు – జవాబులు" పేరుతో గురజాడ రచనగా వెలువడింది. ఇందులో 1909 – 1914 సం?ల మధ్య గురజాడకు ఆయన సాహితీ మిత్రులకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలే ఉన్నాయి. అసంఖ్యాకమైన ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలలో మనకు మిగిలింది అణుమాత్రం" అంటారు నార్ల వెంకటేశ్వరరావు (వి.ఆర్. నార్ల). మనకు లభించిన అతి తక్కువ లేఖల్లో తన శిష్యుడు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం పంతులుకు రాసిన లేఖలు పది ఉన్నాయి. అవి 1909 – 1911 మధ్యకాలంలో రాసినవి. ఈ లేఖలు గురజాడ సాహితీ దృక్పథాన్ని, ఆయన మహనీయ, మానవీయ మూర్తిమత్వాన్ని దర్శించటానికి తోడ్పడతాయి. గురజాడ కాలక్రమణికలో 1909 మే నెలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కన్యాశుల్కం రెండవ కూర్పు ప్రచురణ జరిగింది 1909, గురజాడ మాటల్లోనే చెప్పాలంటే కన్యాశుల్కం రెండవ కూర్పు 'ప్రస్తుత రూపంలో అది దాదాపు కొత్త రచనే' అంటే 1897–1909 సం॥ల మధ్య కాలంలో గురజాడ సాహితీ దృక్పథంలో, తాత్విక దృష్టిలో ఎంతో పరిణతి కనిపిస్తుంది. చాలామంది ఆధునిక రచయితల్లో వయస్సు పెరిగే కొద్దీ వివేచనా శక్తి పెరిగి, మానవత తగ్గుతోంది. గురజాడలో ఈ రెండు అంశాలు సమపాళ్ళలో పెరుగుతూ వచ్చాయని మధురవాణి పాత్ర చిత్రణలో ఆయన తీసుకున్న శ్రద్ధ ద్వారా వ్యక్తమవుతుంది. కన్యాశుల్కం రెండవ కూర్పులో ఆయన చేసిన మార్పులు, చేర్పులు గూర్చి ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం పంతులుకు రాసిన పైలేఖ లోనే గురజాడ చర్చించాడు. అందువల్లనే గురజాడ జీవిత చరిత్రకారుల్లో ప్రముఖులైన కె.వి. రమణరెడ్డి, 10 వి.ఆర్. నార్ల (నార్ల వెంకటేశ్వరరావు)" లు మే 21, 1909 సం॥లో ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంకు రాసిన ఈ లేఖకు చాలా ప్రాముఖ్యం ఇచ్చారు. గురజాడ ఆధునికత (Modernity)పై జరిగే దాడికి ఈ లేఖ ధీటైన సమాధానం. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీల గూర్చి ఒక ఫెమినిస్టు (స్త్రీవాద రచయిత కూడా రాయలేని విధంగా ఆధునిక స్త్రీ మానవ చరిత్రను తిరగరాస్తుందన్నాడు ఆయన. తెలుగు సాహిత్యంలో స్త్రీ, పురుష సమానత్వాన్ని గూర్చి ఇంత తాత్విక పరిణతితో గురజాడలా రాసిన మరో రచయిత కనపడదు. అదే ఆయన విశిష్టత. అందుకేనేమో "గురజాడ మనస్తత్వంలోని విపరీత ధోరణి" గూర్చి వ్యాఖ్యానిస్తూ ప్రముఖ మార్క్సిస్టు సాహితీ విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) ఇలా అన్నారు : "1969లో తెలుగు దేశాన్నీ, తెలుగు సాహిత్యాన్నీ, తెలుగు మనిషి సగటు సంస్కారస్థాయినీ కలయజూస్తే, గురజాడ భావాలలో అధిక భాగంఇరవయ్యొకటో శతాబ్దివేమో అనిపిస్తుంది. 1969లోనే కాదు 2009లో కూడా తెలుగువాడి "సగటు సంస్కార స్థాయి" అలాగే తగలడింది. అందువల్లనే గురజాడ అవసరం నేటికీ ఉంది. గురజాడ మరణ వార్త తెలుసుకొని మార్క్ హంటర్ రాసిన ఈ మాటలు – "ఆయన (గురజాడ) అడుగుజాడ అనుసరించటం నింపాదిగా జరుగుతుంది". చారిత్రాత్మక గురజాడ లేఖగా పేర్కొంటున్న 1909 నాటి లేఖలోని విశేషాలేమిటో ఒకసారి చూద్దాం. కన్యాశుల్కం రెండవ కూర్పు సమయంలో ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం పంతులుకు ఈ లేఖ గురజాడ రాశారు. ఈ నాటకంలోని స్త్రీ పాత్రలైన మీనాక్షి, మధురవాణిల పాత్ర చిత్రణలపై గురు, శిష్యుల మధ్య ప్రధాన చర్చ. ఈ చర్చలో భాగంగా సమాజం పట్ల, చరిత్ర పట్ల ఆయనకున్న ప్రత్యేకాభిప్రాయాల్ని ప్రకటిస్తాడు. అవి":

1. నేను జీవితాన్ని చిత్రిస్తాను. కళ నాకు అధికారి అయినప్పటికి, సమాజం పట్ల నాకు ఒక కర్తవ్యం ఉంది.

2. జీవితాన్ని అల్ప విషయంగా తీసుకోను. ఒక వేశ్యలో మానవత్వం ఉంటుందన్న సంగతి మర్చిపోవద్దు.

3. గడచిన రెండు శతాబ్దాలలో మానవ జాతి జ్ఞానం చాలా వృద్ధి చెందింది. పాత భావాల్ని, ఆదర్శాల్ని యోచనాపరులు పరిశీలించటం మొదలుపెట్టారు.

4. ఆధునిక మహిళ మానవ చరిత్రను తిరగ రాస్తుంది.

5. ఆదర్శ పూరితం చెయ్యడానికి అర్హత ఉన్న నిజమైన ప్రేమ మానవుల పట్ల ప్రేమ (ఏసుక్రీస్తు, షెల్లీ ఉపదేశించిన ప్రేమ).

6. సజీవమైన విశ్వాసంగా బుద్ధుడు ఉపదేశించినది నిజమైన ప్రేమ, మానవుని పట్ల ప్రేమ.

7. బౌద్ధం అణగదొక్కబడినప్పుడు భారతదేశం మతపరంగా ఆత్మహత్య చేసుకొంది. ఈ లేఖలోని ఈ ఏడు విశిష్టాంశాలు గురజాడ సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వీటితోబాటు ప్రాచీన భారతదేశ చరిత్రలో బౌద్ధం స్థానాన్ని ఎంతగొప్పగా అర్థం చేసుకొన్నారో స్పష్టమవుతుంది. ఆయన ప్రాచీన, ఆధునిక ప్రాచ్య, పాశ్చాత్య దేశాల చరిత్రను ఎంత లోతుగా అధ్యయనం చేశాడో ఈ ఒక్క లేఖను చదివితేనే విశదమవుతుంది. ఆనాటి తెలుగు రచయితల్లో గురజాడకున్నంత గ్రంథ పరిచయం ఇంకెవరికీ లేదంటాడు నార్ల వెంకటేశ్వరరావు. అంత విస్తృతమైన గ్రంథ పఠనం, గాఢమైన తాత్విక దృక్పథం, సమాజం పట్ల బాధ్యతకలవాడు కనుకనే గురజాడ ఇటువంటి లేఖ రాయగలిగాడు. ఈ లేఖను ఆయన 'మానవ ప్రణాళిక' (Humanist Manifesto)గా మనం భావించవచ్చు. ఆధునికతను వలసవాద పరిధిలోని సంకుచిత భావనగా కాకుండా మానవజాతి పరిణామక్రమంలో ఏర్పడిన విశాల మానవ భావనగా అర్థం చేసుకున్నప్పుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి భావించినట్లు నిస్సందేహంగా గురజాడను ఆధునిక ఆంధ్ర సాహిత్య పితామహుడి"గా భావించవచ్చు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలోని "ఒక మహనీయ వ్యక్తి మహనీయ దృక్పథాని"కి ప్రతిబింబంగా 1909 నాటి గురజాడ లేఖను పరిగణించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఈ లేఖలోని చివరి భాగాన్ని గూర్చి ప్రఖ్యాత మానవవాద చింతకులు నార్ల వెంకటేశ్వరరావు వ్యక్తీకరించిన అభిప్రాయం గురజాడ ఆలోచనలు ఎంత ప్రామాణికమైనవో, ఉన్నతమైనవో నిరూపిస్తుంది: "గురజాడ ఉత్తరం దాని చివరి పేరాగ్రాపులో మహత్తరమైన శిఖరాలకు చేరుకుందని చెప్పవచ్చు""6. ఒక ఆధునిక ఆలోచనా శీలిగా, ఒక చారిత్రక పరిశోధకుడిగా ఉత్తరాంధ్రలోని అనేక బౌద్ధ క్షేత్రాలను దర్శించి, బౌద్ధ సాహిత్యాన్ని పఠించి ఎంతో లోతైన అవగాహనతో గురజాడ బౌద్ధాన్ని అణచివేయడం వలన కలిగిన దుష్ఫలితాన్ని గూర్చి ఇంత కంఠోక్తిగా ప్రకటించాడు. కాని ఆయన రాయాలనుకున్న కళింగదేశ చరిత్రను పూర్తి చేసినట్లయితే ఆంధ్రరాష్ట్రంలో ముఖ్యంగా కళింగాంధ్రలో ప్రాచీన కాలంలో బౌద్ధం ఎలా వర్ధిల్లిందో మనకు తెలిసేది. ఈ దేశంలో బౌద్ధం పతనమయిందా, అణగదొక్క బడిందా అనేది నేటికీ పరిష్కారం కాని సమస్యగానే మిగిలింది. భారతదేశంలో బౌద్ధ పతనమేది చాలా ముఖ్యమైన విషయం. ఇది ఇంకా పరిష్కరించబడని సమస్యగానే మిగిలిందంటాడు మార్క్సిస్టు దార్శనికుడు దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ". కాని మనదేశంలో ప్రగతిశీల దృక్పథంగల చరిత్రకారులు, ఛాందస వాదులైన చరిత్రకారులు – రెండు భిన్న దృక్పథాల వాళ్ళలో అత్యధికులు బౌద్ధం అణచి వేయబడలేదు. పతనమైందంటున్నారు. మరి సరిగ్గా వంద సం॥ల క్రితం గురజాడ నిశిత పరిశీలనతో ఈ దేశంలో బౌద్ధం అణగదొక్కబడిందని స్పష్టంగా ప్రకటించాడు. ఏనాడయితే బౌద్ధం భారతదేశంలో రూపుమాపబడిందో అప్పుడే భారతదేశం మతరీత్యా ఆత్మహత్య చేసుకున్నది అని గురజాడ వ్యక్తీకరించిన అభిప్రాయం చరిత్ర పరిశోధకులు విస్మరించదగినది కాదు. కళింగ దేశ చరిత్ర ప్రచురించబడినట్లయితే గురజాడకు చరిత్రకారుడిగా కూడా పేరు వచ్చి ఉండేదంటాడు నార్ల వెంకటేశ్వరరావు. విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలివారి గ్రాంథిక భాషా ఛాదస్తం వల్ల ఒక అపురూప చరిత్ర గ్రంథం వెలుగులోకి రాకుండాపోయింది. ఈ గ్రంథ రచన కోసం గురజాడ దేశ, విదేశాల నుండి ఎంతో సమాచారం సేకరించారు. విస్తృత అధ్యయనం చేశాడు. భాషను ఒక గొప్ప నాగరికతా ప్రదాతగా భావించిన ఆయన అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాషలో గ్రంథ రచన చేయడానికి సంకల్పించటమే ప్రచురణ కర్తల నుండి తిరస్కారాన్ని ఎదుర్కొన్నారు. కాబట్టి చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ లేఖలో బౌద్ధంపై ఆయన ప్రకటించిన అభిప్రాయం బౌద్ధ సాహిత్యాభిమానులకే కాదు చరిత్ర పరిశోధకులకు ఆలోచనాత్మక విషయం. పరిశీలనాంశం. బౌద్ధాన్ని భారతదేశం నుండి తుడిచిపెట్టడం వల్ల కలిగిన దుష్పరిణామాన్ని గురజాడ ఎలాగయితే గుర్తించాడో, అలాగే మరో గొప్ప మానవ వాద చింతనాపరుడు ఎం.ఎన్.రాయ్ కూడా గుర్తించడం జరిగింది. భారతదేశం నుండి బౌద్ధ ధర్మ అంతర్ధానం అనే విషయం కేవలం చరిత్రకారులకే పరిమితమైన గత చారిత్రకాంశం మాత్రం కాదు. ఈ విషయానికి సమకాలికమైన ప్రాధాన్యం, ప్రాసంగికతా ఉన్నాయి. ఎం.ఎన్. రాయ్ "సైంటిఫిక్ పాలిటిక్స్" (శాస్త్రీయ రాజకీయాలు) అనే గ్రంథంలో "బౌద్ధ విప్లవం" (Buddhist Revolution) గూర్చి అరుదైన అసాధారణ విశ్లేషణ చేసి ఆ విప్లవ విజయం, ఓటమి నుండి గుణపాఠాలు నేర్చుకొని ప్రేరణ పొందాలంటాడు. భారత దేశంలో విప్లవాలే అరుదని (The infrequency of revolutions in Indian History) కాని భారతదేశ చరిత్రలోనే అతి గొప్పదైన ఒక విప్లవాన్ని చూశామని అది బౌద్ధ విప్లవమంటాడు ఆయన. బౌద్ధావిర్భావాన్ని విప్లవంగా చిత్రించటం చాలా మందికి ఆశ్చర్యం కలిగించే విషయం అని కూడా ఆయన అంటాడు. బౌద్ధం ఒక మతోద్యమం. దానికీ విప్లవానికి సంబంధమేమిటంటూ, ప్రాచీన కాలంలోని విప్లవాలన్నీ మతోద్యమాలేనని విశ్లేషించాడు. కాబట్టి బౌద్ధం ఒక విప్లవమం

టాడు. విప్లవం అనే పదాన్ని సంకుచితార్థంలో పూర్తిగా రాజకీయ వ్యవహారంగా భావించరాదంటాడు. దాన్ని విస్తృతార్థంలో తీసుకున్నప్పుడు, కొన్ని యుగాల్లో మతం విప్లవానికి ఒక సాధన మైందంటాడు ఎంఎన్ రాయ్. కాబట్టి ఆ యుగాల్లోని విప్లవం ఎక్కువగా మతోద్యమమే. అటువంటి ఉద్యమం – విశ్వాసాల్లో, భావాల్లో, ఆలోచనా సరళిలో, వ్యవస్థల్లో మార్పు తీసుకొస్తుందంటాడు. అటువంటి ఉద్యమమే బౌద్ధం. అటువంటి గొప్ప విప్లవాన్ని ఓడించి మన పూర్వీకులు తీవ్రమైన తప్పు చేశారు. ఎం.ఎన్. రాయ్ బౌద్ధ విప్లవాన్ని అణగదొక్కటాన్ని కేవలం తప్పుగానే భావించలేదు. ఆ దుశ్చర్యను "మన పూర్వీకులు చేసిన పెద్ద పాపం" (Monumental sin of our forefathers)గా ఆయన భావించారు. అంతేకాదు మన పూర్వీకులు బౌద్ధాన్ని నాశనం చేసిన నేరానికి ప్రాయశ్చిత్తంగా వేయి సంవత్సరాలకు పైగా బాధల్ని, అవమానాల్ని భారతీ యులు అనుభవిస్తున్నారని ఎం.ఎన్.రాయ్ అభిప్రాయపడ్డాడు! భారతదేశం నుండి బౌద్ధాన్ని రూపుమాపటాన్ని గురజాడ 1909లో తన లేఖలో "భారతదేశం మతరీత్యా ఆత్మహత్య చేసుకుంది" (India Committed religious suicide) అని అభిప్రాయపడినా ఎం.ఎన్.రాయ్ "మన పూర్వీకులు పెద్ద పాపం" (Monumental sin of our forefathers) అని భావించినా సారాంశంలో ఇద్దరి అభిప్రాయాల్లో పూర్తి ఏకీభావం ఉంది. 1909 నాటి గురజాడ మాటలు భావి కాలజ్ఞతలా రాయ్ ఆలోచనా స్రవంతిలో ప్రతిధ్వనించాయి. గురజాడ జీవిత, సాహిత్యాలపై "విజ్ఞాన సర్వస్వం" లాంటి గ్రంథాన్ని రచించిన సాహితీ విమర్శకుడు కె.వి.రమణారెడ్డి 1969లోనే గురజాడ జీవితంలో అంతగా ప్రాచుర్యం పొందని ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టాడు. గురజాడకు వైదిక మతంకంటే బౌద్ధమే బాగా నచ్చిందని, ఆయన తన అధ్యయన గదిలోని బుద్ధుని ప్రతిమకు ప్రతిరోజు ఉదయాన్నే ఒక పువ్వును సమర్పించే వాడని తెలిపాడు. బౌద్ధంలో ఆయనకు నచ్చిన అంశం కారుణ్య దృష్టి. సామాన్య ప్రజలు కూడా అనుసరించదగు ధర్మాన్ని బోధించిన బుద్ధుడు "మతప్రవక్త"గా కన్నా "సంఘ సంస్కర్త"గా కనిపించి ఉంటాడు. గురజాడను థేరవాదంకంటే మానవ సేవాపరమైన మహాయానం" ఆకర్షించి ఉంటుందంటాడు. ఏది ఏమైనా 1909 మే 21 నాటి లేఖలో గురజాడ ప్రకటించిన ఇతర భావాలు బౌద్ధానికి విరుద్ధమైనవి కావు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ కూడా కళింగదేశ చరిత్రకు కావాల్సిన సమాచారాన్ని సేకరించి, ఎంతో విలువైన పరిశోధన చేసిన గురజాడ భాషా వివాదం కారణంగా ఆ చరిత్ర రచనను విరమించుకున్నాడు. ఆ గ్రంథ రచన పూర్తయినట్లయితే గురజాడ జీవితంలోనే కాదు ఆంధ్ర జాతి జీవితంలోనే బౌద్ధం ఎంతటి విప్లవాత్మక మార్పులకు దోహదం చేసిందో తెలిసేది. **(చారిత్రాత్మక గురజాడ లేఖకు వందేళ్లు.. 2012లో రాసిన వ్యాసం)** ❑

## ఈ యుద్ధం సనాతన ధర్మమంత ప్రాచీనం!

**(22వ పేజీ తరువాయి)**

వేసింది. పెరియార్ వారసత్వం డీఎంకే అధినేత కరుణానిధి, ఆ తరువాత అతని కుమారుడు ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, అతని కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ఇలా నాలుగు తరాలుగా కొనసాగుతూ వచ్చింది. సనాతన ధర్మం మీద పోరాటం అంటే వర్ణధర్మం మీద పోరాటం. అంటే మనుస్మృతి ప్రకారం ఈ దేశంలో ఏ కుల వ్యవస్థ అయితే అసమానతల పునాదుల మీద ఏర్పడిందో దాని మీద పోరాటం. కొన్ని వర్గాలకు ఆధిపత్య స్థానం, కొన్ని వర్గాలకు బానిసత్వ స్థానం నిర్దేశించినది వర్ణధర్మ వ్యవస్థ. దీన్ని శాసనబద్ధం చేసింది మనుస్మృతి. దీని వెనుక ఉన్నదే సనాతన ధర్మం. ఈ మనుస్మృతినే తగలబెట్టమన్నాడు అంబేద్కర్.

ఈ మనుస్మృతి వెనుకనున్న సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడం అంటే బ్రాహ్మణాది అగ్రవర్ణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించి సమాజంలో సమస్త వర్ణాల సమగ్ర అభివృద్ధిని కాంక్షించడం. ఇది తమిళనాడులో పెరియారు వారసులుగా చెప్పుకుంటున్న వారి వాదనే కాదు. పూలే అంబేద్కర్ పెరియార్ వారసులందరి వాదన. ఈ వారసత్వం కొనసాగింపే ఉదయనిధి స్టాలిన్. అయితే ఇప్పుడిప్పుడే ఒక్కటవుతున్న ప్రతిపక్షాలు ఎక్కడ దొరుకుతాయా నొక్కి పారేయాలని తహతహలాడుతున్న బీజేపీ, దాని వెనుక ఉన్న ఇతర హిందుత్వ శక్తులకు ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్య గొప్ప అస్త్రమైంది. దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సనాతన ధర్మాన్ని తుడిచివేయాలని, భారతీయుల సాంస్కృతిక పరంపరను నాశనం చేయాలని ఆలోచిస్తున్న శక్తులన్నీ కలిసి ఇప్పుడు ప్రతిపక్ష కూటమిగా ఏర్పడ్డాయని, హోంమంత్రి అమిత్ షా నుంచి అనేకమంది బీజేపీ నాయకులు మూకుమ్మడి దాడి మొదలుపెట్టారు. హిందూ ధర్మాన్ని అంటిపెట్టుకుని ఉన్నవారే ప్రతిపక్షాల్లో 90 శాతం నాయకులున్నారు. వారంతా హిందూమతం నిర్మూలనకు దిగారంటే పిల్లలు నవ్వుతారు. దీన్నే పట్టుకొని బీజేపీ వారు ఊరేగితే అది కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్న సామెతకు పరమోదాహరణగా మిగిలిపోవచ్చు. కానీ ఇదొక సాంస్కృతిక తాత్విక పోరాటం. ఎన్నికలలో తాత్కాలిక విజయాలతో ఈ పోరాటం అంతం కాదు. ఏవేవో స్వార్థాలతో, ఏవేవో కోరికలతో చేతులు కలిపి సింహాసనం ఎక్కినా ఆ కలయికలు ఎంతో కాలం నిలవవు. ఏలుబడిలో ఉన్న ఆధిపత్య విధ్వంస భావజాలానికి విరుగుడుగా కోటిరంగుల ఇంద్ర ధనుస్సుల కూటమి కావాలి. ఈ దేశంలో ప్రత్యామ్నాయ సంస్కృతిని గెలిపించుకున్నప్పుడే నిజమైన విజయం. ఇది ఒక్క ఉదయనిధితో సాధ్యం కాదు, కోట్లాది జ్ఞాననిధులు ఉదయించాలి. ❑

**(ఆంధ్రజ్యోతి దినపత్రిక నుండి సేకరణ)**


# అక్షరమా నీకు వందనం

- పుస్తక పరిచయం



- వి.విజయకుమార్

బంగారు వి.బి.ఆచార్యులు గారు సాహితీ రంగంలో అక్షరమే ఆయుధంగా చేసుకొని అప్రతిహతంగా దూసుకుపోతున్నారు. యే నశ్వరమవ్వని అక్షరమైతే మనిషిని జంతువు నుంచి విడదీసిందో అది శ్రమ ఫలితమేనని ముందుగా దానికి ప్రణమిల్లి, అపార సంపదలు కొద్దిమంది కుబేరుల కోసం, నిరంతరం శ్రమించే దగా పడే శ్రమజీవుల వృథా శ్రమల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, శ్రమకు తగ్గ ఫలం లభించే నూతన సమాజం కోసం, ప్రజా సమూహాల్లో చైతన్యం కోసం, కలమే ఆయుధంగా, సమాజం పట్ల బాధ్యత నెరిగిన వ్యక్తిగా, నిష్ఠగా తన పని తాను చేసుకుపోతున్నారు ఆచార్యులు గారు.




భావుకతతోపాటూ బాధ్యతా, ఏదైనా రాసినా, చేసినా, చెప్పినా వైయక్తిక లబ్ది కంటే సామాజిక ప్రయోజనం కోసం ఆలోచించడమన్నది రచయిత గా నిలబడేవారికి అవస్యం. అదే సమయంలో, అది యే సమాజం కోసం రాస్తున్నాం అన్నదానిపై స్పష్టత లేకపోతే, అది మనం ఎవరి చైతన్యం కోసం రాశామో వారికి ఉపయోగపడకపోగా, వేరేవారికి లబ్ది చేకూర్చే ప్రమాదం వుంది. అందుకే వర్గ స్పృహ రచయితకు చాలా ముఖ్యం. కీర్తులూ, భుజకీర్తులూ, సన్మానాలూ, శాలువా లూ వరించే, భరించేవారికి ఒకోసారి ఈ వర్గ స్పృహ లోపించినా నష్టం లేదు గానీ, కష్టజీవికి అటూ ఇటూ నిలబడతానని చెప్పుకునే వారికి ఇది చాలా ముఖ్యం. ప్రతిభావంతులకు శిల్పమూ, శైలీ అదనపు సొబగులు అయితే కావచ్చు కానీ, అసలా విషయం సమాజంవైపే కన్నెత్తి చూడనప్పుడు, చూసినా కూడా అది శ్రమ దోపిడీలు చేసే వర్గానికి వూతమిస్తున్నప్పుడు, అదెంత సౌందర్యవంతమైన కవిత్వమైనా, దుశ్శాలువాలకో, సన్మానాలకో, పీఠాలకో, పద్మాలకో అర్హమైతే అవ్వొచ్చు కానీ ఒక దుష్ట సమాజపు పతనానికి పోరాడే ఆయుధమైతే కాజాలదు.



బీవీబీ ఆచార్యులు

ఈ స్పృహతో రాసే కవిత్వాన్ని ఎంచుకున్నారు ఆచార్యులు గారు. మానవజాతికి పట్టిన యుద్ధ జాఢ్యాన్ని ఏకిపారేశారు. భూబకాసురుల్ని తవ్వి పాతరేశారు. కార్పొరేట్ రంగాల్ని చీల్చి చెండాడేశారు. బూటకపు ప్రజాస్వామ్య ఎన్నికల తంతుల్ని అపహాస్యం చేశారు. లఘువులై పోతున్న బేకారు గురువుల్ని పరిహసించారు, కుల మతాల పిండాకూడు కోసం కాకుల్లా కొట్లాడుకునే పిదప బుద్ధుల ప్రబుద్ధుల్ని ఎండగట్టారు. పల్లె పట్నమై పోయిన అర్థాకలి జీవితపు వేదనల్ని కన్నీటి చెలమతో కడిగిపోశారు.


జీవం కోల్పోయి బావురుమంటున్న పల్లె తల్లి గుండెల్లో బాకుల్లా దిగిన తుమ్మ ముళ్ళ గాయాలకు ఆశల మలాములు పూశారు. ఒక బాధ్యత కలిగిన కవిగా, సమాజంపట్ల ఆపేక్షతో, అణగారిన, మసిబారిన బతుకుల్లో ఇసుమంతైనా చైతన్యం రగిలించాలనే తపనతో ఆచార్యులు గారు చేసిన ఈ ప్రయత్నాన్ని స్వాగతిస్తూ, వారింకా మరింత స్పృహతో, మరింత చైతన్యవంతమైన రచనలు చేయాలని ఆశిస్తూ, నాకీ అవకాశం ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతా వందనాలు తెలియజేసుకుంటున్నాను. ❑


# ఎప్పటికీ అందరికీ సంజీవదేవ్

- పుస్తక పరిచయం

- జంపాల శ్రీమన్నారాయణ

కనిపించేది నాగరికత, అంతర్గతంగా ఉండేది సంస్కృతి అంటారు సంజీవదేవ్. ఇవి రెండూ కలగలసిన ఉత్తమ మానవుడు సంజీవదేవ్. వ్యక్తిగత జీవితంలోనూ, ఆచరణలోనూ వీటిని ఉన్నత మార్గంలోనూ అనుసరించిన ఆదర్శమూర్తి సంజీవ దేవ్. ప్రకృతి పరిశీలనలోనూ, మానవ సమాజాల అధ్యయనం లోనూ, ఆ సమాజాలు సృష్టించిన కళల సృజనలోనూ మమేకమై తాను అనుభవించిన హృదయానుభూతులను, నేత్రానందం కల్గించిన వాటిని సజీవ అక్షర చిత్రాలుగా వర్ణించి రస రమ్య వాక్యాలతో అద్భుత సాహిత్య సంపదను తెలుగు వారికి అందించారు సంజీవదేవ్. అదే విధంగా సుప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో ముఖాముఖ సంభాషణలు, వారు పొందిన అతిథి మర్యాదలు, సాంగత్యం ఆయా రంగాల్లో వారెలా సమాజ వికాసాలు కలిగించారో తెలుగు భాషలోని మాధుర్యాన్నంతటిని తన అవిశ్రాంత రచనల ద్వారా మనకు రుచి చూపించిన వారు సంజీవదేవ్. మా సమీప బంధువు బొల్లు లలితానందప్రసాద్ గారు సాహిత్య సృజనలో ఉన్న సంగతి, ఆయన చేసిన కొన్నిరచనలు, పలుసార్లు, ముఖాముఖీ సంభాషణలు మున్నగునవి నా అనుభవంలో ఎన్నో. అయితే మూడు నెలల క్రితం సంజీవదేవ్ గారిపై ఆయన శతజయంతి సందర్భంగా పలుపత్రికల్లో తను రాసిన వ్యాసాలను చూపించితే నేను చదివాను. వీటిని పుస్తక రూపంలో మరికొందరు రాసిన వ్యాసాలను కూడకలిపి తీసుకు రానున్నట్లు చెప్పారు. పుస్తక ఆవిష్కరణ సభలో పాల్గొన్నాను. ఆ సభ సంజీవదేవ్ గారి 'రస రేఖ' నిలయంగా వారి స్వగ్రామం తుమ్మపూడి వేదిక కావటం సంతోషం కల్గించింది. సంజీవదేవ్ గారి కుమారుడు మహేంద్ర దేవ్ గారు ఒక ఆర్థిక శాస్త్రవేత్త. రెండు దశాబ్దాలకుపైగా పత్రిక లలో వ్యాసాలు రాస్తున్నారు వారి తండ్రిగారిపై ప్రచురించిన 'ఎప్పటికీ అందరికీ' పుస్తకాన్ని ఆవిష్కరణ చేయటం అదీ సంజీవదేవ్ గారి 25వ వర్ధంతి రోజు ప్రముఖ సాహితీ వేత్తల సమక్షంలో జరపటం ద్వారా లలితానంద ప్రసాద్ గారి సహృదయతకు సంజీవదేవ్ గారిపై వారికున్న అభిమానానికి నిదర్శనం. ఇక లలితానంద్ గారు రాసిన ఏడు వ్యాసాలు, ఒక కవితల ద్వారా సంజీవదేవ్ గారి సమగ్ర రచనలన్నింటినీ తను చదివి జీర్ణించుకొని తనలాగే తెలుగు పాఠకలోకమంతా 'తమ బుద్ధులంతా జోతిర్మయం కావాలనీ, హృదయం రసమయం






కావాలని, చేతలు చైతన్యమయం పొందాలని, అనుభూతులు ఆనందమయం చెందాలని, మనమంతా సమత్వమయం సాధించాలని మన జీవనశైలి సౌందర్యమయం కావాలని తాను వేటినైతే సంజీవదేవ్ గారి గురించి మధించి తెలుసుకున్నాడో ఆయన తన మాటలు ద్వారా మన మందరం నిత్య చైతన్య దీపులు కావాలన్నది ఈ రచయిత ఆకాంక్ష. సంజీవదేవ్ గారికి మనసులోనే నేను నివాళి అర్పించాను. లలితానంద్ గారికి అభినందనలు. మా అన్నగారి కుమారుడు డాక్టర్ జంపాల చౌదరి గారు 'విశ్వమానవుడికి నివాళి' అర్పిస్తూ తనకు సంజీవదేవ్ రాసిన లేఖలో 'ఈ విశాల ప్రపంచంలో స్వదేశాలనీ, విదేశాలనీ వుండవు. పైన ఆకాశం, క్రింద భూమి వున్న దంతా మన స్వదేశమే, అందరూ స్వదేశీయులే' అన్న జాతీయ దృష్టి దాటి అంతర్జాతీయత, మానవత మేళవించిన సంజీవదేవ్ గారి గురించి చదవటం, తెలుసుకోవటం మన హృదయాలను విశాలమూ, నిర్మలమూ, నిరామయం చేసుకోవటం కూడా. ❑

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం-వాస్తవాలు - వక్రీకరణలు



- సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 11 సెప్టెంబర్ 1946 నుండి 21 అక్టోబర్ 1951 వరకు ఐదు సంవత్సరాల నెల రోజులపాటు సాగింది. సుశిక్షితులైన నిజాం సేనలకు, భారత సేనలకు, జమిందారీ ప్రయివేట్ సైన్యంతోపాటు రజాకార్ల సైన్యాలకు వ్యతిరేకంగా వ్యవసాయం చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు సాగించిన చారిత్రక పోరాటం. ఈ పోరాటానికి ప్రపంచ ఖ్యాతి లభించింది. పోరాట సందర్భంగా ఉనికిలో లేని పార్టీలు, నాయకులు నేడు ఈ పోరాటాన్ని వక్రీకరిస్తూ తమ పాత్రను అందులో జోడించుకుంటున్నారు. విముక్తి, విద్రోహం, విమోచన అంటూ వక్రీకరణలు చేస్తున్నారు. ముస్లింల నుండి హిందువులు విముక్తి పొందారని కొందరు, పోరాటాన్ని విరమించడం ద్వారా విద్రోహం జరిగిందని కొందరు, బంధనాల నుండి విమోచనం పొందామని కొందరు టన్నుల కొద్దీ వక్రీకరణలు చేస్తూ, ఆత్మానందం పొందు తున్నారు. వాస్తవ పోరాట వారసులను చిన్నచూపు చూస్తున్నారు.



## వాస్తవంగా జరిగిందేమిటి ?

230 సంవత్సరాల అసఫ్‌జాహిల పాలనలో నాటి తెలంగాణలోని ప్రజలు అనేక బాధలు పడ్డారు. హిందూ, ముస్లిం ప్రజలను హిందూ జమీందార్లు, ముస్లిం రాజులు, రజాకార్లు కలిసి ప్రజలపై భౌతిక దాడులు, ఆర్థిక దాడులు చేశారు. 10వ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ 1911లో అధికారానికి వచ్చి 1948 సెప్టెంబర్ 17న రైతాంగ సాయుధ పోరాటంతో పదవీచ్యుతుడైనాడు. ఈ నిజాం కాలంలోనే మరాఠాలతో జరిగిన యుద్ధంలో అంగ్లేయుల సహకారం పొందినందుకు వారికి మచిలీ పట్నం నుండి గుంటూరు వరకు గల ప్రాంతాన్ని ధారాదత్తం చేశాడు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని రాయలసీమ నాలుగు జిల్లాలను దత్త మండలాలుగా ఇచ్చివేశాడు. మిగిలిన 16 జిల్లాలతో నిజాం ప్రభుత్వం కొనసాగింది. ఇందులో 5 జిల్లాలు మహారాష్ట్రకు చెందినవి కాగా, 3 జిల్లాలు కర్నాటకకు చెందినవి. 5.30 కోట్ల ఎకరాలలో రైతులకు 3 కోట్ల ఎకరాలకు పట్టాలివ్వగా, 1.5 కోట్ల ఎకరాలు జమీందార్ల స్వాధీనంలో, 55 లక్షల ఎకరాలు నిజాం స్వంత ఆస్తి (సర్ఫెఖాస్)గా ఉన్నాయి. గ్రామాలలో విపరీతమైన వెట్టిచాకిరి కొనసాగింది. జమీందార్లకు తాము పండించిన పంటలతోపాటు గొర్రెలు, మేకలు, కోళ్ళు, తేనె ఉచితంగా ఇచ్చేవారు. చివరికి వారి ఆడపిల్లలను జమీందార్ల కుటుంబాలకు 'అడబాప'లుగా పంపించాలి. పండిన పంట మొత్తం అమ్ముకున్నప్పటికీ శిస్తులకు కావాల్సిన ఆదాయం వచ్చేది కాదు. జమీందారు భూములను, నిజాం భూములను మొదట సాగు చేసిన తరువాతనే రైతులు తమ భూములు సాగు చేసుకోవాలి. శిస్తు వసూళ్ళలో తీవ్ర నిర్బంధం, హింస కొనసాగేది. ఈ పరిస్థితులలో ప్రజలు అనేక గ్రామాలలో తిరుగుబాట్లు చేశారు.

## రష్యాలో కమ్యూనిస్టుల ప్రభుత్వం తెలంగాణపై ప్రభావం

1914లో రష్యాలో కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడింది. దాని ప్రభావం తెలంగాణ ప్రజలపై పడింది. 40 శాతం తెలుగు మాట్లాడేవాళ్ళు ఉన్నప్పటికీ ఉర్ధూ, మరాఠి

మాత్రమే మాట్లాడేవారు. చదువుకోవడానికి పాఠశాలలు లేవు. శిస్తులు చెల్లించనందుకు 'ఖారజ్‌ఖాత' పేరుతో భూములు ప్రభుత్వానికి ఇచ్చి కూలీలుగా పనిచేసే వారు. తెలుగు భాష విస్తరణ కోసం ఆంధ్ర జన సంఘం పేరుతో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన గ్రంథాలయ సంస్థను ఏర్పాటుచేశారు. వీటికి ఏటా కమిటీని ఎన్నుకునే వారు. వామపక్ష భావాలు కలిగిన రావి నారాయణరెడ్డి 11వ 'ఆంధ్ర జనసంఘం' వార్షికోత్సవ ఎన్నికలలో గెలి చారు. దీంతో మితవాదులు వేరే సంఘం పెట్టుకున్నారు. నారాయణరెడ్డి గెలిచిన తరువాత అనేక మంది సంఘంలో సభ్యులుగా చేరారు. అందులో ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, కమలాదేవి, బద్దం ఎల్లారెడ్డి సంఘంలో చేరి తమ భూములను పేదలకు పంచిపెట్టారు.

1934లో తెలంగాణ పక్కనే ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో చలసాని జగన్నాధరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మాకి నేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు నాయకత్వన కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. 1936 ఏప్రిల్ 11న అఖిల భారత కిసాన్‌సభ ఏర్పడి 'దున్నేవానికే భూమి' నినాదాన్ని ఇచ్చింది.

1939 డిసెంబర్ 13న తెలంగాణలో ముగ్దుం మొహియి ద్దీన్, అలంకుంద్ మీరి, ఇబ్రహిం, ముర్తుజా హైదర్, రాజ్ బహుదూర్ గౌర్ నాయకత్వన 'కామ్రేడ్స్ అసోసియేషన్' ఏర్పడింది. ఈ అసోసియేషన్ తరువాత అనేక భూ పోరా టాలు సాగాయి. అనేక గ్రామాల్లో 'సంఘం' ఏర్పడి పని చేసింది. ప్రభుత్వ భూములతోపాటు భూస్వాముల భూము లు ఆక్రమించిన ప్రజలలో ముఖ్యులు ఆరు పైసలు చెల్లించి సంఘ సభ్యత్వం పొందారు. ఈ సంఘానికి భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు కూడా నాయకత్వం వహించారు. 1941లో పెరవల్లి వెంకటరమణయ్య కార్యదర్శిగా, ఎ.గురవారెడ్డి, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు తెలంగాణ కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. కిసాన్‌సభతో పాటు, ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టులు ఉద్యమానికి భౌతికంగా, ఆర్థికంగా సహకరించారు. ఈ పోరాటాన్ని అణచడానికి ఔరంగాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఖాశీం రజ్వి నాయక త్వాన 60 వేల మంది కిరాయి సైనికులు, రజాకార్లు నిజాంకు తోడ్పాటు అందించారు.

## ఐలమ్మ తిరుగుబాటు దొడ్డి కొమరయ్య మరణం

జనగామ ప్రాంతంలోని పాలకుర్తిలో చాకలి ఐలమ్మ స్వంత భూమితోపాటు కౌలుకు భూమి తీసుకొని వరి పంట పండించింది. ఏపుగా పెరిగిన పంటను చూసిన జమీందారు విసునూరు రామచంద్రారెడ్డి పంటను ఎత్తుకెళ్ళడానికి గూండాలను పంపాడు. అప్పటికే ఆ గ్రామంలో ఉన్న భీంరెడ్డి నాయకత్వాన చల్ల ప్రతాపరెడ్డి, కె రాంచంద్రారెడ్డి, గంగుల సాయిరెడ్డి మరో 30 మంది కలిసి గూండాలను తరిమివేశారు. ధాన్యం తీసుకెళ్ళకుండా అడ్డగించారు. దీనిని ఉత్సాహంగా భావించిన ప్రజలు ఊరేగింపు చేశారు. విసునూరు గ్రామ పరిస రాలలోకి రాగానే జమీందారు గుండాలు ఊరేగింపుపై కాల్పులు జరిపారు. ముందుపీఠాన ఉన్న దొడ్డి కొమురయ్య నెలకొరిగా రు. ఈ మరణం పోరాటాన్ని ఉధృతంగా మలిచింది. ప్రజలు మరింత ఉద్రిక్తులై జమీందారు ఇంటిపై దాడి చేశారు. శవంతో ఊరేగింపు చేశారు. అప్పటి నుండి రెండు మాసాలపాటు 300 గ్రామాలలో జమీందార్లకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేశా రు. భూములు ఆక్రమించారు. నిజాం సైన్యాన్ని, రజాకార్లను, జమీందార్ల గుండాలను తరిమి తరిమి కొట్టారు. ప్రజల నిరసన తీవ్రతను గమనించి కమ్యూనిస్టు పార్టీ, 11 సెప్టెంబర్ 1946న 'సాయుధ పోరాటా'నికి పిలుపు నిచ్చింది. నాటినుండి పోరాటం మరింత ఉధృతమైంది. హిందూ, ముస్లిం, దళిత, గిరిజన, వెనక బడిన రైతులు కలిసి జమీందార్లకు, నిజాంకు వ్యతిరేకంగా వర్గ పోరాటం ప్రారంభించారు. పోరాటం ప్రారంభమైన 11 మాసా లకు భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం ప్రాంతానికి మాత్రం రాలేదు. స్వాతంత్ర్యం అనంతరం 13 మాసాలపాటు పోరాటం సాగుతూనే ఉంది. 1500 మంది మరణించారు. ఈ పోరాటాన్ని నిజాం అణచ లేదని భావించిన కేంద్రం 1948 సెప్టెంబర్ 13న సైన్యాలను పోరాట కేంద్రాలకు పంపింది. సైన్యాల రాకతో నిజాం భారత ప్రభుత్వానికి లొంగి పోయి నైజాంను భారతదేశంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటిం చాడు. సెప్టెంబర్ 17న భారత పతాకాన్ని హైదరాబాద్‌లోని బొల్లారంలో సైన్యాధిపతి జనరల్ జె.ఎన్. చౌదరి నాయకత్వాన ఆవిష్కరించారు. నిజాంను భారత ప్రభు త్వం 'రాజ్‌ప్రముఖ్'గా ప్రకటించింది. రాజ్‌ప్రముఖ్ పదవికి ప్రజలు నిరసన తెలిపినప్పటికి 1950 జనవరి 26 వరకు కొనసాగించారు.

సైన్యం రాష్ట్రంలోనే ఉండి కమ్యూనిస్టులను అణిచి వేయడాని కి వారిపై అత్యంత క్రూర హింసాకాండ సాగించాయి. తిరిగి జమీందార్లకు భూములు అప్పగించే ప్రయత్నం చేశాయి. ఈ పోరాటాన్ని అణిచి వేయడం సాధ్యం కాదని భావించిన కేంద్ర నెహ్రూ ప్రభుత్వం, తెలంగాణలో ప్రజలు ఆక్రమించిన పది లక్షల ఎకరాల భూములకు 'రక్షిత కౌలుదారీ చట్టం' తెచ్చింది. భూముల నుండి తొలగించ నని ప్రకటించింది. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడానికి వీలులేదు. ఈ చట్ట ప్రకట నతో 1951 అక్టోబర్ 21న 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తూ కమ్యూ నిస్టు పార్టీ ప్రకటించింది. సైన్యంతో జరిగిన పోరాటంలో రెండు వేల ఐదు వందల మంది నాయకులు మరణించారు. మొత్తం నాలుగు వేల మంది అమరులయ్యారు. మూడు వేల గ్రామాలలో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి.

(మిగతా 42వ పేజీలో)

# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్



- గుడిపాటి నరసింహారావు

యూరప్‌లో పరిశ్రమలు విస్తరిస్తూ, కార్మిక వర్గ దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్న 18వ శతాబ్దంలో ఒక బట్టల మిల్లు యజమాని కుటుంబంలో ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1820 నవంబరు 28న ప్రష్యా(ఇప్పటి జర్మనీ)లోని బార్మెన్ నగరంలో జన్మించాడు. ఒక సామాజిక శాస్త్రవేత్తగా, రచయితగా, తత్వవేత్తగా, బహుభాషా కోవిదుడుగా, విప్లవకారుడిగా ఏంగెల్స్ జీవించాడు. ప్రపంచగతిని మార్చిన సిద్ధాంతమైన మార్క్సిజాన్ని రూపొందించడంలో మహా మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్‌కు మిత్రుడుగా, చేదోడు వాదోడుగా జీవించాడు. ఒక పెట్టుబడిదారుని కుటుంబంలో పుట్టినా ఆ పెట్టుబడిదారీ వర్గ పెత్తనం సమాజానికి ఎంత కీడు చేస్తుందో అర్థం చేసుకుని ఆ వ్యవస్థ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసినవాడు ఏంగెల్స్.

ఏంగెల్స్‌కు చిన్నప్పటి నుండి పుస్తకాలు చదివే వ్యాపకం వుండేది. పదిహేడేళ్ల వయసులో అతని టేబుల్ సొరుగులో ఆఫ్రికాకు చెందిన 13వ శతాబ్దపు పోరాట వీరుని చరిత్ర పుస్తకాన్ని తండ్రి చూశాడు. అందుకు కలత చెంది ఏంగెల్స్‌ను చదువు మాన్పించి మాంచెస్టర్‌లోని తన బట్టల మిల్లుకు అప్రెంటిస్ శిక్షణ పేరుతో పంపించాడు. పెద్ద నౌకా కేంద్రమైన బ్రెమెన్ నగరంలోని వాణిజ్య సంస్థలో పని చేయడానికి ఏంగెల్స్ వెళ్లాడు. అక్కడ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో ఇంగ్లీషు, డచ్చి, ఫ్రెంచి తదితర భాషలలో పేపర్లు చదివేవాడు. జర్మనీలో ప్రభుత్వం నిషేధించిన సాహిత్యాన్ని చదివేవాడు. అలా ఏంగెల్స్ తన ప్రాపంచిక జ్ఞానాన్ని పెంచుకున్నాడు. 19వ ఏటనే ఏంగెల్స్ తన మిత్రులకు 15 భాషలలో లేఖలు రాసేవాడు. నిశిత పరిశీలన నేర్చుకున్నాడు. ఉప్పర్‌టాల్ అనే బట్టల మిల్లుల కేంద్ర నగరంలో బాలికలతో పనిచేయిస్తున్న పరిస్థితులను, అక్కడి ప్రజల ముఖ్యంగా కార్మికుల వెతలను పరిశీలించాడు. అక్కడి దీనగాథలు ఏంగెల్స్‌ను కదిలించి వేశాయి.

ఏంగెల్స్ 25 భాషలు మాట్లాడేవాడు. 15 భాషలలో ఉత్తరాలు, వ్యాసాలు రాసేవాడు. 1839 నుండి 42 మధ్యకాలంలో 50 వ్యాసాలను రాజకీయ, సాహిత్య, తత్వశాస్త్ర అంశాలలో రాయడం కోసం ఎంతో అధ్యయనం చేశాడు. ఇంగ్లండులోని కార్మికుల స్థితిగతుల మీద పరిశీలన సాగించి 'ఇంగ్లండులో కార్మికుల పరిస్థితి' అనే గ్రంథాన్ని రచించాడు (మార్క్స్‌తో పరిచయం కావడానికి ముందే రాసిన గ్రంథం). 'పవిత్ర కుటుంబం' పేరుతో కారల్ మార్క్స్‌తో కలసి రచించిన గ్రంథం



1846లో విడుదలైంది. వ్యక్తి ముందా? సమాజం ముందా? అనే దానికి సమాజమే ముందు అని రుజువులతో సహా ఆ గ్రంథంలో బోధించారు. మార్క్స్‌తో కలసి ఏంగెల్స్ సాగిస్తున్న కృషి, వారి తాత్విక దృష్టి, వారి పట్టుదల తెలిసిన కమ్యూనిస్టు లీగ్ 1847లో కమ్యూనిస్టు ప్రణాళికను రాసే పనిని మార్క్స్, ఏంగెల్స్‌లకు అప్పచెప్పగా అందుకోసం ఏంగెల్స్ విడిగా కమ్యూనిజం సూత్రాలు పేరుతో తన అభిప్రాయాలను మార్క్స్‌కు అందించాడు. 1848 ఫిబ్రవరి 21న విడుదలైన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో ఏంగెల్స్ ప్రతిపాదనలు చాలా భాగం ఉంటాయి.

'జర్మన్ సిద్ధాంత సంపుటి' గ్రంథాన్ని మార్క్స్‌తో కలసి రాశాడు. ఇందులో మానవుడి చైతన్యం-అస్తిత్వంలలో అస్తిత్వం యొక్క ప్రాధాన్యతను పొందుపరిచాడు. తత్వశాస్త్ర అభివృద్ధి శ్రామిక వర్గానికి ఉన్న సంబంధం అవినాభావమైనదని, అవి ఒకదానితో ఒకటి కలసి అభివృద్ధి చెందుతాయని నిర్ధారించాడు. అప్పటికే తత్వశాస్త్రంలో మార్గదర్శకత్వం వహిస్తున్న హెగెల్ గతి తర్కాన్ని బలపరిచినా హెగెల్ లోని భావవాదాన్ని ఖండిస్తూ 'దేవుడు మనిషిని సృష్టించలేదు-మనిషే దేవుడ్ని సృష్టించాడు'

అని చెప్పి భౌతికవాదాన్ని సమున్నతంగా నిలిపాడు. వానరుడు నరుడుగా మారిన క్రమంలో శ్రమ పాత్ర రచనల ద్వారా శ్రమైక జీవన సౌందర్యం సాధించుకోవచ్చని, ఆ దిశగా మానవ ప్రయాణం తథ్యమనే విశ్వాసాన్ని ఈ రచన కల్పిస్తుంది. నిరుద్యోగ సమస్య, కార్మికుల మీద ప్రభావాన్ని తెలిపే వేతన వ్యవస్థ గ్రంథంలో 'పెట్టుబడిదారుడు కార్మికునితో అంగీకారానికి రాలేకపోతే ఆగిపోయి తన పెట్టుబడి మీద బతకగలడు. కాని కార్మికుడు అలా చేయలేదు. అతనికి బతకడానికి కూలి మాత్రమే ఉంది. కనుక అతను ఎప్పుడు, ఎక్కడ, ఏ షరతుల మీద పని సంపాదించుకోగలిగితే అప్పుడు, అక్కడ, ఆ షరతుల మీద పనిని తీసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతమైతేనే నిరుద్యోగం రద్దుకు అవకాశం ఏర్పడుతుందనే విషయం తేటతెల్లం చేశాడు. పెట్టుబడి గ్రంథ రచనలోను, మార్క్స్‌తో పాటు సిద్ధాంత కృషిలో భాగస్వామిగా ఎన్నో గ్రంథాలను, సాహిత్యాన్ని ఏంగెల్స్ అధ్యయనం చేశాడు.

ప్రపంచానికి మార్క్సిజాన్ని అందించడానికి మార్క్స్ చేసిన కృషిలో భాగస్వామిగాను, విడిగాను ఎన్నో రచనలు చేశాడు. భావ సారూప్యత కారణంగా వారిద్దరూ ఆఖరి వరకూ మిత్రులుగానే జీవించారు. కార్మికవర్గ విముక్తి, మానవ కళ్యాణం కోసం కలిసి కృషి చేశారు. ఏంగెల్స్ తన జీవితాంతం మార్క్స్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచాడు. మార్క్స్‌తో పాటు పెట్టుబడి రచనలో భాగస్వామి. మార్క్స్ మరణానంతరం పెట్టుబడి 2, 3 భాగాలు ముద్రణకు కృషి చేశాడు. ఏంగెల్స్ 1895 ఆగష్టు 5న లండన్‌లో మరణించాడు.

ఏంగెల్స్ 1844 డిసెంబర్ 2న మాంచెస్టర్ వెళుతూ కార్ల మార్క్స్‌ను పారిస్‌లో కలుస్తాడు. అప్పటి నుండి వారిద్దరూ మిత్రులయ్యారు. ఆ స్నేహం కాలక్షేపం కోసం కాదు. విందులు, వినోదాలు, ఊసుపోలు కబుర్లు కోసం మాత్రం కాదు. 1844 నుండి వారి మధ్య స్నేహం మార్క్స్ బతికున్న 1883 వరకు మాత్రమే కాకుండా ఏంగెల్స్ జీవించినంత కాలం కొనసాగు తుంది. కార్మిక హక్కు విముక్తి లోక కళ్యాణం కోసం వారు ఇరువురు జీవితాంతం శ్రమించారు. వారి స్నేహం పెట్టుబడి దారి వ్యవస్థ గమన సూత్రాలను పసిగట్టి ప్రపంచానికి ముఖ్యంగా కార్మిక వర్గానికి కర్తవ్యాన్ని ప్రబోధించడానికి తోడ్పడింది. మార్క్స్ తన జీవితాన్ని అధ్యయనానికి రచనలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగానూ, ఏంగెల్స్ ఉద్యోగిగా బట్టల మిల్లు వాటాదారుడుగా పనిచేస్తూ వచ్చే ఆదాయంతో కార్మిక వర్గ తిరుగుబాట్లు, ఉద్యమాలకు మార్క్స్ కుటుంబానికి ఆర్థికంగా సహాయపడేందుకు బాధ్యత అనే విధంగా వారిద్దరి మధ్య పని పంపకం చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు విప్లవ కారులు ఆర్థికవేత్తలు సోషలిస్టులు సైంటిస్టులు తత్వవేత్తలు ఎవరైనా కారణం ప్రస్తావించుకున్నప్పుడు ఏం గెలిచిన కూడా తప్పనిసరిగా ప్రస్తావించుకోవడం జరుగుతుంది. వారు సాధారణ స్నేహితులు మాత్రమే కాకుండా జీవితాన్ని సిద్ధాంతాన్ని సహచర్యాన్ని కలిపి పంచుకున్న వారు. అంతటి బంధం వారి మధ్య కొనసాగింది. ఒక పెట్టుబడిదారుగా జన్మించిన ఎంగెల్స్ డీ క్లాస్ అయ్యి కార్మిక వర్గ దృక్పథంతో జీవించిన, చేసిన కృషి స్ఫూర్తిదాయకం. ఆయన పరిశీలన పద్ధతి నిబద్ధత అవగాహన తీరు ఆదర్శప్రాయం. ❑


## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

(40వ పేజీ తరువాయి)

### సాయుధ పోరాటంపై వక్రభాష్యాలు


పోరాటం ప్రారంభమైనప్పటి నుండీ హిందూ జమీందార్లకు, ముస్లిం నవాబుకు వ్యతిరేకంగా ముస్లింల నాయక త్వాన ఏర్పడిన కామ్రేడ్స్ అసోసియేషన్, కమ్యూనిస్టుపార్టీ, కిసాన్‌సభ నాయకత్వాన ప్రజలు ఐదు సంవత్సరాల ఒక మాసం సుదీర్ఘకాలం పోరాటం కొనసాగించారు. ఈ పోరాటంలో కుల, మతాలకు తావులేదు. రెండు పక్షాలలో హిందూ, ముస్లింలు ఉన్నారు. బందగి, షోయబుల్లా ఖాన్ (విలేకరి)తో సహా అనేకమంది ముస్లింలను చంపివేశారు. పోరాటంలో హిందూవులతోపాటు ముస్లింలు, మరాఠీలు కూడా పాల్గొన్నారు. అన్ని కులాలవారు ఒకే వేదికపై వచ్చి వర్గపోరాటం చేసి విజయం సాధించారు. ఈ పోరాటంలో ఒక కులం, మతం ఓటమి, మరో కులం, మతం గెలుపు అనేది లేదు.


సాయుధ పోరాటం ముగిసిన 1951 అక్టోబర్ 21న బీజేపీ మాతృక అయిన 'జన సంఘం' ఏర్పడింది. ఈ పోరాటంతో జన సంఘానికి ఎలాంటి సంబంధం లేదు. 1925 సెప్టెంబర్ 25న ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌కు కూడా పోరాటంతో సంబంధం లేదు. అలాంటివారు నేడు విముక్తి ఉత్సవాలు జరుపుతామంటూ ప్రకటించడం నిరసించదగినది. ప్రజా వర్గపోరాటానికి మతం రంగు పులిమి అపవిత్రం చేసే ప్రయత్నాలను ఖండించాలి. పోరాటం ఫలితంగా నైజాం ప్రజల కోరిక మేరకు భారతదేశంలో విలీనమైంది. జాతీయ కాంగ్రెస్ కూడా నైజాం ప్రభుత్వం కొనసాగడానికే అనుకూలంగా ఉన్నట్లు చరిత్ర చెపుతున్నది. సుశిక్షితులైన సైన్యాలతో జరిగిన పోరాటంలో ప్రజలు చేసిన పోరాటం మహత్తరమైంది. నాటి పోరాట నాయకులు తమ భూములను పేదలకు పంచి నాయకత్వం వహించారు. ఈ పోరాటాన్ని వక్రీకరించడం ద్వారా బీజేపీ తన కుటిలబుద్ధిని ప్రదర్శించుకుంటుంది. భారతదేశ చరిత్రనే మార్చాలని చేసే ప్రయత్నాల్లో ఇది ఒక భాగమే. ప్రజలు దీనికి తగిన గుణపాఠం చెపుతారు. ❑




కనికట్టు

హంగామా









డోన్ట్ టాక్

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 2 - Issue No : 1 October 2023




కొత్త పుస్తకాలు
స్వీకారం







if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.